

కమ్యూనిస్టులకు చట్టసభల్లో ప్రాతినిధ్యముండాలి

ప్రజల పక్షాన నిజాయితీగా పోరాడేది మేమే

- అసెంబ్లీలో ఉంటే మరింత ప్రయోజనం
- వామపక్ష, ప్రజాతంత్ర, సామాజిక, లౌకిక, పోరాడే శక్తులకు మద్దతు
- మునుగోడు ఎన్నికలపుడు కేసీఆరే మా మద్దతు అడిగారు
- ఆ తర్వాత కూడా ఇది కొనసాగుతుందని ఆయనే చెప్పారు
- ఇప్పుడు కూడా కాంగ్రెస్ నాయకులే కలిసి పోటీ చేద్దామన్నారు

మేం ఎవరితో పొత్తుకు వెంపర్లాడలేదు బీజేపీని ఓడించడమే మా లక్ష్యం : తమ్మినేని వీరభద్రం

రాష్ట్రంలో కమ్యూనిస్టులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉండాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. ఈ ఎన్నికల్లో వామపక్షాలను ఆదరించాలనీ, సీపీఐ(ఎం)ను అసెంబ్లీకి పంపాలని కోరారు. ప్రజల పక్షాన సమస్యలపై నిజాయితీగా పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉంటేనే ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. లేకుంటే ప్రజలకు నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులను గెలిపించాలనీ, తెలంగాణలో ఎర్రజెండా రాజ్యం రావాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో పొత్తు కోసం తాము వెంపర్లాడలేదని చెప్పారు. బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమన్నారు. ఈ ఎన్నికల్లో వామపక్ష, ప్రజాతంత్ర, సామాజిక, లౌకిక, పోరాడే శక్తులకు మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. ప్రజలు దీన్ని అర్థం చేసుకుని వామపక్షాలకు ఓటేయాలనీ, సీపీఐ(ఎం)ను బలపరిచి అసెంబ్లీకి పంపాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు తమ్మినేని ప్రత్యేక ఇంటర్వ్యూ..

బూర్జువా పార్టీల స్వభావం గురించి తెలిసినా బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో పొత్తు ప్రయత్నం ఎందుకు? సొంతంగా పోటీ చేసే అవకాశం లేదంటారా?

బీఆర్ఎస్‌తో పొత్తుకు, కాంగ్రెస్‌తో పొత్తుకు మేము వెంపర్లాడలేదు. ఆ పార్టీలతో పొత్తు కావాలని మేం కోరలేదు. మునుగోడు ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ మాతో బీజేపీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే చేరాడు. బీజేపీని ఓడించడం మీ విధానం కాబట్టి సహకరించాలని కోరారు. అయితే ఆయన కోరినందుకు మేం మద్దతివ్వలేదు. బీజేపీ అక్కడ గెలిచే ప్రమాదముంది. బీజేపీ నాయకుల వ్యూహం అదే. అక్కడ గెలిచి తెలంగాణ ప్రజానీకానికి ఓ సంకేతం పంపాలనుకున్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌ను ఓడించేది బీజేపీయే అన్నది ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావించారు. ఆ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే వారి వ్యూహం ఫలించేది. రాష్ట్రంలో బీజేపీ బలపడం, మతోన్మాద రాజకీయాలు పెరగడం ప్రజలకు ప్రమాదం. అందుకే బీజేపీని ఓడించడం కోసమే బీఆర్ఎస్‌కు మద్దతిచ్చాం. ఆ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులూ మా కార్యాలయానికి వచ్చి మద్దతు అడిగారు. బీఆర్ఎస్‌ను సమర్థించాలా?, కాంగ్రెస్‌ను సమర్థించాలా? అనేది మా సమస్య కాదు. బీజేపీని ఓడించడమే మా లక్ష్యం. ఈ విషయాన్నే కాంగ్రెస్‌కు చెప్పాం. ఓడించే శక్తి ఎవరికుంది? అనేది ప్రశ్న. క్యాడర్‌ను నిలబెట్టి బీజేపీని ఓడించే శక్తి ఉంటే కాంగ్రెస్‌కే మద్దతు ఇస్తామని ఆనాడే చెప్పాం. కానీ కాంగ్రెస్ ఆ పరిస్థితిలో లేదు. అయితే బీఆర్ఎస్ పాలన పట్ల మాకు అభ్యంతరాలున్నాయి. కానీ అక్కడున్న పరిస్థితిలో మా కర్తవ్యం బీజేపీని ఓడించడం. అందుకే బీఆర్ఎస్‌కు మద్దతిచ్చాం. ఇది ఎన్నికల ఫలితాల్లో రుజువైంది. బీజేపీని ఓడించడంలో ...2లో

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 05-11-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 305 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 8 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు + సోపతి(వెబ్‌లో) వెల : 8.00



నేపాల్‌లో భారీ భూకంపం

• 157 మంది మృతి • అనేక ఇళ్లు నేలమట్టం • కొనసాగుతున్న సహాయ చర్యలు

ఖాట్మండు : నేపాల్‌లో శనివారం ఉదయం తీవ్రమైన భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.4గా నమోదైంది. దీని ధాటికి 157 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. పలు నివాస గృహాలు నేలమట్టమయ్యాయి. కొన్ని ఇళ్లు బీటలు వారాయి. వేలాది మంది చలికి వణుకుతూ బహిరంగ ప్రదేశాల్లోనే కాలక్షేపం చేశారు. భూకంపం తర్వాత రిక్టర్ స్కేలుపై 3.3 తీవ్రతతో అనేకసార్లు ప్రకంపనలు రావడంతో ప్రజలు భయభ్రాంతులయ్యారు. గాయపడిన వారికి వైద్య సాయం అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. పరిస్థితిని సమీక్షించేందుకు ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. విద్యుత్ ...7లో



గాంధీ భజన గాడ్సే ఆచరణ

మోడీ డబుల్ రోల్



• ఎన్నికల బాండ్లతో అస్మదీయులకు లబ్ధి • సంతానం కమిటీ సిఫార్సులు బుట్టదాఖలు

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు 'నేను గాంధీజీ దేశం నుండి వచ్చాను' అని గొప్పగా చెబుతుంటారు. ఆయన ఆదర్శాలను మాత్రం విస్మరిస్తుంటారు. ఎన్నికల వ్యయంపై 1931 సెప్టెంబర్ 17న గాంధీజీ లండన్‌లో జరిగిన ఫెడరల్ వ్యవస్థ కమిటీ భేటీలో మాట్లాడుతూ... రాజకీయ పార్టీలు తమ ఎన్నికల వ్యయం కోసం పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ వంటి పేద దేశంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి 60 వేల నుండి లక్ష రూపాయల వరకూ (ఆ రోజుల్లో) ఖర్చు చేయడం దారుణమని చెప్పారు. ఇప్పుడు గాంధీజీ జీవించి ఉంటే అభ్యర్థుల ఖర్చు చూసి ఏమనేవారో?.

మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిని కూడా మోడీ ప్రశంసిస్తుంటారు. కానీ లాల్ బహదూర్ శాస్త్రి కేంద్ర హోం మంత్రిగా ఉన్నప్పుడు 1962లో ఏర్పాటు చేసిన సంతానం కమిటీ ఇచ్చిన నివేదికను మాత్రం మోడీ ఎప్పుడూ ప్రస్తావించరు. స్వాతంత్ర్యానంతరం అవినీతిపై ఏర్పడిన తొలి కమిటీ అదే. సంతానం కమిటీ 'అన్ని రాజకీయ పార్టీలు తమ జమాఖర్చుల వివరాలను సరైన పద్ధతిలో నమోదు చేయాలి. ఎవరెవరు ఎంత మొత్తంలో అందజేశారో తెలియజేయాలి. అలాంటి ఖాతాలను ఆడిట్ చేయించి ప్రచురించాలి' అని సూచించింది. ఎన్నికల బాండ్ల పథకంపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న నేపథ్యంలో సంతానం కమిటీ చేసిన సూచనకు ఎంతో ప్రాధాన్యత ఉంది. రాజకీయ పార్టీలు ...7లో

మోడీ ప్రభుత్వం 2017లో ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా అధికార బీజేపీకి వచ్చిన ఎన్నికల విరాళాలు రూ.52,000 కోట్లకు పైమాటే. మరి ప్రతిపక్ష కాంగ్రెస్‌కు వచ్చిన విరాళం ఎంతో తెలుసా? కేవలం రూ.952 కోట్లు. ఇప్పుడు మోడీ పాలనలో బీజేపీ పెద్ద మొత్తంలో విరాళాలు పొందడాన్ని, ఎన్నికల సమయంలో వాటిని విచ్చలవిడిగా ఖర్చు చేయడాన్ని చూస్తున్నాం. మహాత్మా గాంధీ మాటల్లో చెప్పాలంటే ఇది 'ఎన్నికలను మ్యానేజ్ చేయడమే'.

బహిర్గతం చేయాలి

సంతానం కమిటీ మరో వ్యాఖ్య కూడా చేసింది. 'అత్యున్నత రాజకీయ స్థాయిలో అవినీతి జరుగుతోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో పార్టీలకు అందుతున్న సొమ్ము వారి అభిప్రాయానికి బలం చేకూరుస్తోంది. పెద్ద మొత్తంలో నిధులు లేకుంటే రాజకీయ పార్టీని నడపడం, ఎన్నికల్లో పోటీ చేయడం సాధ్యం కాదు. అయితే ఈ నిధులు పార్టీల మద్దతుదారులు, సానుభూతిపరుల నుండి బహిరంగంగానే రావాల్సి ఉంటుంది' అని తెలిపింది. ప్రజలకు సమాచారం కోసం రాజకీయ పార్టీలు తమకు ఎవరెవరి నుండి ఎంత మొత్తంలో నిధులు అందాయో ఖాతాల్లో పొందుపరిచి, వాటిని ప్రచురించాలని సంతానం కమిటీ నొక్కి చెప్పింది.

6 నుంచి ఎన్నికల బాండ్ల విక్రయం — కేంద్రం గ్రీన్ సిగ్నల్ 2లో..

కల్వకుంట్ల దోపిడీకి కాళేశ్వరం బలి

బ్యారేజీ కుంగిపోవడం జాతీయ విపత్తు : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి



- సీఎం, మంత్రి హరీశ్‌రావును పదవుల నుంచి తొలగించాలి
- కేసీఆర్ ఆర్థిక ఉగ్రవాది, ఆయన డిక్షనరీ నుంచి పుట్టిందే 'రీడిజైన్'
- ప్రాజెక్టు అంచనాలు పెంచారు...వేల కోట్లు కొట్టేశారు...
- ప్లాన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అన్నింటిలోనూ వైఫల్యమే
- నిపుణులతో ఓ కమిటీ వేయాలి...సీబీఐ విచారణ జరిపించాలి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలు పెంచేసి వేల కోట్లు కొట్టేశారని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. వారి ధన దాహానికి ఆ ప్రాజెక్టు బలి అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఓ ఆర్థిక ఉగ్రవాది అని ఆరోపించారు. బ్యారేజీ కుంగిపోవడం ఓ జాతీయ విపత్తు అన్నారు. ప్రాజెక్టు ప్లానింగ్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ తదితరాంశాల్లోనూ వైఫల్యమే ...7లో

ఢిల్లీ గులాములా? తెలంగాణ బిడ్డలా?

రాష్ట్ర ప్రజలే నిర్ణయిస్తారు కాంగ్రెస్‌కు అధికారమిస్తే రాష్ట్రం అధోగతే

- బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోంది
- డీకే శివకుమార్ రాష్ట్రంపై విషం కక్కుతున్నారు : న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో, హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం జలవిహార్‌లో ఏర్పాటు చేసిన న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ గులాంలు కావాలా? తెలంగాణ బిడ్డలు కావాలా? రాష్ట్ర ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. కాంగ్రెస్ గద్దెనెక్కితే ముఖ్యమంత్రి సీటు కోసం కొట్లాడెందుకే సమయం దొరకదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్ రెడ్డి ఎన్నికల్లో డబ్బులు పంచకూడదని మాట్లాడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీజేపీ బీసీ ముఖ్యమంత్రి నినాదాన్ని కొట్టి పారేసారు. ఒకటి రెండు సీట్లు ...7లో

ఆమె ఓటే శాసనం!

20 జిల్లాల్లో మహిళా ఓటర్లే అధికం

- వీరు ఎటువైపు మొగ్గుచూపితే ఆ పార్టీదే విజయం
- ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ పార్టీల పాట్లు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రానున్న ఎన్నికల్లో గెలిచి శాసనసభలో ఎవరు అడుగుపెట్టాలన్నా.. అధికారాన్ని కైవసం చేసుకోవాలన్నా మహిళల ఓట్లే కీలకంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలుండగా అందులో 20 జిల్లాల్లో పురుషుల ఓట్ల కంటే మహిళలే ఓట్లే అధికంగా ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఎనిమిదింటిలో మహిళల కంటే పురుషుల ఓట్లు తక్కువగా ఉన్నాయి. రెండింటిలో మాత్రమే పురుషుల ఓట్లు అధికంగా ఉన్నాయి. గెలుపోటములు నిర్ణయించే శక్తి మహిళలదే కావడం విశేషం. అందుకే మహిళల ఓట్లను రాబట్టుకోవడమే లక్ష్యంగా రాజకీయ పార్టీలు సైతం దృష్టిసారించాయి. మ్యానిఫెస్టోల్లో మహిళలకు ప్రత్యేకస్థానం కల్పించాయి. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రాగానే ఆయా పథకాలను అమలు చేస్తామని వాగ్దానాలు చేస్తున్నాయి. ఏ సభ జరిగినా మహిళలకు కేటాయించబోయే పథకాల గురించే నేతలు ప్రస్తావిస్తున్నారు. కర్నాటకలో చేసి చూపించామని కాంగ్రెస్ పార్టీ చెబుతుండగా, తెలంగాణలో గతంలోనే మహిళాభివృద్ధి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తూ ఉన్నామని బీఆర్ఎస్ చెబుతోంది. ఎన్నికల అనంతరం తమ ప్రభుత్వమే ఏర్పడుతుందని, మరిన్ని పథకాలు అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో ప్రస్తావించిన వాటిని వెల్లడిస్తున్నారు. మహిళలు ఏ పార్టీవైపు మొగ్గు చూపుతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ఎన్నికలు రావడంతో మహిళలపై ప్రధాన రాజకీయ పార్టీలు ఎనలేని ప్రేమను ఒలకబోస్తున్నాయి. రాష్ట్రంలోని ...7లో





రెడిమిక్స్ ప్లాంట్‌లో ప్రమాదం

మిక్సర్‌లో పడి ఇద్దరు కార్మికులు మృతి

- నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో ఘటన

నవతెలంగాణ- గండిపేట్

రెడిమిక్స్ ప్లాంట్‌లో ప్రమాదం జరిగింది. మిక్సర్‌లో పడి ఇద్దరు వలస కార్మికులు మృతిచెందారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. నార్సింగి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ మున్సిపల్ పరిధిలోని పుప్పాల్‌గూడ ఏఎస్‌బీఐ స్కెక్టా ప్రయివేట్ కన్‌స్ట్రక్షన్‌లోని క్రషర్ ప్లాంట్‌లో జార్ఖండ్‌కు చెందిన సోరెన్(44), సునీల్ ముర్‌మ్(39) పనిచేస్తున్నారు. ఉదయం ఇద్దరూ క్రషర్ ప్లాంట్ మిక్సర్ లోపల శుభ్రం చేసేందుకు వెళ్లారు. ఆ సమయంలో మిషన్ ఆన్ చేయడంతో కార్మికులు ఇద్దరు మిషన్‌లోనే నుజ్జునుజ్జయ్యారు. తోటి కార్మికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాలను పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు ...7లో

ఆలయంలో నామినేషన్ పత్రాలు

కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి గుడిలో కేసీఆర్, హరీశ్‌రావు పూజలు



నవతెలంగాణ- నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి గ్రామ వెంకటేశ్వర స్వామివారిని సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు శనివారం మధ్యాహ్నం దర్శించుకు న్నారు. అంతకుముందు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో కేసీఆర్‌కు స్వాగతం పలికారు. స్వామివారి పాదాల ముందు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు నామినేషన్ పత్రాలు పెట్టి పూజలు చేశారు. అనంతరం నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ నెల 9న గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ నామినేషన్ వేయనున్నారు. అదే రోజు సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు నామినేషన్ వేయనున్నా రు. వారి వెంట ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్మెన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీ వేణుగోపాల్ చారి, బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంశీధర్‌రావు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సుడా, ఉన్నారు.

ఢిల్లీలో వాయు కాలుష్యం మరింత తీవ్రం

న్యూఢిల్లీ : ఢిల్లీలో గాలి కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. దట్టమైన పొగ మంచు దుప్పటి ఢిల్లీని కప్పేస్తోంది. వరుసగా మూడరోజు శనివారం కూడా వాయు నాణ్యతా సూచీ (ఎక్యూఐ) 540కు చేరింది. అయితే పెరిగిన గాలి వేగంతో రాత్రిపూట కాలుష్య స్థాయిలు స్వల్పంగా మెరుగుపడినప్పటికీ .. దేశ రాజధాని, పరిసర ప్రాంతాల్లో గాలిలో విషవాయువులు పిఎం 2.5కి చేరింది.

ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన పరిమితి కంటే 80 రెట్లు ఎక్కువని అధికారులు తెలిపారు. దీంతో పిల్లలు, వద్దులలో శ్వాస కోశ మరియు కంటి సమస్యలు అధికమవతున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ మెరుగైన వాయు నాణ్యతా ప్రమాణం కోసం చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌ని కోరారు. ఉత్తర భారత దేశం మొత్తం ఇదే గాలిని పీలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో అత్యవసరం కాని నిర్మాణాలను నిలిపేయడంతో పాటు కార్ల రాకపోకలను నిషేధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.





కమ్యూనిస్టులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

కమ్యూనిస్టులు ప్రధాన భూమిక పోషించారు. అది మునుగోడు ఎన్నికల వరకే పరిమితమని కూడా మేం స్పష్టం చేశాం. సీఎం కేసీఆరే కమ్యూనిస్టులతో స్నేహం మునుగోడు ఎన్నికల వరకే పరిమితం కాదనీ, రాబోయే ఎన్నికల్లోనూ కొనసాగుతుందని ఖమ్మం సభలో ప్రకటించారు. కేరళ ముఖ్యమంత్రిని పిలిచారు. బీఆర్ఎస్ పాలనలో లోపాలున్నా బీజేపీకి వ్యతిరేకంగా కేసీఆర్ నిలబడడాన్ని మేం స్వాగతించాం.

బీఆర్ఎస్ మీకు ఎందుకు సీట్లు ఇవ్వకుండా నిరాకరించిందంటారు?

బీఆర్ఎస్‌గానీ ఇతర ప్రాంతీయ పార్టీలుగానీ అవకాశవాదంతో వ్యవహరిస్తాయి. టీడీపీ, వైసీపీ, ఎస్పీ, బీఎస్పీ ఇలా ప్రాంతీయ పార్టీలన్నీ రాజకీయ అవసరాల కోసం నిర్ణయాలు తీసుకుంటాయి. ఆనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను గద్దెదించడమే మా లక్ష్యమని బీజేపీ ప్రకటించింది. అందుకనుగుణంగానే హుజూరాబాద్, దుబ్బాక, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రభావం చూపింది. ఆ ఊపులో అసెంబ్లీ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ అన్న వాతావరణాన్ని సృష్టించాలని భావించింది. ఆ సమయంలో కేసీఆర్‌కు మరో మార్గం లేదు. ఆయన సీటుకే ఎసరొచ్చింది. అందుకే బీజేపీని వ్యతిరేకించారు. ఆయన ఏ వైఖరితో నిర్ణయం తీసుకున్నా బీజేపీని ఓడిస్తామన్నారు కాబట్టి మేం బీఆర్ఎస్‌ను సమర్థించాం. ఆ పరిస్థితుల్లోనే మునుగోడులో పొత్తు సాగింది.

ఆ తర్వాత కర్నాటక ఫలితాలొచ్చాయి. దీంతో రాష్ట్ర రాజకీయ పరిస్థితిలో మార్పు వచ్చింది. బీజేపీ మూడో స్థానంలోకి వెళ్లిపోయింది. దీంతో ఆ పార్టీ నాయకులు వేరే పార్టీల్లోకి పోతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంది. బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్టుగా మారింది. కేసీఆర్ మూడ్ మారిపోయింది. బీజేపీ ప్రమాదం లేదు. ఈ ఎన్నికల్లో అవసరమైతే సీట్లు తక్కువైతే బీజేపీ, ఎంఐఎం మద్దతు తీసుకునే పరిస్థితి ఉన్నది. అందుకే కమ్యూనిస్టుల అవసరం కేసీఆర్‌కు లేదు. అవకాశవాదంతో రాజకీయాలను మార్చారు. మమ్మల్ని దూరం పెట్టారు. ఆ తర్వాత కాంగ్రెస్ కోసమూ మేం వెంపర్లాడలేదు. కమ్యూనిస్టులతో ఉంటేనే గెలుస్తామనే పరిస్థితి కాంగ్రెస్‌కు అప్పుడు ఉన్నది. అందుకే మాణిక్‌రావు ఠాక్రే స్వయంగా నాకు ఫోన్ చేసి పొత్తు ఉండాలని కోరుకుంటున్నామని చెప్పారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఎవరూ లేకుండానే గెలవగలం అనే నమ్మకంతో ఉన్నట్టున్నారు. అనేక మంది చేరుతున్నారు. అధికారంలోకి వస్తామను కుంటున్నారు. అందుకే కమ్యూనిస్టులకు నాలుగు సీట్లు ఇవ్వడం ఎందుకన్న అభిప్రాయంతో కాంగ్రెస్ నాయకులున్నారు. అందుకే సీట్లు నిరాకరిస్తున్నారు.

కాంగ్రెస్ సీట్లు ఇస్తామని అంగీకరించింది కదా? ఎందుకివ్వలేదంటారు?

భద్రాచలం, మధిర సిట్టింగ్ సీట్లు కాబట్టి ఇవ్వలేమన్నారు. బలమైన నాయకులు వచ్చారు కాబట్టి పాలేరు ఇవ్వలేదు. అయినా వాటిని వదిలేశాం. మేం అడగకపోయినా వైరా ఇస్తామన్నారు. తర్వాత అలా చెప్పలేదంటూ మాట మార్చారు. ఇప్పుడు మిర్యాలగూడ, హైదరాబాద్‌లో ఒక సీటు ఇస్తామంటున్నారు. అది మలక్‌పేట లేదా చాంద్రాయణగుట్ట ఏదో ఒకటి ఇవ్వొచ్చు. అది కూడా స్పష్టంగా చెప్పలేదు. మాట తప్పింది కాంగ్రెస్. దీనికి కాంగ్రెస్సే సమాధానం చెప్పాలి. పాలేరు మా బలమైన సీటు కాబట్టి అడిగాం. అయినా ఇప్పుడు దానికోసం పట్టుపట్టలేదు. వదిలేశాం. వైరా కోరలేదు అయినా ఇస్తామంటే సరే అన్నాం. ఇప్పుడు అదీ ఇవ్వబోమంటున్నారు. ఏ సీట్లు ఇస్తారో స్పష్టత లేదు. అనివార్య పరిస్థితుల్లోనే మేం ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించాం. అందుకనుగుణంగానే 17 సీట్లలో పోటీలో ఉంటామని ప్రకటించాం.

కమ్యూనిస్టుల బలం తగ్గిందన్న అభిప్రాయం ప్రజల్లో ఉన్నది కదా? దీనిపై ఏమంటారు?

మా బలమేంటో తెలియకే బీఆర్ఎస్, కాంగ్రెస్ పొత్తు కావాలని మమ్మల్ని సంప్రదించాయా?. మా బలాన్ని బట్టే సీట్లు అడిగాం. 119 సీట్లు కావాలని మేం అడగలేదు. అయినా ఇవ్వడానికి నిరాకరించారు.

కమ్యూనిస్టులు సొంతంగా పోటీ చేయొచ్చు కదా?

అప్పుడు మీరే అంటారు తక్కువ బలం ఉన్నా ఎక్కువ సీట్లలో పోటీ చేస్తున్నారు?అని. ఎవరికో సహాయం చేయడానికే ఇలా చేస్తున్నారని అంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడానికే ప్రయత్నం చేస్తున్నారని అంటారు. ఇప్పుడు ఒక ట్రెండ్ ఉంది. కొన్ని పత్రికలు, కమ్యూనిస్టులను వ్యతిరేకించే వారు ఓ అభిప్రాయంతో ఉన్నారు. కమ్యూనిస్టులు ఏ నిర్ణయం తీసుకున్నా దాన్ని విమర్శిస్తుంటారు. ఒక పార్టీతో కలిసి పోటీ చేస్తే తోక పార్టీ అంటారు. విడిగా పోటీ చేస్తే ఎవరికో సహాయం చేయడానికి అంటారు.

ఏం చేసినా అపనిందలు వేసి ప్రచారం చేస్తున్నారు. వాటి ఆధారంగా రాజకీయాలు, నిర్ణయాలు మేం చేయడం లేదు. మాకు సీట్లు వద్దని కాంగ్రెస్‌కు కొందరు మద్దతు ఇచ్చారు. కమ్యూనిస్టులు ఆ వైఖరి తీసుకోలేరు. జెండా, ఎజెండా, విధానం మాకు ఉంది. గెలిచినా, ఓడినా ప్రజల్లోకి వెళ్తాం. వందేండ్ల చరిత్రలో కమ్యూనిస్టులు ఎప్పుడూ గెలుస్తూనే ఉన్నారా?. పార్లమెంటరీ వ్యవస్థలో ఎన్నికల్లో పోటీ చేయాలి. కమ్యూనిస్టుల విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం ఓ సాధనంగా వినియోగించుకుంటాం. గెలిస్తేనే పోటీ చేయాలి. ఓడిపోతే పోటీ చేయొద్దు అని భావించడం సరైంది కాదు. అపనిందలను ఎదుర్కొంటాం. వాటికి భయపడి మా విధానాన్ని మార్చుకోలేం కదా.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఎవరిని గెలిపించాలంటారు? ఎవరిని ఓడించాలంటారు? మీరు ఏ పార్టీకి మద్దతిస్తారు?

మేం తీసుకునే నిర్ణయాలు రాజకీయ విధానానికి లోబడి ఉంటాయి. మాకు సీట్లు ఇవ్వడానికి నిరాకరించారు కాబట్టి ఆ పార్టీలను గుడ్డిగా వ్యతిరేకించం. కోపతాపాలతో నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదు. మాకు రాజకీయ విధానం ఉంది. అందుకనుగుణంగా నిర్ణయాలుంటాయి. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రాకూడదు. ఒక్క సీటునూ గెలవొద్దన్నదే మా లక్ష్యం. మతోన్మాదం, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడం, ప్రయివేటీకరణ వంటి విధానాలను ఆ పార్టీ అనుసరిస్తున్నది. అందుకే దేశ రక్షణ కోసం దేశభక్తియుతమైన లక్ష్యం మేం నిర్దేశించుకున్నాం. మేం నష్టపోయినా సరే పోటీ చేసే అవకాశం లేకపోయినా సరే బీజేపీని మాత్రం గెలవనీయకూడదు. బీజేపీ గెలిచే అవకాశం ఉన్న చోట కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్‌లో ఏది బలంగా ఉంటే ఆ పార్టీకి మద్దతిస్తాం. ఆ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలుంటాయి. మిగతా చోట్ల వారికి మద్దతు ఇవ్వాల్సిన అవసరం మాకేంటి?. మాకు సీట్లు ఇవ్వకుండా, మమ్మల్ని గౌరవించకుండా, మా ప్రయోజనాలను కాపాడని పార్టీలకు మేం ఎందుకు మద్దతివ్వాలి.

సీపీఐ, ఎంఎల్ పార్టీలు, బీఎస్పీ వంటి పార్టీలకు మద్దతిస్తాం. ఎవరూ లేకుంటే స్వచ్ఛంధ సంస్థలు, ప్రజల కోసం పనిచేసే వారికి మద్దతు ఇస్తాం. ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నది మా విధానం కాదు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఓడించాలన్న లక్ష్యం మాకు లేదు. దేశ రాజకీయాల్లో బీజేపీని, మతోన్మాదాన్ని ఓడించాలన్నదే మా లక్ష్యం. ఆ మతోన్మాద శక్తులకు సహకరించే పార్టీలను ఓడించాలన్నది మా విధానం. వ్యతిరేకించే శక్తులకు మేం మద్దతిస్తాం.

ఈ ఎన్నికల్లో ఏ నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నారు?

మేం మూడు నినాదాలు తీసుకున్నాం. ఒకటి, బీజేపీని ఓడించాలి. రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదు. అయినా ఆ పార్టీ ఒక్క సీటూ గెలవొద్దు. దాన్ని ఓడించడమే మా కర్తవ్యం. రెండు, కమ్యూనిస్టులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉండాలి. అది ప్రజల గొంతు వినిపించడానికి ఉపయోగపడుతుంది. శ్రామికవర్గం, కార్మికవర్గం, ఆశాలు, అంగన్‌వాడీలు, వ్యవసాయ కార్మికులు, రైతులు, మహిళలు, యువకులు, విద్యార్థులందరి ప్రయోజనాలు కాపాడేది, అందరి కోసం నిజాయితీగా పోరాడేది కమ్యూనిస్టులే. పార్లమెంటు, అసెంబ్లీలో ప్రాతినిధ్యం లేకపోయినా ప్రజాక్షేత్రంలో పోరాటాలు నిర్వహిస్తున్నది. మూడు, ప్రజల తరపున ఉద్యమిస్తున్నది కమ్యూనిస్టులే. చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉంటే ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుంది. కమ్యూనిస్టులు పోటీ చేయని చోట ఇతర వామపక్ష శక్తులు సీపీఐ, ఇతర కమ్యూనిస్టులు, సామాజిక శక్తులు బీఎస్పీ, ఇతర పార్టీలు, లౌకిక శక్తులు, పోరాడే శక్తులకు ఓటేయాలని చెప్తాం.

6 నుంచి ఎన్నికల బాండ్ల విక్రయం

న్యూఢిల్లీ : మరికొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 29వ విడత ఎన్నికల బాండ్ల విక్రయాలను నవంబరు 6 నుంచి ప్రారంభిస్తున్నట్టు తెలిపింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కు చెందిన 29 శాఖల్లో నవంబరు 6 నుంచి 20 వరకు ఈ బాండ్లను కొనుగోలు చేయొచ్చని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. బెంగళూరు, లక్నో, సిమ్లా, డెహ్రాడూన్, కోల్‌కతా, గువహతి, చెన్నై, పాట్నా, ఢిల్లీ, చండీగఢ్, శ్రీనగర్, గాంధీనగర్, భోపాల్, రాయపూర్, ముంబయి నగరాల్లోని ఎస్‌బీఐ శాఖల్లో ఎన్నికల బాండ్లను విక్రయించనున్నారు.

నవంబరు 7 నుంచి 30 వరకు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు ఒక రోజు ముందు ఎన్నికల బాండ్ల విక్రయాలు ప్రారంభించడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2018 మార్చి నుంచి నిర్ణీత కాల వ్యవధుల్లో ఇప్పటి వరకూ 28 విడతల్లో ఎన్నికల బాండ్లను ఎస్‌బీఐ ద్వారా విక్రయించారు. తాజాగా 29వ విడత విక్రయాలకు కేంద్రం అనుమతినిచ్చింది.అర్హత కలిగిన రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చాలని భావించే వ్యక్తులు, సంస్థలు, కంపెనీలు ఈ బాండ్లను కొనుగోలు చేయొచ్చు. జారీ అయిన తేదీ నుంచి 15 రోజుల వరకే ఇవి చెల్లుబాటవుతాయి. గడువు తేదీ ముగిసిన తర్వాత బాండ్లను జమ చేసినా... ఎలాంటి నగదు జమ కాదు. ఏ రాజకీయ పార్టీ అయినా తన ఖాతాలో ఈ బాండ్లను డిపాజిట్ చేసిన రోజే నగదు మొత్తం జమ అవుతుంది. గత లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ఒకశాతం కంటే ఎక్కువ ఓట్లు పోలైన రాజకీయ పార్టీలకు ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాలు పొందే అర్హత ఉంటుంది.

సీపీఎస్‌యూ పరిరక్షణోద్యమం ఉధృతం చేస్తాం : సీఐటీయూ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఎస్‌యూల పరిరక్షణోద్యమాన్ని రాష్ట్రంలో ముమ్మరం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీడీఈయూ (సిఐటియు అనుబంధం) అధ్యక్షులు ఎ. బాపూరావు అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగుల సమావేశం జరిగింది. అందులో జె.వెంకటేశ్ మాట్లాడుతూ..2023 ఆగస్ట్ పార్లమెంట్ సమావేశాల్లో ఆయిల్ సెక్టార్‌తో ఏడు ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించేందుకు నిర్ణయించిందనీ, ఈ చర్యలకు వ్యతిరేకంగా విశాల ఐక్య ఉద్యమాన్ని నిర్మించడం చారిత్రక అవసరమని చెప్పారు. అందులో సీఐటీయూ చొరవ కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ అబ్బాస్, ఎ.యాదగిరి, టి.సత్తయ్య శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై దర్యాప్తు జరపాలి : వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కమీషన్ల కక్కుర్తి వల్లనే కాళేశ్వరానికి ఈ దుస్థితి పట్టిందని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై సమగ్ర దర్యాప్తు జరపాలని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేసీఆర్ మాటలు పేరు గొప్ప ఊరు దిబ్బ లెక్కుందని ఎద్దేవా చేశారు. నా రక్తం, నా చెమట అని కల్లబొల్లి మాటలు చెప్పి నమ్మించాలని చూశారనీ, అయితే ఆ ప్రాజెక్టు పేక మేడల్లా కూలిపోయిందన్నారు. రాష్ట్ర ప్రజల సంపద రూ.1.27 లక్షల కోట్లు ఎందుకు ఖర్చు పెట్టినట్టు అని ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజ్ పై డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన రిపోర్టు పరిశీలిస్తే.. మెగా అవినీతికి నిదర్శనమని విమర్శించారు.

కేసీఆర్‌పై ఈసీ చర్యలు తీసుకోవాలి


- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

2018 ఎన్నికల్లో గజ్వేల్ నుంచి పోటీ చేసిన కేసీఆర్ తన ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన స్థిరాస్తుల వివరాలు ఉద్దేశపూర్వకంగానే వెల్లడించలేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి ఆయనపై ఫిర్యాదు చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 ఉల్లంఘించినందుకు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2018 ఎన్నికల్లో కేసీఆర్ దాఖలు చేసిన అఫిడవిట్‌లో కోటి రూపాయలకు పైగా ఆస్తులు మాత్రమే ఉన్నట్టు చూపారని పేర్కొన్నారు. ఎర్రవల్లిలో తన పేరుపై ఉన్న భూముల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో చూప కుండా ఉద్దేశపూర్వకంగా దాచారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందున ఆయనపై క్రిమి నల్ కేసు నమోదు చేసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిగా ప్రకటించాలని ప్రవీణ్‌కుమార్ కోరారు.

సరోజినీ ఆస్పత్రిలో వరవరరావుకు కంటి పరీక్షలు

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్



విరసం నాయకుడు వరవరరావుకు సరోజినీ దేవి నేత్ర వైద్యశాలలో కంటి పరీక్షలు నిర్వహించారు. ముంబయి నుంచి బెయిల్‌పై విడుదలైన వరవరరావు శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా హైదరాబాద్ మెహిదీపట్నం సమీపంలోని సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్, సర్జన్ డాక్టర్ రాజలింగం ఆయనకు కంటి శుక్లం వద్ద శస్త్రచికిత్స చేశారు. ఈ శస్త్రచికిత్సను వైద్య పరిభాషలో మల్టీఫోకల్ ఫోల్డబుల్ ఐయోలతో ఉన్న ఫాకో అంటారని రాజలింగం తెలిపా రు. కొన్ని మందులను వాడాలని సూచించినట్టు వివరించారు.

పెండ్లి చేస్తేనే..ఎన్నికల విధులకు హాజరువుతా..

భోపాల్ : మధ్యప్రదేశ్ ఎన్నికల నేపథ్యంలో ఓ ఉపాధ్యాయుడు వ్యవహరించిన తీరు చర్చనీయాంశమైంది. ఎన్నికల శిక్షణా తరగతులకు హాజరుకావాలన్న అధికారుల ఆదేశాలను విస్మరించడమే కాకుండా, షోకాజ్ నోటీసులో ఆయన ఇచ్చిన వివరణ ఉన్నతాధికారులను ఆగ్రహానికి గురి చేసింది. నిర్లక్ష్య వైఖరి సరికాదంటూ జిల్లా కలెక్టర్ అతడిని సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. అఖిలేశ్ కుమార్ మిశ్రా అనే 35 ఏళ్ల ఉపాధ్యాయుడు సాత్నా జిల్లాలో సంస్కృత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల్లో పాల్గొనాలంటూ ఉపాధ్యాయులందరితోపాటు ఈయనకు కూడా అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. అక్టోబర్ 16, 17 తేదీల్లో నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరవ్వాలని కోరారు. అయితే, ఎలాంటి అనుమతి తీసుకోకుండా అఖిలేశ్ కుమార్ శిక్షణ తగతులకు గైర్హాజరయ్యారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ పైఅధికారులు నోటీసులు జారీ చేశారు. దీనిపై అఖిలేశ్ కుమార్ స్పందిస్తూ.. "ఇప్పటికే నాకు 35 ఏళ్లు పూర్తయ్యాయి. ఇంకా పెళ్లి కాలేదు. బ్యాచిలర్‌గా ఉండలేకపోతున్నా. జీవితాంతం భార్య లేకుండా ఉండిపోవాల్సి వస్తుందేమోనని భయమేస్తోంది. ముందు నాకు పెండ్లి చెయ్యండి. ఆ తర్వాత ఎన్నికల విధులకు వస్తాను" అని అక్టోబర్ 31న రిప్లై ఇచ్చారు. అంతేకాకుండా రూ.3.5 లక్షల కట్నం, ఆయన ఉంటున్న ప్రాంతంలో ఓ ప్లాట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడి వైఖరిపై ఆగ్రహించిన జిల్లా కలెక్టర్ అతడిని సస్పెండ్ చేస్తూ నవంబర్ 2న ఆదేశాలు జారీ చేశారు. అయితే, మొబైల్ ఉపయోగించకపోవడం వల్ల సస్పెన్షన్‌కు గురైన సంగతి కూడా వెంటనే ఆయనకు తెలియలేదు. సహోద్యోగి ఒకరు ఆయనకు విషయం చెప్పడంతో తాజాగా వెలుగులోకి వచ్చింది. అఖిలేశ్ మానసిక స్థితి సరిగా లేదని, పెండ్లి కాలేదనే ఒత్తిడిలో ఉన్నారని తోటి ఉద్యోగి ఒకరు చెప్పారు. " లేదంటే కలెక్టర్ స్థాయి అధికారులు నోటీసులు ఇస్తే.. ఎవరైనా ఇలా రిప్లై ఇస్తారా? వ్యక్తిగత కారణాలతో గత ఏడాదిగా అఖిలేశ్ మొబైల్ కూడా వాడటం లేదు" అని ఆయన అన్నారు.

ప్రచార వాహనాలు తిరిగివ్వకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం

చామల కిరణ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గాంధీభవన్‌లో ఉన్న కాంగ్రెస్ ప్రచార వాహనాలను పోలీసులు దౌర్జన్యంగా ఎత్తుకెళ్లారని కాంగ్రెస్ నాయకులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ వాహనాలను తిరిగి గాంధీభవన్‌లో అప్పగించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. పోలీసులు బీఆర్ఎస్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.

ప్రసవం మధురానుభూతిగా మార్చాలి

- గర్భిణులకు మనోధైర్యమివ్వాలి
- సహజ ప్రసవాలను ప్రోత్సహించాలి : డాక్టర్ ఎవిటా ఫెర్నాండేజ్

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

ప్రసవాలను మహిళలకు మధురానుభూతిని మిగిల్చేవిగా మార్చాలని ఫెర్నాండెజ్ హాస్పిటల్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎఫ్‌హెచ్ఈఆర్ఎఫ్) మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎవిటా ఫెర్నాండేజ్ పిలుపు నిచ్చారు. ఫెర్నాండెజ్ హాస్పిటల్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎఫ్‌హెచ్ఈఆర్ఎఫ్), యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ సంయుక్తాధ్వర్యంలో బెటర్ బర్తింగ్ ఎక్స్‌పీరియన్స్ మూడు రోజుల సదస్సు శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గైనకాలజీ విభాగం హెడ్ డాక్టర్ పల్లవి, మిడ్‌వైవ్స్ హెడ్ ఇందర్‌జీత్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవాంఛనీయసి సెక్షన్‌లను తగ్గించడం, గర్భధారణ సమయంలో సహజ ప్రసవాలు, నొప్పుల విషయంలో మహిళకు భయాన్ని పోగొట్టడం, ఆమెను గౌరవనీయంగా 9 నెలల పాటు సహజ ప్రసవానికి సిద్ధం చేసే పద్ధతులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆమె కోరారు. సహజ ప్రసవాలు పెరగాలంటే అందుకు సరైన జ్ఞానం, సహకారం మహిళలకు అవసరమన్నారు. సహజ ప్రసవాలకు చాలా సాధారణ పద్ధతులు కొన్ని తెలిస్తే సరిపోతుందని తెలిపారు. తమ దగ్గరికి వచ్చే అన్ని రకాల ఆరోగ్య పరిస్థితులు కలిగిన మహిళలకు సహజ ప్రసవాలు చేసేందుకే ప్రయత్నిస్తామని చెప్పారు. కేంద్రంలో మిడ్‌వైవ్స్ బిల్లు ఆమోదం పొందడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. దాని ద్వారా మిడ్‌వైవ్స్ ప్రపంచస్థాయి ప్రమాణాలపై శిక్షణ పొందే అవకాశం లభిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో తాము 353 మంది మిడ్ వైవ్స్‌కు శిక్షణ ఇచ్చామనీ, తాము శిక్షణ ఇచ్చిన ప్రాంతాల్లో సహజ ప్రసవాలు పెరిగినట్టు ఆమె వెల్లడించారు. డాక్టర్ పల్లవి మాట్లాడుతూ గర్భధారణ అనేది జబ్బు కాదనీ, భయపడాల్సిన అంశం కాదని తెలిపారు. మహిళలకు అదో మంచి అనుభవంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. గర్భస్థ సమయంలో నొప్పి నిర్వహణకు అవసరమైన అన్ని పద్ధతులపై సదస్సులో డాక్టర్లు, నర్సులు తదితరులకు శిక్షణ ఉంటుం దని తెలిపారు. ఇది దేశంలోనే తొలి సారిగా నిర్వహిస్తున్న సదస్సు అనీ, ఇందులో పేరెంటల్ మెంటల్ హెల్త్ కూడా ఒక అంశంగా ఉందని చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ దోపిడీ

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- 25 మందితో బీఎస్పీ మూడో జాబితా విడుదల
- 32 మందితో త్వరలో అభ్యర్థుల ప్రకటన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ దోపిడీ జరిగిందనీ, సీఎం కేసీఆర్ అన్నీ తానై చీఫ్ ఇంజనీర్‌లా ప్రాజెక్టు డిజైన్ చేసి, నాసిరకంగా కట్టడం వల్లే మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోయాయని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు.శనివారం హైదరాబాద్‌లోని బీఎస్పీ రాష్ట్ర కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 25 మందితో అభ్యర్థుల మూడో జాబితాను విడుదల చేశారు. ఇప్పటి వరకు బీఎస్పీ మొత్తం 87 స్థానాలు ప్రకటిం చగా మరో 32 స్థానాలు త్వరలోనే అభ్యర్థులను ప్రకటించనున్నట్టు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ప్లానింగ్, డిజైన్, నాణ్యత కంట్రోల్, ఆపరేషన్ మెయింటెనెన్స్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. నాసిరకంగా కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి, లక్ష కోట్ల ప్రజాధనాన్ని గంగపాలు చేశారని ఆరోపించారు.కాంట్రాక్టుల్లో కమిషన్ల కోసం కేసీఆర్ కక్కుర్తి పడి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రీడిజైన్ చేసి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను ఎడారిగా మార్చారని తెలిపారు. రూ.లక్ష కోట్లు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో అప్పు తెచ్చి ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలు పాటించనం దుకే మేడిగడ్డ బ్యారేజ్ కూలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారని గుర్తు చేశారు.

GATI
ఆల్‌కార్గో గటి లిమిటెడ్
(గతంలో "గటి లిమిటెడ్"గా తెలిసినది)
CIN: L63011TG1995PLC020121
రిజిస్టర్డు ఆఫీసు: 4వ అంతస్తు, బి వింగ్, ఆల్‌కార్గో హౌస్, సిఎస్‌టి రోడ్, కలినా, శాంతాక్రజ్ (ఈస్ట్), ముంబయి-400098, మహారాష్ట్ర
కార్పొరేట్ ఆఫీస్: 4వ అంతస్తు, వెస్టర్న్ పెర్ల్, సర్వే నెం.13(పి), కొండాపూర్, హైదరాబాద్-500084, తెలంగాణ
website: www.gati.com e-mail: investor.services@gati.com Phone No. - 040 71204284 Fax - 040 23112318

30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు అర్ధ సంవత్సరానికి ఆడిట్‌చేయని కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల నివేదిక

(రూ.లక్షల్లో)

వివరాలు	ముగిసిన త్రైమాసికం			ముగిసిన అర్ధ సంవత్సరం		ముగిసిన సం॥
	30.09.2023 ఆడిట్‌చేయనివి	30.06.2023 ఆడిట్‌చేయనివి	30.09.2022 ఆడిట్‌చేయనివి	30.09.2023 ఆడిట్‌చేయనివి	30.09.2022 ఆడిట్‌చేయనివి	31.03.2023 ఆడిట్‌చేసినవి
ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	44,537	42,837	44,260	87,374	87,932	1,74,604
పన్నుకు ముందు నికర లాభం (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల ముందు)	(597)	(391)	667	(988)	1,129	434
పన్ను తరువాత నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	(379)	(275)	765	(654)	1,424	(1,091)
సంవత్సరం కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు సమీకృత లాభం (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	(404)	(452)	685	(856)	1,263	(1,703)
ఈక్విటీ వాటా మూలధనం	2,603	2,603	2,459	2,603	2,459	2,603
వాటా ఒక్కింటికి రాబడి (ముఖ విలువ రూ. 2/- చొప్పున)						
ఎ) బేసిక్	(0.15)	(0.13)	0.48	(0.28)	0.82	(0.74)
బి) డైల్యూటెడ్	(0.15)	(0.13)	0.46	(0.28)	0.80	(0.74)

స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాలపై అదనపు సమాచారం దిగువ విధంగా: (రూ.లక్షల్లో)

వివరాలు	30.09.2023 ఆడిట్‌చేయనివి	30.06.2023 ఆడిట్‌చేయనివి	30.09.2022 ఆడిట్‌చేయనివి	30.09.2023 ఆడిట్‌చేయనివి	30.09.2022 ఆడిట్‌చేయనివి	31.03.2023 ఆడిట్‌చేసినవి
ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	5,929	6,161	6,777	12,090	13,603	26,406
సంవత్సరం కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల ముందు)	245	114	67	359	34	284
పన్నుకు ముందు సంవత్సరం కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	245	114	156	359	32	(519)
పన్ను తరువాత సంవత్సరం కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	245	114	156	359	32	(543)
సంవత్సరం కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (సంవత్సరం కొరకు సమీకృత లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	243	112	154	355	28	(558)

గమనికలు:
1) సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజీతో దాఖలుచేయబడిన 30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు 31 మార్చి, 2023తో ముగిసిన సంవత్సరానికి స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. 30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు 31 మార్చి, 2023తో ముగిసిన సంవత్సరానికి స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల వివరాలు ఇన్వెస్టర్ల కొరకు www.gati.com, www.nseindia.com మరియు www.bseindia.com వద్ద అందుబాటులో ఉన్నాయి.
2) పై పేర్కొన్న ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు 03 నవంబర్, 2023న ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 03 నవంబర్, 2023న నిర్వహించిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి.
3) 30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు 31 మార్చి, 2023తో ముగిసిన సంవత్సరానికి యొక్క ఫలితాలు అనువర్తి కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖచే గుర్తించినట్లుగా ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ (ఐఎన్‌డి ఏఎస్)ను అనుసరించి ఉన్నాయి.

ఆల్‌కార్గో గటి లిమిటెడ్ తరపున
సం/-
శైశాన్ దోసభాయ్ కళ్యాణివల్లా
నాన్-ఎగ్జిక్యూటివ్, నాన్-ఇండిపెండెంట్ డైరెక్టర్
DIN: 00060776
ప్రదేశం: హైదరాబాద్
తేది: 04 ఆగష్టు, 2023

యూనియన్ బ్యాంక్ Union Bank of India
సైఫాబాద్-1 బ్రాంచ్-హైదరాబాద్
6-1-67/14, 1వ అంతస్తు, పబ్లిక్ గార్డెన్ రోడ్, డిజిపి ఆఫీస్ ఎదురుగా, సైఫాబాద్, హైదరాబాద్-500004.
Tel. No: 040-2320617, 23420613

సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

1) శ్రీ సతల ఉదయ్ కుమార్, ఫ్లాట్ నెం.304, హైటెక్స్ ప్రైడ్, ఖానామెట్ గ్రామం, శేరిలింగంపల్లి మండలం, హైదరాబాద్-500084, 2) శ్రీ సతల కిషోర్ కుమార్, ఫ్లాట్ నెం.304, హైటెక్స్ ప్రైడ్, ఖానామెట్ గ్రామం, శేరిలింగంపల్లి మండలం, హైదరాబాద్-500084, 3) శ్రీ సతల పరశురాం, ఫ్లాట్ నెం.304, హైటెక్స్ ప్రైడ్, ఖానామెట్ గ్రామం, శేరిలింగంపల్లి మండలం, హైదరాబాద్-500084 వారు మా సైఫాబాద్-1 బ్రాంచ్, హైదరాబాద్ నుండి రుణ వసతులను పొందినారు. సదరు రుణగ్రహీతలు రుణాన్ని తిరిగిచెల్లింపులో విఫల్ట్ చెందినారు మరియు వారి ఖాతా 29.10.2023న ఎన్‌పిఏ గా వర్గీకరించబడినది. దాని దృష్ట్యా, మొత్తం రూ.61,17,809.44 (రూపాయలు అరవైఒక లక్షల పదిహేడు వేల ఎనిమిది వందల తొమ్మిది & నలభైనాలుగు పైసలు మాత్రమే) చెల్లించమని వారిని కోరుతూ వారి చివరిగా తెలిసిన చిరునామాకు ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002లోని సెక్షన్ 13(2) క్రింద తేది.01.11.2023నాటి డిమాండ్ నోటీసు జారీచేయబడినది. అయితే, అది చేరకుండానే పోస్టల్ అధికారులచే వెనుదిరిగింది. అందు వలన సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3(1) నియమాలను అనుసరించి 60రోజుల్లోపు మొత్తాలు రూ.61,17,809.44 (రూపాయలు అరవైఒక లక్షల పదిహేడు వేల ఎనిమిది వందల తొమ్మిది & నలభైనాలుగు పైసలు మాత్రమే) మరియు 29.10.2023 నుండి తదుపరి వడ్డీని చెల్లించమని పై పేర్కొన్న రుణగ్రహీతలను కోరుతూ ఈ ప్రచురణ చేయబడినది. లేనిచో, సదరు రుణగ్రహీతలచే క్రియేట్‌చేసిన సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌కు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను బ్యాంకు వినియోగిస్తుంది, మరింత స్పష్టంగా సదరు చట్టం మరియు అందులో పేర్కొన్నరూల్స్‌ను అనుసరించి దిగువ పేర్కొనబడినది.

స్థిరాస్తి యొక్క వివరణ

ఖానామెట్ గ్రామం, శేరిలింగంపల్లి మండలం& మున్సిపాలిటీ, జీహెచ్ఎంసి పరిధి, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం వద్దగల సర్వే నెం.41/8 మరియు 41/9లోని ప్లాట్ నెం.లు 8, 9, 10, 11, 12 మరియు 13పై (1983.0చ.గ.లు లేదా 1657.98చ.మీ.ల పూర్తి స్థలానికిగాను) 60.0 చ.గ.ల విభజించలేని స్థల భాగంతోసహా 200చ.అ.ల రెండు కార్ పార్కింగ్స్ మరియు 1475చ.అ.ల (ఉమ్మడి ఏరియాతోకలిపి) నిర్మితమైన ఏరియాతో హైటెక్స్ ప్రైడ్‌లోని 3వ అంతస్తులో ఫ్లాట్ నెం.304 మొత్తం భాగం మరియు సరిహద్దులు: తూర్పు: కారిడార్/ ఫ్లాట్ నెం.303, పడమర: ఒపెన్ టు స్కై, ఉత్తరం: ఒపెన్ టు స్కై, దక్షిణం: ఒపెన్ టు స్కై.

తేది: 04-11-2023
ప్రదేశం: హైదరాబాద్
అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

Olectra
OLECTRA GREENTECH LIMITED
Registered office: S-22, 3rd Floor, Technocrat Industrial Estate, Balanagar, Hyderabad - 500037, Telangana;Tel:040-46989999
CIN: L34100TG2000PLC035451 - Email ID: Info@olectra.com - www.olectra.com

30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆర్థిక ఫలితాల సారాంశం (మొత్తాలు భారతీయ రూపాయలు లక్షల్లో)


క్ర. సం.	వివరాలు	స్టాండ్‌అలోన్: ముగిసిన త్రైమాసికం 30.09.2023 (Un audited)	30.06.2023 (Un audited)	30.09.2022 (Un audited)	ముగిసిన 6 నెలలకు 30.09.2023 (Un audited)	30.09.2022 (Un audited)	ముగిసిన సంవత్సరం 31.03.2023 (Audited)	కన్సాలిడేటెడ్: ముగిసిన త్రైమాసికం 30.09.2023 (Un audited)	30.06.2023 (Un audited)	30.09.2022 (Un audited)	ముగిసిన 6 నెలలకు 30.09.2023 (Un audited)	30.09.2022 (Un audited)	ముగిసిన సంవత్సరం 31.03.2023 (Audited)
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	29,786.62	20,602.24	21,270.01	50,388.86	51,736.51	113,440.67	30,716.26	21,602.14	17,734.85	52,318.40	45,841.80	109,076.08
2	కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల ముందు)	2,806.93	2,483.96	1,467.97	5,290.89	3,939.23	9,110.99	2,656.91	2,525.96	1,102.56	5,182.87	3,391.56	8,943.29
3	పన్నుకు ముందు కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు అసాధారణ ఐటంల తరువాత)	2,806.93	2,483.96	1,467.97	5,290.89	3,939.23	9,110.99	2,656.91	2,525.96	1,102.56	5,182.87	3,391.56	8,943.29
4	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/ (నష్టం) (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	2,098.55	1,869.79	1,110.70	3,968.34	2,991.64	7,070.28	1,857.92	1,807.24	741.78	3,665.16	2,410.00	6,689.31
5	కాలవ్యవధిలో పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు (సమీకృత లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	2,098.55	1,869.79	1,118.24	3,968.34	2,999.18	7,085.63	1,857.92	1,807.24	749.32	3,665.16	2,417.54	6,704.66
6	ఈక్విటీ వాటా మూలధనం	3,283.23	3,283.23	3,283.23	3,283.23	3,283.23	3,283.23	3,283.23	3,283.23	3,283.23	3,283.23	3,283.23	3,283.23
7	గత సంవత్సరపు ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివ్యాల్యూవేషన్ రిజర్వులు మినహాయించి)	-	-	-	-	-	81,579.45	-	-	-		-	80,691.58
8	వాటా ఒక్కింటికి రాబడి (రూ. 4/- చొప్పున) (కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు)												
	బేసిక్:	2.56	2.28	1.35	4.83	3.64	8.61	2.20	2.20	0.92	4.40	2.95	7.99
	డైల్యూటెడ్:	2.56	2.28	1.35	4.83	3.64	8.61	2.20	2.20	0.92	4.40	2.95	7.99

గమనికలు: సెబీ (లిస్టింగ్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజిలతో దాఖలుచేయబడిన త్రైమాసిక/ వార్షిక ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశంపై విధంగా ఉన్నది. త్రైమాసికం/ వార్షిక ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజి(ల) వెబ్‌సైట్లు మరియు లిస్టెడ్ ఎంటిటీపై అందుబాటులో ఉంటాయి. (www.olectra.com)

For Olectra Greentech Limited
సం/-
పి.హనుమాన్ ప్రసాద్
కంపెనీ సెక్రటరీ
ప్రదేశం: హైదరాబాద్
తేది: 04-11-2023

కాంగ్రెస్ సానుకూలం సీఎం భఘేలానే
బీజేపీకి సీఎం ముఖం లేదు

చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్, బీజేపీ ఢీ...



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ నెలకొంది. అయితే కాంగ్రెస్ హవా కొనసాగనుంది. రెండోసారి ముఖ్యమంత్రి భూపేష్ భఘేలా అధికార పగ్గాలు చేపట్టే అవకాశాలున్నాయని అనేక సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. 90 స్థానాలున్న అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 71, బీజేపీకి 15, బీఎస్పీకి 2 జేసీసీకి 1 స్థానాలున్నాయి. 90 నియోజకవర్గాల్లో 32 ఎస్టీ రిజర్వుడు స్థానాలు. అందుకే దీన్ని ట్రైబల్ స్టేట్ అంటారు. 10 ఎస్సీ రిజర్వుడు స్థానాలున్నాయి. 47 శాతం ఓబీసీ, 32 శాతం ఎస్టీ, 12 శాతం ఎస్సీ, 7 శాతం ఇతరులు, 2 శాతం ముస్లిం మైనార్టీలు ఉన్నారు. అందుకే కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో కుల గణన అస్త్రాన్ని ప్రయోగించింది. ఇది బీసీ వర్గాల్లో ఆ పార్టీకి మరింత ఆదరణ పెరుగుతుంది. ప్రజా నేతగా ఎదిగిన ముఖ్యమంత్రి భూపేష్ భఘేలా కాంగ్రెస్‌కు సానుకూలం కాగా, మరోవైపు మూడుసార్లు ముఖ్యమంత్రి చేసిన రమణ్ సింగ్‌కు బీజేపీ అంత ప్రాధాన్యత ఇవ్వకపోడం, ఆ పార్టీకి ప్రతికూలం కానుంది.

కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగడానికి ముఖ్య కారణం ముఖ్యమంత్రి భూపేష్ భఘేల్ పాలనపై ప్రజల్లో సానుకూలత ఉండడమే. బీజేపీ జాతీయత, హిందుత్వ అంశాలకు ప్రత్యామ్నాయంగా సీఎం భూపేష్ ఛత్తీస్‌గఢ్ ఆత్మ గౌరవం అంశంలో భాగంగా 'ఛత్తీస్‌గఢ్ మాతారి', 'గదో నవా ఛత్తీస్‌గఢ్' వంటి నినాదాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారు. ప్రభుత్వం స్థానిక పండుగలకు గుర్తింపు ఇచ్చి సెలవులు ప్రకటించడం, ఛత్తీస్‌గఢ్ ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించడం, రాష్ట్ర గీతం "అర్ప-పైరి కి ధర్" ప్రవేశపెట్టడం వంటి సెంటిమెంట్ అంశాలు కాంగ్రెస్ విజయానికి తోడ్పడుతున్నాయి. "రామవంగమన్ పాత్" పేరిట శ్రీరాముడు వనవాసం చేసిన రాష్ట్ర పరిధిలోని 75 స్థానాలను గుర్తించి ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయడం, 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంతోపాటు "బెన్ ములాఖత్" పేరుతో గ్రామాల్లో, పట్టణాల్లో పర్యటిస్తూ ప్రజలకు చేరువవడం వంటి కార్యక్రమాలు కాంగ్రెస్ విజయానికి తోడ్పడుతున్నాయి. "కహెూ దిల్ సే, కాంగ్రెస్ ఫిర్ సే", "భూపేష్ హై తో, భరోసా హై" వంటి నినాదాలు ప్రజలకు చేరువవుతున్నాయి. కాంగ్రెస్ పాలన, ముఖ్యమంత్రి పనితీరుపై 60 శాతం మంది ప్రజలు సానుకూలంగా ఉన్నట్లు వివిధ సర్వేలు చెబుతున్నాయి.

ప్రాంతాల వారీ రాజకీయం

ఛత్తీస్‌గఢ్ ఉత్తర, మధ్య, దక్షిణ ప్రాంతాలుగా ఉంది. ఉత్తర ఛత్తీస్‌గఢ్‌ను సర్గుజ డివిజన్‌గా కూడా పిలుస్తారు. 23 స్థానాలున్న ఈ డివిజన్‌లో ఎస్టీ, ఓబీసీ ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ఉప ముఖ్యమంత్రి సింగ్‌డియో, రాష్ట్ర మంత్రి జైసింగ్ అగర్వాల్ ప్రభావంతో 2018 ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ మంచి ఫలితాలను సాధించింది. సింగ్‌డియో కాబోయే ముఖ్యమంత్రి అనే ప్రచారం ఇక్కడ 2018లో కాంగ్రెస్ విజయానికి దోహదపడింది. ఆయనకు ముఖ్యమంత్రి పదవి దక్కకపోవడం, కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపై వ్యతిరేకత ఆ పార్టీకి ఇక్కడ నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఇటీవల సింగ్‌డియోకు ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టడం కాంగ్రెస్‌కు కొంత సానుకూలంగా ఉంది.

మధ్య ఛత్తీస్‌గఢ్ డివిజన్‌లో రాయ్‌పూర్, బిలాస్‌పూర్, దుర్గ్ వంటి ప్రధాన పట్టణ ప్రాంతాలున్నాయి. ఈ డివిజన్‌లో 55 అసెంబ్లీ స్థానాలున్నాయి. రాష్ట్రంలోని దాదాపు అన్ని ఎస్సీ రిజర్వ్ స్థానాలు ఈ ప్రాంతంలోనే

ఉన్నాయి. ఎస్టీ, సింధి, రాజ్‌పుత్, పంజాబీ, బ్రాహ్మిణ్ సామాజిక ఓటర్ల ప్రభావం కూడా ఇక్కడ ఉంది. ముఖ్యమంత్రి భూపేశ్ భఘేల్, మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు అరుణ్ సావో వంటి ప్రధాన నేతలు ఈ ప్రాంతానికి చేందిన వారే. ఈ ప్రాంతంపై పట్టున్న బీజేపీ 2018 ఎన్నికల్లో నష్టపోయింది. కొన్ని సంవత్సరాల క్రితం కబీర్‌దామ్, బీమెత్ర జిల్లాల్లో మతకలహాల హింసతో ఇక్కడ ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఇక్కడ బీజేపీ బలపడినట్లు కనిపిస్తున్నా, సిట్టింగ్ బీజేపీ ఎమ్మెల్యేలపై ప్రజల్లో అసంతృప్తి ఆ పార్టీకి నష్టం కలిగిస్తున్నాయి. వ్యవసాయ ప్రాధాన్యత గల ఈ ప్రాంతంలో ప్రభుత్వ పథకాలతో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంది. ఈ డివిజన్‌లో గత ఎన్నికల్లో మంచి ఫలితాలు పొందిన జేసీసీ, బీఎస్పీ బలహీనపడడంతో కాంగ్రెస్, బీజేపీలకు ప్రయోజనం కలుగుతోంది. మొత్తంమీద ఈ ప్రాంతంలో కాంగ్రెస్ ఆధిప్యతం కొనసాగే అవకాశాలున్నాయి.

ఎస్టీ సామాజిక వర్గం ఆధిపత్యం ఛత్తీస్‌గఢ్ దక్షిణ ప్రాంతాన్ని బస్తార్ అని కూడా పిలుస్తారు. ఇక్కడ 12 స్థానాల్లో 11 ఎస్టీ రిజర్వ్‌డ్‌గా ఉన్నాయి. ఇది నక్సల్స్ ప్రభావిత ప్రాంతం. బీజేపీకి పట్టున్న ఈ ప్రాంతంలో 2018లో 11 స్థానాలు గెలిచిన కాంగ్రెస్, అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో మరోస్థానం గెలిచి మొత్తం 12 స్థానాలను సాధించి క్లీన్ స్వీప్ చేసింది. ఎస్టీలతోపాటు గోండ్, మురియా, భాత్ర హల్బీట్ సామాజిక వర్గాల ప్రభావం ఇక్కడుంది. ఇక్కడ ఓబీసీతో పాటు ఇతర సామాజిక వర్గాల ప్రభావం తక్కువ. సుక్మా జిల్లాలో సీపీఐ ప్రభావం కొంత ఉంది. బస్తర్‌లో మత మార్పిడి ఘటనలతో గత కొన్నేళ్లుగా గిరిజనుల మధ్య మత కలహాలు జరిగాయి. ఈ ప్రాంతంలో సర్వ ఆదివాసీ సమాజ్ ఓట్లను చీల్చినా సీట్లు గెలిచే అవకాశాలు లేవు. ఇక్కడ కాంగ్రెస్ కొంత నష్టపోయినా ప్రభుత్వ పథకాల ప్రభావంతో అధిక స్థానాలు గెలిచే అవకాశాలున్నాయి.

సామాజిక ప్రభావం

రాయ్‌పూర్, బిలాస్‌పూర్, జగదల్‌పూర్, అంబిక్‌పూర్, కోబ్రా, రాయిగఢ్ మొదలగు నగరాల్లో రాజపుత్, బ్రాహ్మిణ్, సింధీ, పంజాబీలు, మార్వాడీలు, బనియా సామాజిక వర్గాల ప్రభావం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఒరియా, బెంగాలీల ప్రభావం కూడా ఉంది. ఈ సామాజిక వర్గాలలో బీజేపీ పట్ల కొంత మొగ్గు కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఓబీసీల ఓటు బ్యాంక్ అధికం. ఓబీసీలో సాహు సామాజిక వర్గం అధికంగా ఉన్నారు. ఈ సామాజిక వర్గంలో బీజేపీ పట్ల కొంత మొగ్గు ఉంది. ఓబీసీలో రెండో పెద్ద సామాజికవర్గం కుర్మీలది. వీరు సెంట్రల్ రీజియన్‌లో అధికంగా ఉన్నారు. ముఖ్యమంత్రి భూపేష్ ఈ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో వీరు కాంగ్రెస్ వైపు ఉన్నారు. చేనేతకు చెందిన పానికాస్ కాంగ్రెస్ వైపు ఉన్నారు. వ్యవసాయ రంగానికి చెందిన మారర్ సామాజిక వర్గం కాంగ్రెస్ పట్ల అనుకూలంగా ఉంది.

సెంట్రల్ ప్రాంతంలో అధికంగా ఉండే కాలర్ సామాజిక వర్గం బీజేపీకి అనుకూలంగా ఉంది. దేవాంగన్ సామాజిక వర్గం బీజేపీ పట్ల మొగ్గు చూపుతుంది. మధ్య ఛత్తీస్‌గఢ్‌లో ప్రాబల్యం ఉన్న యాదవ్ సామాజిక వర్గం బీజేపీకి అనుకూలంగా ఉంది. ఎస్సీలు ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ మధ్య ప్రాంతంలో అధికంగా ఉన్నారు. ఎస్సీల్లో అధికంగా ఉన్న సాతనమీ, హరిజన, మహర్ సామాజిక వర్గాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయి. ఎస్టీల ప్రభావం ప్రధానంగా ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో ఉంది. ఎస్టీల్లో అధికంగా ఉండే గోండుల ఓటర్లు కాంగ్రెస్, బీజేపీ, సర్వ ఆదివాసీ పార్టీలకు అనుకూలంగా చీలిపోయారు. ఎస్టీలలో రెండో పెద్ద సామాజిక వర్గమైన కన్వార్ బీజేపీ పట్ల మొగ్గు చూపుతున్నారు. ఉత్తర ప్రాంతంలో ఉన్న ఖైర్వార్, ఓరాన్ సామాజిక వర్గాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయి.



పహడి కోబ్రా సామాజిక వర్గం బీజేపీ పట్ల సానుకూలంగా ఉంది. హల్బా సామాజిక వర్గం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంది. మురియా, భాట్రా సామాజిక వర్గాలు కాంగ్రెస్, బీజేపీ మధ్య చీలి ఉన్నాయి. రాష్ట్ర జనాభాలో రెండు శాతానికి పైగా ఉన్న ముస్లింలు, దాదాపు రెండు శాతం ఉన్న క్రిస్టియన్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు.

ఇతర పార్టీల పరిస్థితి

గూడావన గణతంత్ర పరిషత్ రాష్ట్రంలో ప్రభావం కోల్పోయింది. జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్ (మజీ సీఎం అజిగ్ జోగి ఏర్పాటు చేసిన పార్టీ) 2018లో బీఎస్పీతో పొత్తు పెట్టుకోగా ఆ కూటమి ఏడు స్థానాలు (జేసీసీ 5, బీఎస్పీ 2) గెలిచింది. అజిత్ జోగి మరణానంతరం జేసీసీ పూర్తిగా బలహీనపడగా, బీఎస్పీ ఒక స్థానం గెలిచే అవకాశాలున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీకి ఒక స్థానం కూడా దక్కే అవకాశాల్లేవు. నూతనంగా ఆవిర్భవించిన సర్వ ఆదివాసీ సమాజ్ బస్తార్ ప్రాంతంలో గణనీయమైన ఓట్లు పొందే అవకాశాలన్నా సీట్లు దక్కకపోవచ్చు. ఈ పరిణామాల మధ్య ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యనే ఉండగా, కాంగ్రెస్ మెజార్టీ సాధించి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి.

సీఎం భూపేశ్ బఘేల్‌కు ప్రత్యామ్నాయమే ఉందా?

ముఖ్యమంత్రి భూపేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాదరణ కలిగున్న నేతగా ఎదిగారు. ఉప ముఖ్యమంత్రి సింగ్‌డియో సొంత ప్రాంతమైన ఉత్తర ప్రాంతంలో భూపేశ్‌కు ఆదరణ కొంత తక్కువ ఉంది. సెంట్రల్, దక్షిణ ప్రాంతాలలో సానుకూలంగా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఆత్మగౌరవం, గుర్తింపు కోసం ముఖ్యమంత్రి కష్టపడుతున్నారనే భావన ప్రజల్లో ఉంది. కాంగ్రెస్ పార్టీలో గ్రూపులున్నా భూపేశ్‌కు సరితూగే నేతలు లేరని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. బీజేపీలో ఇప్పటికీ రమణ్ సింగ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రాధాన్యత లభిస్తుండగా ఆయనను ప్రస్తుత సీఎం భూపేష్ కు సరైన ప్రత్యామ్నాయంగా భావించకపోవడం గమనార్హం.

బీజేపీ బలాలు, బలహీనతలు

ప్రభుత్వ వ్యతిరేకతపై ఆశలు పెట్టుకున్న బీజేపీ భూపేశ్ ప్రభుత్వం వైఫల్యాలను పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. పేదలకు గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను ఇవ్వకపోవడంతో పథకం కింద ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయని రాష్ట్ర బీజేపీ 'మోర్ ఆవాజ్ మోర్ అధికార్' పేరిట రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. బస్తార్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో క్రిస్టియన్ మిషనరీలు డబ్బు ప్రలోభాలతో గిరిజనులలో మత మార్పిడిని ప్రోత్సాహిస్తున్నాయని బీజేపీ విమర్శిస్తోంది. ఈ పరిణామాలు బీజేపీని సమర్థించే గిరిజనలు, క్రిస్టియన్లుగా మారిన గిరిజనుల మధ్య ఘర్షణలకు దారితీశాయి. గత ఎన్నికల్లో మహిళలను ఆకర్షించడానికి కాంగ్రెస్ ఇచ్చిన మద్య నిషేధం హామీని ఆ పార్టీ అమలు చేయకపోవడం బీజేపీకి సానుకూలంగా మారుతోంది. గతంలో పదిహేనేళ్ళు పాలించిన బీజేపీ హిందూత్వ అజెండాతోపాటు జాతీయ అంశాలకు ఇచ్చిన ప్రాధాన్యతను ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రత్యేకతను గుర్తించడంలో ఇవ్వలేదని అసంతృప్తి ప్రజల్లో ఉండడం ఆ పార్టీకి నష్టం చేకూరనుంది. బీజేపీ జాతీయ అంశాలకు, హిందూత్వ అజెండాకు వ్యతిరేకంగా స్థానిక, ప్రాంతీయ అంశాలకు ప్రాధాన్యతిస్తూ ప్రజలకు చేరువవడంలో ముఖ్యమంత్రి భూపేశ్ సఫలీకృతులయ్యారు.

పదిహేనేళ్ళు ముఖ్యమంత్రిగా ఉన్న రమణ్‌సింగ్ ఠాకూర్ సామాజిక వర్గానికి, పార్టీలో ఇతర ప్రముఖ నేతల్కైన సరోజ్‌పాండే బ్రాహ్మణ సామాజిక వర్గానికి, మరోనేత బ్రిజ్‌మోహన్ అగర్వాల్ బనియా సామాజిక వర్గానికి చెందిన నేతలు. దీంతో రాష్ట్రంలో అధికంగా ఉండే ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు పార్టీలో ప్రాధాన్యత లేదనే భావనను కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుండడం బీజేపీకి నష్టం చేకూర్చే అవకాశాలున్నాయి. గిరిజన తెగకు చెందిన సీనియర్ నేత నంద్‌కుమార్ సాయి 2023 ఏప్రిల్‌లో బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరడం బీజేపీకి నష్టం చేకూర్చవచ్చు. బీజేపీ 15 ఏళ్ల పాలనలో సబ్సీడీ బియ్యం మినహా ఇతర సంక్షేమ పథకాలకు పెద్ద ప్రాముఖ్యతివ్వలేదని, అందుకే బీజేపీకి మూడు మార్లు అవకాశమిచ్చినట్టే కాంగ్రెస్‌కు కూడా మరోసారి అవకాశమిద్దామనే అభిప్రాయంలో ఛత్తీస్‌గఢ్ ఓటర్లు ఉన్నారని సర్వేలు చెబుతున్నాయి.

కాంగ్రెస్ బలాలు, బలహీనతలు

కాంగ్రెస్ 2018 ఎన్నికల్లో రైతులకు రుణమాఫీతో పాటు ధాన్యం సేకరణ, మద్దతు ధరపై ఇచ్చిన హామీని భూపేశ్ బఘేల్ ప్రభుత్వం నిలబెట్టుకుంది. రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరిని దేశంలోనే రికార్డు స్థాయిలో ప్రభుత్వం సేకరించడంతో రైతులు ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉంది. దీంతోపాటు అంగన్వాడీ, ఆశా వర్కర్లు, హెూమ్‌గార్డులకు జీతభత్యాలు పెంచడంతో వారు కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారు.

ఈ పరిణామాలు ప్రధానంగా గ్రామాలలో, విద్యావంతులలో పార్టీ పట్ల సానుకూలతను కలిగిస్తున్నాయి. వీధులలో సంచరించే ఆవుల కోసం 'గోథాన్ యోజన' పేరిట పథకాన్ని ప్రారంభించి గ్రామీణ యువతకు, మహిళలకు ఉపాధిని కలిగించడం పట్ల ప్రజలు ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్నారు.




కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలు

అధికార కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలు ఆ పార్టీకి నష్టం చేకూర్చవచ్చు. ముఖ్యమంత్రి భూపేశ్‌కు ఉప ముఖ్యమంత్రి టి.ఎస్.సింగ్‌డియో, పీసీసీ చీఫ్ మోహన్ మార్కం మధ్య విభేదాలున్నాయి. ముగ్గురు మూడు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంతో పార్టీకి ఇబ్బందికరంగా మారింది. అయితే ఇటీవల ఈ అంతర్గత కలహాలపై కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం దృష్టి పెట్టింది. మౌలిక వసతుల కల్పనలో ప్రధానంగా దెబ్బతిన్న రహదారులతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవడం ప్రభుత్వంపై వ్యతిరేకతకు దారితీస్తోంది.



దేశంలో ఒకే కులం...
అదే పేదరికం : మోడీ



అయితే ఓబీసీనని ఎందుకు చెప్పుకుంటారు? : రాహుల్
ఛత్తీస్‌గఢ్‌లో నేతల మధ్య మాటల తూటాలు

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. దేశంలో ఉన్నది ఒకే కులమని, అదే పేదరికమని మోడీ అంటుంటే అయితే మీరు ఓబీసీనని ఎందుకు చెప్పుకుంటున్నారని రాహుల్ నిలదీశారు. దుర్గ్‌లో శనివారం జరిగిన బీజేపీ ర్యాలీని ఉద్దేశించి మోడీ ప్రసంగిస్తూ తనకు సంబంధించినంత వరకూ దేశంలో ఉన్నది ఒకటే కులమని, అదే పేదరికమని అన్నారు. పేదలకు మోడీ సేవకుడని, సోదరుడని, కుమారుడని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌పై ఆయన మండిపడుతూ ఓబీసీలను అవమానించడం ఆపేయాలని డిమండ్ చేశారు. 'ఓబీసీలను కాంగ్రెస్ ఎందుకు అవమానిస్తోంది? మోడీ ఓబీసీ అయినంత మాత్రాన ఆ తరగతుల వారి తప్పేమిటి?' అని ప్రశ్నించారు.

ఛత్తీస్‌గఢ్ పర్యటనలోనే ఉన్న రాహుల్ ప్రధానిపై విమర్శలు గుప్పించారు. పేదలే దేశంలోని ఏకైక కులమన్న మోడీ వ్యాఖ్యను ఆయన ఎద్దేవా చేస్తూ దేశంలో ఏ కులమూ లేనప్పుడు, కేవలం పేదలే ఉన్నప్పుడు ఎందుకు ఓబీసీనని చెప్పుకుంటారని నిలదీశారు. జగ్‌దల్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ గిరిజనులను ఆదివాసీలు అనడానికి బదులు వనవాసీలు అనడం ద్వారా వారిని బీజేపీ అవమానిస్తోందని విమర్శించారు. తమ పార్టీ దేశం నుండి 'వనవాసి' అనే పేరును తొలగిస్తుందని చెప్పారు. వనవాసి అనే పదం గిరిజనులకు అవమానకరమని అన్నారు. ఈ రెండు పదాల మధ్య చాలా తేడా ఉందని తెలిపారు. ఆదివాసీ అనేది విప్లవాత్మకమైన పదమని, ఆదివాసీలు అంటే దేశానికి తొలి, అసలైన యజమానులని అర్థమని వివరించారు. వారే ఈ దేశంలోని అడవులకు, జల సంపదకు యజమానులని అన్నారు. వనవాసీ అంటే అడవుల్లో జంతువుల మాదిరిగా నివసించేవారని అర్థమని చెప్పారు. ప్రస్తుత పాలకులు గిరిజనుల చేతుల్లో నుండి భూమిని, నీటిని లాక్కున్నారని మండిపడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లో మొదటి విడతగా 20 శాసనసభ స్థానాలకు ఈ నెల 7న పోలింగ్ జరుగుతుంది. మిగిలిన 70 స్థానాలకు 17న ఎన్నికలు నిర్వహిస్తారు.

మిజోరంను నడిపించగలిగేది కాంగ్రెస్సే

- పార్టీ 25కు పైగా సీట్లలో గెలుస్తుంది
- రాష్ట్రంలో సంస్కరణలను తీసుకొస్తుంది
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లాల్‌సవ్తా విశ్వాసం

ఐజ్వాల్ : మిజోరాం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లాల్‌సవ్తా విశ్వాసం వ్యక్తం చేశారు. మొత్తం 40 స్థానాలకు గానూ కనీసం 25 సీట్లలో విజయం సాధిస్తుందని నొక్కి చెప్పారు. అధికారంలోకి వచ్చాక అవినీతి నిర్మూలణ, శ్రేష్టమైన పాలన కోసం వరుస సంస్కరణలను పార్టీ తీసుకొస్తుందన్నారు. ఆర్థిక దుర్వినియోగంలో ఉన్న మిజోరాంను నడిపించగలిగేది కాంగ్రెస్ మాత్రమేనని తెలిపారు. అధికారంలోకి వస్తే పాత పెన్షన్ పథకాన్ని (ఓపీఎస్) కాంగ్రెస్ ప్రవేశపెడుతుందని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రచారం చక్కగా కొనసాగుతున్నదనీ, పలు నివేదికల ప్రకారం తాము 26 స్థానాలు పొందుతామని లాల్‌సవ్తా విశ్వాసం వ్యక్తం చేశారు. 26 కాకపోయినా.. కనీసం 25 స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు.

మొత్తం 40 అసెంబ్లీ స్థానాలున్న మిజోరాంలో ఈనెల 7న ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే నెల 3న ఫలితాలు వెలువడనున్నాయి. అన్ని 40 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్నది. గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇక్కడ ఐదు స్థానాలను మాత్రమే గెలవగలిగింది. అందులోనూ ఒకరు.. రాష్ట్రంలో అధికార మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్)కు ఫిరాయించారు.

లాల్‌సవ్తా కాంగ్రెస్ పార్టీ నుంచి బలమైన నాయకుడిగా ఉన్నారు. ఒకవేళ ఆ పార్టీకి మెజారిటీ వస్తే సీఎం పదవిని ఆయన చేపడతారని పార్టీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం. రాష్ట్రంలో అధికార ఎంఎన్ఎఫ్, ప్రధాన ప్రతిపక్షం జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్పీఎం)లు బీజేపీతో కూటమిని ఏర్పాటు చేయటం కోసం చూస్తున్నాయని లాల్‌సవ్తా ఆరోపించారు.

రాజకీయాల్లో సాధువులు

రాజకీయాల్లోకి చదువుకున్న వాళ్లు, మేధావులు వచ్చే రోజులు గతం. ఇపుడు కుల, మతమే కాదు.. గత కొన్నేండ్లుగా రాజకీయాల్లోకి సాధువుల ప్రవేశం పెరుగుతోంది. ఎందుకంటే చాలా మందికి మతపరమైన భావాలతో లోతైన సంబంధం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రయోజనాల కోసం సాధువులను అభ్యర్థులుగా మార్చేస్తున్నాయి. ఈసారి కూడా రాజస్థాన్ ఎన్నికల్లో సాధువులు పోటీలో ఉన్నారు



రాజస్థాన్ ఎన్నికల బరిలో బీజేపీ నుంచి నలుగురు, కాంగ్రెస్ నుంచి ఒకరు

జైపూర్: రాజకీయాల్లో సాధువులు, బాబాల జోక్యం కనిపించింది. ఈసారి రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ నలుగురు సాధువులను ప్రకటించగా, కాంగ్రెస్ ఒక సాధువును బరిలో నిలిపింది. కాంగ్రెస్ ఒక సాధువు కోడలుకు టికెట్ ఇచ్చింది, మరో ఇద్దరు సాధువులు, భజన గాయకుడు ప్రకాష్ మాలి, సాధ్వి అనాది సరస్వతిని కూడా కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించింది.

బాబా బాలక్‌నాథ్



అల్వార్‌లోని తిజారా అసెంబ్లీ స్థానం నుంచి బాబా బాలక్‌నాథ్‌ను బీజేపీ అభ్యర్థిగా ప్రకటించింది. బాబా బాలక్‌నాథ్ నాథ్ శాఖకు చెందిన మహంత్. హర్యానాలోని రోహ్‌తక్‌లో ఉన్న మస్త్‌నాథ్ మఠానికి ఆయన ప్రధాన మఠాధిపతి. గత లోక్‌సభ ఎన్నికల్లో బాలక్ నాథ్ అల్వార్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఇప్పుడు ఆయనను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దింపారు.

బాల్ ముకుంద్ ఆచార్య



జైపూర్‌లోని హవామహల్ స్థానం నుంచి బాల్ ముకుంద్ ఆచార్యను బీజేపీ అభ్యర్థిగా ప్రకటించింది. అతను జైపూర్‌లోని హతోజ్ ధామ్ మహంత్. గత కొన్నేళ్లుగా హిందువులపై జరుగుతున్న అకృత్యాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు జరిగాయి. మతపరమైన కార్డును ప్లే చేస్తూ, బీజేపీ తొలిసారిగా బాల్ ముకుంద్ ఆచార్యను రంగంలోకి దించింది.

సలేహ్ మహమ్మద్



పోకరన్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సలేహ్ మహ్మద్‌ను మళ్లీ ప్రకటించింది. సలేహ్ మహ్మద్ ముస్లిం సమాజానికి చెందిన మత నాయకుడైన ఘాజీ ఫకీర్ కుమారుడు. ఘాజీ ఫకర్ మరణం తరువాత, సలేహ్ మహ్మద్ అతని వారసుడిగా ప్రకటించారు.

డాక్టర్ అర్చన శర్మ

జైపూర్‌లోని మాళవియా నగర్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ అర్చన శర్మను ప్రకటించింది. డాక్టర్ అర్చన శర్మ శ్రీ రామ జన్మభూమి ఉద్యమంలో నాయకుడిగా ఉన్న సెయింట్ ధర్మేంద్ర ఆచార్య యొక్క కోడలు. అతని మఠం జైపూర్‌లోని విరాట్‌నగర్‌లో ఉంది. ఆచార్య ధర్మేంద్ర మరణం తరువాత, అతని కుమారుడు సోమేంద్ర శర్మ అతని వారసుడు అయ్యాడు. సోమేంద్ర శర్మ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ అర్చన శర్మ భర్త. డాక్టర్ శర్మ రెండుసార్లు ఎన్నికల్లో ఓడిపోయారు. కాంగ్రెస్ ఆయనకు మరో అవకాశం ఇచ్చింది.

ప్రతాపురి మహారాజ్



జైసల్మేర్‌లోని పోకరన్ అసెంబ్లీ స్థానం నుంచి ప్రతాప్ పూరీ మహారాజ్‌ను బీజేపీ అభ్యర్థిగా ప్రకటించింది. గత ఎన్నికల్లో కూడా బీజేపీ ఆయనకు పోటీ చేసేందుకు అవకాశం కల్పించింది, అయితే ఆయన కాంగ్రెస్‌కు చెందిన సలేహ్ మహ్మద్‌పై కేవలం 872 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈసారి పార్టీ ఆయనకు మరో అవకాశం ఇచ్చింది.

ఓతారం దేవాసి



సిరోహి అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ఓతారామ్ దేవాసిని ప్రకటించింది. అతను 2013 నుండి 2018 వరకు బీజేపీ ఎమ్మెల్యేగా , రాజే హయాంలో మంత్రిగా కూడా ఉన్నారు. దేవాసి గతంలో పోలీస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేశారు. తర్వాత ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకుని తల్లి చాముండా భక్తుడయ్యాడు. అతను ముందర మాత ఆలయ మహంత్.

సంపాదకీయం

తెలంగాణ సాయుధ పోరాటంలో భాగమైన ఒక్కో తల్లిదీ ఒక్కో విలక్షణమైన అనుభవం. ఐలమ్మ మొదలుకొని ఎందరో తల్లులు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ దోపిడీ, పీడనల నుంచి విముక్తి కోసం నాటి మహత్తర తెలంగాణ పోరాటంలో సమిధలుగా మారారు. లాఠీలకూ, తూటాలకూ, నిర్బంధాలకూ వెరువని ఆ తల్లులే నిన్న, నేడు, రేపూ విప్లవోద్యమానికి వెన్నెముక.



అక్టోబర్ విప్లవాల సాహిత్య ధార

ఆనాటి అరుణారుణ విజయాల జ్ఞాపకాలు, గాయాల గురుతులు, త్యాగాల ఆనవాళ్లను ఆలపిస్తూ ఆగమించే విప్లవాల అక్టోబర్ ఎప్పుడూ వినూత్నమే. నేటి కర్తవ్యాల, రేపటి మజి లీల, అంతిమ గమ్యాల నెమరువేతకు సమాయ త్తమయ్యే సంద ర్భమే. అక్టోబర్ విప్లవం గురించి ప్రస్తావించుకోగానే మొదట గుర్తుకొచ్చేది సోవియట్ సాహిత్యమే. 'ప్రగతి', 'రాదుగ' ప్రచురణాలయాల నుంచి వెలువడిన అనువాదాల పరంపర తెలుగు సమాజంపై, సాహి త్యంపై చూపిన ప్రభావం అపారమైంది. ఇవాళ సోవియట్ రష్యా అంతర్థానమై ఉండొచ్చు. కానీ ఆ సాహిత్యపు వెలుగుల ప్రభావం ఏదో రూపాన తెలుగు నేలపై నిలిచే వుంది.

పెట్టుబడిదారీ విధానానికి, ఒక మనిషిని మరో మనిషి దోచుకునే వేల ఏండ్ల పరపీడన పరాయణత్వానికి మరణ శాసనాన్ని ప్రకటించింది అక్టోబర్ విప్లవం(నవంబర్ 7) దోపిడీ పీడనలు లేని సమసమాజం ఆదర్శవాద స్వప్నం కాదని రుజువు చేసింది. అందుకు ఆచరణాత్మక మార్గమైంది. ఖండఖండాలలో కార్మికవర్గ, కమ్యూనిస్టు ఉద్యమాలకు ఊపిరులూదింది. సోషలిజాన్ని ఆవిష్కరించింది. అత్యంత నిర్బంధం మధ్య సాహసోపేత కార్మికవర్గ పోరాటానికి తోడుగా తొలిసంతకం చేసింది'అమ్మ' నవల.

రష్యాలో పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని కూడగట్టిన కొడుకు పావెల్ పోరాటంలో అమ్మ భాగం అవుతుంది. పోలీసు జులుంకు వెరవక ఎర్ర జెండాను దించకుండా పోరాడుతున్న కొడుకు పావెల్‌ను వెన్నంటే ఉంది. పావెల్ చేజారిన జెండాను ఎత్తిపట్టి జనం మధ్య నిలిచి కార్మికులనుద్దేశించి "నాయనలారా వినండి! మన రక్తంలో రక్తమైన పిల్లలు, అందరికీ సమానంగా న్యాయం జరగాలనే సంకల్పంతో కొత్త ప్రపంచంలో పడ్డారు. మీకందరికీ, మీకు పుట్టబోయే పిల్లలందరికీ మంచి జరిగే రోజుల కోసం వెతకడానికి వారు కంకణం కట్టుకున్నారు. సత్యమూ, న్యాయమూగల మరొక జీవన విధానాన్ని వాళ్ళు అన్వేషిస్తున్నారు. జనానికందరికీ వాళ్ళు మంచిని కోరుతున్నారు" అన్న ఆమె మాటలు నేటికి కర్తవ్యబోధ చేస్తూనే ఉంటాయి.

విప్లవకారులను కన్న నిజమైన తల్లుల జీవితాలన్నీ గుండెలను పిండిచేసే మహోన్నత కావ్యాలే. అందుకే "అమ్మా నను కన్నందుకు విప్లవాభివందనాలు" అని అంటారు శివసాగర్. మహాశ్వేతా దేవి 'ఒక తల్లి' పోలీసులు కాల్చి చంపిన తన బిడ్డ మరణానికి కారణాలను వెతుక్కుంటూ వెళ్లిన ఎందరో అమ్మలను జ్ఞప్తికి తెస్తుంది.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నైజాం రజాకార్లనెదిరించి, యూనియన్ సైన్యాన్ని ధిక్కరించి నడిపిన పోరాటంలో ఎందరో తల్లుల గుండె చెదిరే త్యాగాలున్నాయి. పాలిచ్చే బిడ్డలను పంటపొలాల్లో వదిలేసి ఆయుధాలు పట్టిన వీరమాతలెందరో. తమ బిడ్డలు ఎక్కడున్నారో, ఏమైపోయారో కూడా తెలియకుండా ఏళ్ళు, దశాబ్దాల తరబడి ఎదురుచూస్తున్న తల్లులను కూడా ఉద్యమం మనకి అనుభవంలోకి తెచ్చింది. ఉద్యమాన్ని కాపాడుకోవడం కోసం బిడ్డల ప్రాణ త్యాగాలను ప్రోత్సహించిన వారు కొందరైతే, బిడ్డల పోరాటంలో భాగం పంచుకొన్నవారు మరికొందరు.

తల్లుల పోరాట పటిమ ముందు అన్నీ దిగదుడుపే. దొరల పెత్తనానికీ, పోలీసుల దాష్టీకాలకూ చరమ గీతం పాడుతూ ప్రతి తల్లీ ఆనాడొక చైతన్యకెరటమయ్యింది. ఊరిదొరల ఆట కట్టించే ఉప్పెనయ్యింది. చంటి బిడ్డలను వదిలేసి చంకన తుపాకులనెత్తుకున్న తల్లులెందరో. తెలంగాణ సాయుధ పోరాటంలో భాగమైన ఒక్కో తల్లిదీ ఒక్కో విలక్షణమైన అనుభవం. ఐలమ్మ మొదలుకొని ఎందరో తల్లులు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ దోపిడీ, పీడనల నుంచి విముక్తి కోసం నాటి మహత్తర తెలంగాణ పోరాటంలో సమిధలుగా మారారు. లాఠీలకూ, తూటాలకూ, నిర్బంధాలకూ వెరువని ఆ తల్లులే నిన్న, నేడు, రేపూ విప్లవోద్యమానికి వెన్నెముక.

మార్క్సిజం, లెనినిజానికి సంబంధించిన సిద్ధాంత గ్రంథాలు, మిహాయిల్ షోలోకోవ్ కథలు, టాల్‌స్టాయ్ యుద్ధమూ-శాంతీ, శ్రీశ్రీ తెలుగు చేసిన మయకోవ్‌స్కీ 'లెనిన్' కావ్యం. దోస్తయేవస్కీ రచించిన 'నేరము-శిక్ష', 'పేదజనం శ్వేతరాత్రులు' వంటి పుస్తకాల్లోని సజనశక్తి అనుపమానమైంది. ఇలా 1990 వరకు సోవియట్ సాహిత్యం తెలుగు సాహితీ ప్రపంచాన్ని, పాఠకలోకాన్ని ఒక ఊపు ఊపింది. ఒక పుస్తకం తరువాత మరో పుస్తకం చదవాలనే ఉత్సాహాన్ని ఇచ్చింది. పిల్లల కోసం వచ్చే సోవియట్ పుస్తకాల్ని పెద్దలు కూడా ఇష్టపడ్డారు. చిన్నకథలో ఎన్నో పెద్ద సంగతుల్ని సునాయసంగా చెప్పే సుగుణం వాటిలో ఇమిడి వుండేది. మంచి అనువాదకులు అందించి సోవియట్ సాహిత్యం చదవడం వల్ల మన భాష కూడా మెరుగవుతుంది. అందుకే సాహిత్యరంగంలో, మీడియాలో పనిచేస్తున్నవారు సోవియట్ సాహిత్యాన్ని ప్రత్యేకించి చదవాలి. ఒకతరం తెలుగువారు సమాదరించిన సోవియట్ సాహిత్యాన్ని చదవడం ఈతరం తెలుగు పాఠకులకు చక్కని అనుభవం.

ఇండియా వేదిక, కాంగ్రెస్ పోకడలు



తెలకపల్లి రవి

దాడులు మాత్రమే గెలిపించలేవని తెలిసిన బీజేపీ నేతలు రాజకీయంగానూ నష్ట నివారణ చర్యలు మొదలెట్టారు. తాము బీసీల కుల గణనకు వ్యతిరేకం కాదని హోంమంత్రి అమిత్ షా చెంపలు వేసుకున్నంత పనిచేస్తున్నారు. కాకపోతే బాధ్యత గల పార్టీగా సమగ్రంగా చేయాలన్నదే తమ ఉద్దేశమని వివరణ ఇస్తున్నారు. అయితే ఇదే విషయమై ప్రధాని మోడీ మొన్న దసరా సందర్భంలోనే భిన్నంగా మాట్లాడటం దేశం మర్చిపోలేదు. కులగణన దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందన్న అర్థంలో ఆయన దాడి చేశారు. కానీ ఇండియాలో చాలా పార్టీలు కులగణనకుమద్దతివ్వడం, సుప్రీం కోర్టు కూడా బీహార్ సర్వే విడుదలకు అనుమతినివ్వడంతో బీజేపీ వెనక్కుతగ్గక తప్పలేదు. అయోధ్య రామమందిరం కూడా తమ ఎజెండాలో చేర్చుకున్న బీజేపీ నేతలు ప్రతిచోటా ఆ ప్రస్తావన తెస్తున్నారు.

ఇండియా వేదికలో పెద్ద పురోగమనం లేదని బీహార్ ముఖ్యమంత్రి, జేడీయు నాయకుడు నితీశ్ కుమార్ వ్యాఖ్యానించడం యాదృచ్ఛికమేమీ కాదు. దేశ రాజకీయాలలోనూ భిన్న కూటములలోనూ ఆరితేరిన నితీశ్ పాట్నాలోనే ఈ వేదిక అంకురార్పణకు చొరవ చూపించారు. దేశంలో ప్రధాని అభ్యర్థుల్లో ఆయన ఒకరని ప్రచారం జరిగినా దానిపై స్పందించకుండా రాజకీయాలు నడిపిస్తున్నారు. సీపీఐ ఆధ్వర్యంలో పాట్నాలో జరిగిన 'బీజేపీ హఠావో-దేశ్ బచావో' ర్యాలీలో పాల్గొంటూ ఆయన ఈ మాట అనడం కూడా గమనించదగ్గ విషయం. కాంగ్రెస్ పార్టీ అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలపైనే ఎక్కువ ఆసక్తి కలిగివున్నట్టు కనిపిస్తుందని కూడా ఆయనన్నారు. నితీశ్ ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ షరామామూలుగా బీజేపీ తనకు అలవాటైన భాషలో ఇండియా వేదిక ఒక తుక్డే తుక్డే గ్యాంగ్ అని అవహేళన చేసింది. నితీశ్ మాటలకు తగినట్టే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ శాసనసభ ఎన్నికల కారణంగా అందులో మునిగి పోయామని అవి పూర్తవగానే మళ్లీ 'ఇండియా'పై దృష్టి పెంచుదామని చెప్పారట. విశేషమేమంటే బీజేపీ మతతత్వంపై పోరాటంలో అయిదు రాష్ట్రాల ఎన్నికలు కూడా కీలకమైనవి. భాగస్వామ్య పార్టీలన్నీ కలిసి దాన్ని ఎదుర్కొవలసి వుండగా అలాంటిదేమీ జరగలేదు. ఖర్గే ఆ సంగతి ప్రస్తావించకుండా ఎన్ని కలు ముగిశాక కార్యక్రమాలు పెంచుదామని చెబుతున్నారు. కాంగ్రెస్ నాయకత్వం ఆలోచనాధోరణి ఇక్కడే తెలుస్తుంది. ఉదాహరణకు మధ్యప్రదేశ్ వంటి చోట్ల ఆ పార్టీతో సర్దుబాట్లు చేసుకోవడం కోసం సమాజ్‌వాదిపార్టీ, జేడీయు వామపక్షాలు ప్రయత్నించాయి. కాని ఫలించలేదు. అఖిలేశ్ యాదవ్ దీనిపై తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు, నితీశ్ కూడా విఫల యత్నం చేశారు. అక్కడ ఉమ్మడిగా సభ జరపాలనే ఆలోచనకు కూడా మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ విముఖత వ్యక్తం చేశారు. ఇందుకోసం ఏర్పాటైన సమన్వయ కమిటీలకు ప్రతినిధిని కూడా పంపించడానికి నిరాకరించారు. నాగపూర్‌లో జరగాల్సిన సభ కూడా ఇదే విధంగా వెనక్కుపోయింది. రాష్ట్రాలలో ఒద్దిక కష్టం గనక 2024 ఎన్నికలపై కేంద్రీకరించడం మంచిదని ఎన్‌సిపి నేత శరద్‌పవార్ సూటిగానే చెప్పారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కూడా ఈ ఎన్ని కల్లో కలసి పోటీ చేసివుంటే బావుండేదని స్పష్టం చేశారు. అది సాధ్యం కాలేదు గనకే రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణలలో సీపీఐ(ఎం) విడిగానే రంగంలోకి దిగుతున్నది. సమాజ్‌వాదిపార్టీ కూడా యూపీలోని 85 లోక్‌సభ స్థానాల్లో తాను 65 చేస్తాననీ, భాగస్వామ్య పార్టీలకు పదిహేను కేటాయిస్తానని సూచనగా చెప్పింది. నితీశ్ మాట్లాడుతూ అందరం కలిసి పనిచేయాలని ఆశించామని అయితే కాంగ్రెస్ అనాసక్తి ఇందుకు ఆటంకమైందని స్పష్టం చేశారు. ఆ పార్టీ తన ఎన్నికల అవకాశాలపైనే దృష్టి పెట్టడం వల్లనే పాట్నా సమావేశం తర్వాత ఇండి యాపనిలో పురోగమనం లోపించిందని తెలిపారు.

ఖర్గే దాటవేతలు

మల్లికార్జున ఖర్గే దీనిపై మాట్లాడకపోగా బీజేపీపై పోరాటానికి 'ఇండియా' కీలకమనీ, లోక్‌సభ ఎన్నికలలో ఇండియాను ముందుకు తీసుకుపోవడానికి తాము కట్టుబడి వున్నామని పవార్ తరహాలోనే జవాబిచ్చారు. శాసనసభ ఎన్నికల్లో తాము బీజేపీని ముఖాముఖి ఢీ కొడుతున్నందున దృష్టి అటు మళ్లించామని సమర్థించుకున్నారు. తాము ప్రధాన శక్తిగా వున్న చోట ఇతరులను కలుపుకుపోవలసిన బాధ్యత కాంగ్రెస్ నిర్వహించవలసిన అవసరం వుంటుంది. అదే జరగడం లేదని ఖర్గే మాటలే స్పష్టం చేస్తున్నాయి. ఇదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీతో పంజాబ్ కాంగ్రెస్ సంబంధాలు మరింత దిగజారాయి. ఈ అయిదు రాష్ట్రాలలోనూ తను అనుకున్న విధంగానే పోటీలు నిర్ణయించు కోవడం తప్ప ఎలాంటి సమన్వయానికి ప్రయత్నించిన దాఖలాలు లేవు. అసలు కాంగ్రెస్‌లోనే పూర్తి ఏకాభిప్రాయం వున్నట్టు కనిపించదు. లౌకికపార్టీలను కలుపుకుని పోవాలని రాహుల్ గాంధీ వంటివారు సూచించినా రాష్ట్రాలలో నాయకులు ఒప్పుకోలేదని 'హిందూ' సంపాదకీయంలో వెల్లడించింది. భాగస్వామ్యపార్టీల నేతల వ్యక్తిగత పోకడలు ఐక్యతకు ఆటంకమవుతున్నాయని, ఇవే 2014లో మెజార్టీ మతవాదం విజయం సాధించడానికి కారణమైనాయనీ కూడా ఆ పత్రిక హెచ్చరించింది. బీజేపీ విధానాలపై వ్యతిరేకత కీలకమైనా భాగస్వాముల మధ్య సమన్వయం కూడా కీలకంగా వుంటుందనీ, రాష్ట్రాల ఎన్నికల్లో పెరిగే విభేదాలు తర్వాత దశలోనూ ప్రభావం చూపిస్తాయని పేర్కొంది.

బీజేపీ బహుముఖ దాడి

ప్రతిపక్షాల కూటమి పరిస్థితి ఈ విధంగా వుంటే మరోవంక బీజేపీ ఎన్‌డిఎ సర్కారు సమస్త శక్తులతో యుక్తులతో దాడి పెంచుతున్నది. ఇండియా అనేది నిజంగానే తమకు బలమైన సవాలు అని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల ఒప్పుకున్నారు. ఇకపైన ఏ ఎన్నికనూ తేలిగ్గా తీసుకోవడానికి లేదని కిందనుంచి పైవరకూ నాయకత్వమంతా కలసికట్టుగా పనిచేస్తేనే ఫలితాలు సాధించగలమని ఆయనన్న మాట బీజేపీలో పరిస్థితికి ప్రతిబింబమే, ఆరెస్సెస్ కూడా ఈ ఎన్నికల నేపథ్యంలో మేధా మధన సదస్సులు నిర్వహించింది. గతవారం ఇదే శీర్షికలో చర్చించినట్టు త్రిముఖ వ్యూహంతో దాడి ప్రారంభించింది. ఎన్నికలు దగ్గరైన కొద్ది మరింత తీవ్రంగా దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నది. నిజంగా ఇది విస్మరించరాని సవాలు. ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఫిబ్రవరి నుంచి జైలులో వుండగా ఇటీవలే సుప్రీంకోర్టు బెయిలు నిరాకరించింది. స్వయంగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు కూడా ఇడి నోటీసులు జారీ అయ్యాయి. ఆప్ మంత్రి అశిథి మాట్లాడుతూ ఆయనను అరెస్టు చేయాలన్నదే కేంద్ర బీజేపీ పన్నాగమని ప్రకటించింది. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ ఇప్పటికే దర్యాప్తును ఎదుర్కొంటున్నందున ఆయన్నూ అరెస్టు చేస్తారని ఆమె సందేహం వెలిబుచ్చారు. తేజస్వియాదవ్, మమతా బెనర్జీ, చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బెహల్‌లతో పాటు కేరళ ముఖ్య మంత్రి పినరాయి విజయన్‌ను, తమిళనాడు నేత స్టాలిన్‌నూ కూడా ఏదో విధంగా కేసుల్లో ఇరికించి నిర్బంధించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించింది. అరెస్టుల మాట ఎలా వున్నా ప్రతిపక్ష పార్టీలపైనా రాష్ట్రాలలో వాటి ప్రభుత్వాలపైన మాత్రం కేంద్రం వ్యూహాత్మకంగా దాడి తీవ్రం చేసింది. చత్తీస్‌ఘఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బెహల్ మహదేవ్‌యాప్ అనే బెట్టింగ్ యాప్‌తో సంబంధం కలిగి వున్నారనీ, రూ.450 కోట్లు ఆయనకు అందాయనీ ఇప్పుడు హఠాత్తుగా చర్యలు మొదలుపెట్టారు. కాంగ్రెస్ మహదేవ్‌ను కూడా వదలిపెట్టలేదని ప్రధాని మోడీ ఎన్నికల సభలో ఎద్దేవా చేశారు. రాజస్థాన్ మంత్రులపైన, కాంగ్రెస్ నాయకులపైన కూడా దాడులు సోదాలు జరుపుతున్నారు. జల్ జీవన్ మంత్రిత్వ శాఖలో 20 వేల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయనీ వాటితో పిహెచ్‌డి మంత్రి మహేష్ జోషికి సంబంధముందనీ హడావుడి మొదలెట్టారు. తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు సంబంధించిన వారిపై ఐటి దాడులు ఇప్పుడే మొదలెట్టారు. ఇవన్నీ కావాలని ఈ తరుణంలో బనాయిస్తున్నారనే విమర్శలు మార్మోగుతున్నాయి. నిజంగా అవినీతి ఆరోపణలుంటే తప్పక చర్యలు తీసుకోవచ్చు. కాని సరిగ్గా ఎన్నికల తరుణంలోనే కేవలం ప్రతిపక్షాల వారిపైనే ఒక్కసారిగా దాడి చేయడంలో రాజకీయ కుత్సితం దాచేస్తే దాగేది కాదు.

దాడులు మాత్రమే గెలిపించలేవని తెలిసిన బీజేపీ నేతలు రాజకీయంగానూ నష్టనివారణ చర్యలు మొదలెట్టారు. తాము బీసీల కుల గణనకు వ్యతిరేకం కాదని హోంమంత్రి అమిత్ షా చెంపలు వేసుకున్నంత పనిచేస్తున్నారు. కాకపోతే బాధ్యత గల పార్టీగా సమగ్రంగా చేయాలన్నదే తమ ఉద్దేశమని వివరణ ఇస్తున్నారు.అయితే ఇదే విషయమై ప్రధాని మోడీ మొన్న దసరా సందర్భంలోనే భిన్నంగా మాట్లాడటం దేశం మర్చిపోలేదు. కులగణన దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందన్న అర్థంలో ఆయన దాడి చేశారు. కానీ ఇండియాలో చాలా పార్టీలు కులగణనకు మద్దతివ్వడం, సుప్రీం కోర్టు కూడా బీహార్ సర్వే విడుదలకు అనుమతినివ్వడంతో బీజేపీ వెనక్కు తగ్గక తప్పలేదు. అయోధ్య రామమందిరం కూడా తమ ఎజెండాలో చేర్చుకున్న బీజేపీ నేతలు ప్రతిచోటా ఆ ప్రస్తావన తెస్తున్నారు. మిజోరాంలోనైతే మోడీ సభల్లో అయోధ్యకు యాత్రీకులను కోటా ప్రకారం పంపడం ఒక వాగ్దానంలా మాట్లాడారంటే పరిస్థితి అర్థమవుతుంది. మైనార్టీలకు వ్యతిరేకంగా మాట్లాడుతూ మెజార్టీ మతస్తులను ఆకట్టుకునే ప్రయత్నం కూడా ఇందులో భాగమే. ఇదెక్కడ ప్రభావం చూపుతుందోననే భయంతో మధ్యప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి కమల్‌నాథ్ రామమందిరం బీజేపీది మాత్రమే కాదనీ తానూ లక్షన్నర విరాళం ఇచ్చానని చెప్పుకోవడం కొసమెరుపు. రానున్న రోజుల్లో మరింత ఉధృతంగా పర్యటించి ఎలాగైనా గట్టెక్కాలని బీజేపీ పథకాలు ఏ రూపం తీసుకునేది చూడవలసిందే.

తెలంగాణలో ఏం జరిగింది?

ఇంత తీవ్రంగా మతతత్వ శక్తులు కేంద్రం దాడి చేస్తుంటే కాంగ్రెస్ అందుకు దీటైన , విశాల విధానం చూపించలేకపోవడం దురదృష్టకరం. తెలంగాణలో ఆఖరి వరకూ ఆలస్యం చేసి వామపక్షాలకు ఒక్కసీటుతో సరిపెట్టాలని షరతుపెట్టింది. సీపీఐ చివరి నిముషంలో కొత్తగూడెం సీటులో కలసి పోటీ చేయడానికి , తర్వాత ఒక ఎంఎల్‌సి సీటు ఇచ్చేట్టు అంగీకారానికి వచ్చింది. మునుగోడులో స్నేహపూర్వక పోటీ అని సీపీఐ చెబుతున్నా కాంగ్రెస్ వద్దని వారించినట్టు సమాచారం. సీపీఐ(ఎం) తాను స్వంతంగా 24 స్థానాల్లో పోటీ చేయనున్నట్టు ప్రకటించింది. సీపీఐ సీట్లలో పోటీ పెట్టబోనని స్పష్టం చేసింది. ఇదే పరిస్థితి ఇతర రాష్ట్రాలలోనూ ప్రత్యక్షమైంది. రాజస్థాన్‌లో 17చోట్ల పోటీ చేస్తున్నది. ఇండియా వేదిక పరిమితులపై సీపీఐ(ఎం) గతంలోనే స్పష్టమైన వైఖరి తీసుకున్న సంగతి గుర్తుండే వుంటుంది. ఇదొక కూటమి గానీ, వ్యవస్థ గానీ కాదని, లౌకిక శక్తుల కలయిక మాత్రమే నని ప్రకటించింది. సమన్వయ కమిటీలోనూ చేరబోనన్నది. జాతీయ ప్రాంతీయ పాలక లౌకికపార్టీల వూగిసలాటలు మతతత్వంపై నిరంతరపోరాటానికి ఒక ఆటంకంగా వున్నాయనేది వాస్తవమని కాంగ్రెస్ చర్యలు నిరూపిస్తున్నాయి. అయినా విశాల ప్రాతిపదికన లౌకికవిధానాల రక్షణకోసం ముందుకు సాగాల నడంలో సందేహం లేదు. అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఆ దిశలో ముందడుగు వేయాలని ఆశించాలి.



ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఫిబ్రవరి నుంచి జైలులో వుండగా ఇటీవలే సుప్రీంకోర్టు బెయిలు నిరాకరించింది. స్వయంగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు కూడా ఇడి నోటీసులు జారీ అయ్యాయి. ఆప్ మంత్రి అశిథి మాట్లాడుతూ ఆయనను అరెస్టు చేయాలన్నదే కేంద్ర బీజేపీ పన్నాగమని ప్రకటించింది. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్‌సోరేన్ ఇప్పటికే దర్యాప్తును ఎదుర్కొంటున్నందున ఆయన్నూ అరెస్టు చేస్తారని ఆమె సందేహం వెలిబుచ్చారు. తేజస్వియాదవ్, మమతా బెనర్జీ, చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బెహల్‌లతో పాటు కేరళ ముఖ్య మంత్రి పినరాయి విజయన్‌ను, తమిళనాడు నేత స్టాలిన్‌నూ కూడా ఏదో విధంగా కేసుల్లో ఇరికించి నిర్బంధించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించింది.

ఓటరు... జెర్ర భద్రం!



ఎన్నికల నగారా మోగింది
రాజకీయ క్రీడ మొదలైంది
ఇక స్వార్థ నేత గణాలు
ప్రచారాల హోరెత్తిస్తాయ్

సభలు సమావేశాలతో
తెగ సందడి రేపుతాయ్
రంగు జెండాలు పట్టుకు
ఇళ్ల ముందు సాగిలబడి
పొర్లు దండం పెడతాయ్

బుద్ధిమంతుల్లా నటిస్తూ
విశ్వాసం పొందుతాయ్
హామీల మంత్రం జపిస్తూ
దొంగ జపం ఆచరిస్తాయ్

లిక్కర్ ఏరులు పారించి
మత్తులో ముంచేస్తాయ్
కరెన్సీ మూటలు పంచి
వినోదంలో దించేస్తాయ్

నయా నాటకాలు వేసి
ఓట్లు దండుకుంటాయ్
పాలక పీఠం అధిష్టించి
ఐదేళ్లపాటు పీడిస్తాయ్


దేశ సంపదలు కొల్లగొట్టి
వట్టి చిప్పను చేతిలబెట్టి
నడి రోడ్డున నిలబెడ్తాయ్

అందుకే ఓ ఓటరన్నా !
ముంచుకొచ్చే ముప్పు
ముందస్తుగానే పసిగట్టి
ఎన్నికలు ముగిసే వరకు
జెర్ర భద్రంగా మెదులన్నా!

(ఓటరు మహాశయులకు విన్నపంగా)

- కోడిగూటి తిరుపతి,
9573929493

స్ఫూర్తి ప్రధాత...దాశరథి



ఓ నిజాం పిశాచమా కానరాడు, ఎవరు కాకతి, ఎవరు రుద్రమ అంటూ నిప్పులు చెరి గాడు. ఆ చల్లని సముద్ర గర్భం అంటూ పాట రాసి పీడిత ప్రజల పక్షాన నిల బడ్డాడు. వారి గొంతుకగా పోరు సాగించి తెలంగా ణకి కొత్త ఊపిరినందించాడు. కవి, రచయిత, తెలంగాణ విముక్తి కోసం శ్రమించిన యోధుడు. అతను ఒక వ్యక్తి కాదు శక్తి. అన్ని రంగాల్లో ఆరితేరిన కరడుగట్టిన తెలంగాణవాది. తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన ధీశాలి. ఆయనే మహాకవి దాశరథి కృష్ణమాచార్య. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని సగర్వంగా ప్రకటించి ఇప్పటి ఉద్యమానికీ ప్రేరణ నందించాడు. వరంగల్ జిల్లా చిన్న గూడూరు గ్రామంలో 1925 జూలై 22న జన్మించాడు. ప్రస్తుతం ఈ గ్రామం మహబూబాబాద్ జిల్లాలో ఉంది. బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషను, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియెట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బీఏ చదివాడు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు. ఉపాధ్యాయుడిగా, పంచాయతీ ఇన్‌స్పెక్టర్‌గా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషిచేసాడు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసాడు.

హైదరాబాద్ సంస్థానంలో నిజాం అరాచక పాలనలో హింసలను భరిస్తున్న తెలంగాణను చూసి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా నినదించాడు. దగాకోరు, బటాచోరు, రజాకారు, పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్ అంటూ నిజాం పాలన మీద బాణం ఎక్కుపెట్టాడు.ఆంధ్రమహాసభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలుశిక్ష అనుభవించాడు. నిజామాబాద్‌లోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది నిజాం ప్రభుత్వం. ఆయనతో పాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. పండ్లు తోముకోవడానికిచ్చే బొగ్గుతో జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిన్నాడు. దాశరథి మంచి ఉపన్యాసకుడు కూడా. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా 1977 ఆగష్టు 15 నుండి 1983 వరకు పనిచేసాడు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెలుచుకున్నాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజల్‌లను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించాడు. తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికీ ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి. 1987 నవంబరు 5న దాశరథి మరణించాడు. బతికున్నపుడు ప్రజల్ని చైతన్య పరిచే ఎన్నో రచనలు చేశారు. ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. నేటి తరం రచయితలకు దాశరథి ఓ స్ఫూర్తిదాయకం. ఆయన జన్మించిన మహబూబాబాద్ జిల్లాను దాశరథి జిల్లాగా నామకరణం చేయాలి. ఆయన గొప్పతనాన్ని నలుదిక్కులా చాటాలి. ప్రభుత్వం ఆయన జయంతి, వర్థంతిలను అధికారికంగా నిర్వహించాలి. అదే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి.

(నేడు దాశరథి కృష్ణమాచార్య వర్థంతి)

- కామిడి సతీష్‌రెడ్డి, 9848445134



వసంత కా(కో)కిలా.....



జంధ్యాల రఘుబాబు
9849753298

కాకి కోకిల అవుతుందా... కంచు కనకం అవుతుందా అని నానుడి ఉంది, రఫీ గారు పాడిన పాట కూడా ఉంది. కాకి కోకిల కాలేదు కాని ప్రకృతిని శుభ్రంగా పెట్టడంలో మునిగి ఉంటుంది. కావుకావుమని అరుస్తుందే కాని తన వాళ్ళలో ఒక్కరికి కష్టమొచ్చినా, అన్యాయం జరిగినా సహించదు, తిరగబడుతుంది. కోకిల అలా కాదు, తన ఆనందం కోసమే పాడుకుంటుంది. ఎంత ఓపికలేనిదంటే కాకి గూట్లోనే గుడ్లు పెట్టి తన పిల్లలను పొదిగిస్తుంది, ఫ్రీగా. కాకి సరోగసి చేసిన మొదటి జీవిపైన కనిపించే వాటిలో. సముద్రాల్లో ఇలాంటివి ఎన్నో జరుగుతుంటాయి కాని మనకు కనిపించవు. మళ్ళీ కాకి దగ్గరకొస్తే, నమ్మకమున్నోళ్ళకు కాకిపై భక్తి కూడా ఉంటుంది. తమ పెద్దవాళ్ళను వాటిలో చూసుకుంటారు. తన గుడ్లను తినేసిన నాగుపాముపై పగ తీర్చుకోవడం కోసం, రాణిగారి నగలను తెచ్చి దాని పుట్టలో వేసి రాజభటుల ద్వారా చంపిస్తుంది కాకి ఓ కథలో. ఎంతో తెలివైనది కాకి. కవులు కోకిలపై రాసిన వారున్నారు, అలాగే కాకిపై కూడా రాశారు చాలా మంది. కోకిలకి కళ్ళు ఎర్రగా ఉంటాయి కాని కోపం రాదు. అదే కాకికి కళ్ళు ఎర్రగా లేకపోయినా కళ్ళెర్ర చేసినంత కోపమొస్తుంది అన్యాయాన్ని చూసినప్పుడు. సాయం చేయడంలో కాకికి కోయిలకు పోలికే లేదు.

ఓట్ల పండుగొచ్చింది. జమిలి అని ఇంకోటని గజిబిజి చేసే మాటలూ తెచ్చింది. ఏ రోజూ కనిపించని నాయకులు పాలోమని తూనీగల్లా, కందిరీగల్లా, తేనెటీగల్లా గిరికీలు కొడుతున్నారు. ఒకరి మీద ఒకరు అస్త్రాలు వేస్తున్నారు, వేయించుకుంటున్నారు. మా మిత్రుడంటుంటాడు వీళ్ళంతా ఆలీబాబా నలభై దొంగల్లో భాగమని. ఆ కథే తీసుకుంటే నలభై దొంగలూ ఒకేసారి వచ్చి వెడతారు. అందరూ ఒకే మాట మీద ఉంటారు. దొంగలకూ ఒక క్రమశిక్షణ ఉండాలని అన్నా అనొచ్చు. ఏమైనా అన్న రామారావు ఆలీబాబా నలభై దొంగలను తెరపై చూపించాడు. ఆయన సినిమాల్లో తెర దించేశాక రాజకీయాల్లో తెర లేపాడు. ఇదంతా చెప్పడం ఎవరికీ ఈ విషయాలు తెలియవని కాదు, ఒకసారి గుర్తు చేద్దామనే. మెట్రో రైళ్ళొచ్చి హైదరాబాదులో జనాల ప్రయాణం ఎలా వేగం పెంచారో ఆయన రాజకీయాల్లో వేగం పెంచాడు. ఎన్నో రికార్డులు బద్దలు కొట్టినా అదంతా పాతవాళ్ళను ఇతర పార్టీలవాళ్ళనో తన దాంట్లో చేర్చుకొనే ఇదంతా చేశాడు కదా అనుకోవచ్చు. అది నిజం కూడా. కొద్దిమంది మినహా మిగతా వాళ్ళందరూ పాతోళ్ళే. కొత్త సీసాలో పాత సారానే.

ఎన్నికలొస్తే వాతావరణం వేడెక్కుతుంది. నాయకులంతా మాంచి కాక మీద ఉన్నారు. ప్రతిఒక్కరూ పొయ్యి వెలిగించి ఉప్పు ఉప్పుమని ఊదరగొడుతున్నారు. వీళ్ళ వేడికంటె ముందు వాతావరణమే వేడిగా తయారయింది. భూగోళంపై ఉష్ణోగ్రత అంతకంతకూ పెరుగుతోంది. భూమి వేడెక్కడం మొదలు పెట్టినప్పటినుండి రుతువులు కనిపించకుండా పోయాయి. చెట్లు కొండలు కొట్టేసి వ్యాపారాలు చేస్తుంటే వాతావరణం మారకుండా ఉంటుందా. దేశంలోని చెట్లన్నీ లెక్కవేసి ఒక్కో మనిషికి ఎన్ని ఉన్నాయని ఆరా తీస్తే ఇరవై ఒకటి అని లెక్క తేలింది. అదే ఒక్కో దేశంలో ఒక్కో విధంగా ఉంది. మనుషులు, వారి ప్రాణాలే లెక్క లేకుండా పోతున్న సమయంలో చెట్ల గురించి చెబుతారేమి అని ఎవరైనా అడిగితే సమాధానాలు దండిగే ఉన్నాయి. అసలు ఈ భూమి మీద చెట్లు వచ్చి ఎన్నో ఏండ్లు గడిచాకనే మనిషి పుట్టడం జరిగింది. నేను పుట్టాను భూగోళం ఏడ్చింది అని పాడి ఉండొచ్చునేమో తెలీదు కాని అంతపనీ చేస్తున్నారు ఈ మనుషులు. తాము పుట్టాక ఎన్నో జీవజాతులను భూమి మీద లేకుండా చేశారు. ఏమన్నా అంటే కర్బన ఉద్గారాలని ఇంకోటనీ ఇతర దేశాల మీదికి వేస్తారు. వారు చేయిస్తున్న యుద్ధాల గురించి తాము కాని ఇంకొకరు కాని మాట్లాడకూడదు. ఇదంతా భూమి మీద, భూమి మీద ఉన్న రుతువుల పైన ప్రేమతోనే.

వసంత రుతువులో కోయిలలు కూస్తాయి. ఎండి రాలిపోయిన ఆకుల స్థానంలో కొత్త ఆకులు చిగురిస్తాయి. మనిషిలోనూ అంతే. ప్రకృతిని చూసి కదా మనిషి నేర్చుకునేది. ఐతే ఈ వసంత కోకిల ఎప్పుడొస్తుందో ఎంత తొందరగ పోతుందో, అన్ని రోజులు తనతో ఉన్నవాళ్ళను గుర్తు కూడా పెట్టుకోదని సినిమా కూడా వచ్చింది. తనంతట తాను వస్తుంది, తన పనైపోగానే పోతుంది. సింపుల్‌గా వసంతకోకిల పరిచయం ఇది. ఇప్పుడున్న రాజకీయ వాతావరణం చూస్తే ఈ వసంత కోకిలే గుర్తుకొస్తుంది. అలా వచ్చి ఇలా పోయే వారి గురించి తీయగా కృష్ణశాస్త్రిలా మనం రాయలేం, శ్రీశ్రీలా పదునుగా రాయాల్సిందే వారిపై. కోయిల పాటలాగా పెద్ద కోయిలలు, చిన్నవి ప్రజల గురించి పాడుతాయి. ఎంత తీయగా అంటే సినారే ఘజల్‌లా శ్రావ్యంగానన్న మాట. అది కొద్దిసేపే, వెంటనే అపరిచితుడిలా తల ఈ పక్కకు తిప్పి ఇతర రాజకీయ పక్షాలపై కాకిలాగ అరుస్తారు. స్వీటుగా మాట్లాడిన గొంతుతోనే చెవుల దిరిపోయేలా దుష్ట సంహారం చేస్తామని పలుకుతారు. అటు నుంచి కూడా అంతే.

పైన చెప్పుకున్నట్టు కోకిల కాకి గూట్లో గుడ్లు పెట్టినట్టు కొంతమంది ఎన్నికల వసంత కోయిలలు వేరే పార్టీల్లోకి తమ వాళ్ళను పంపి, ఎన్నికలప్పుడు తిరిగి ఘర్ వాపసి అనో ఇంకో పేరుతోనో మళ్ళీ వెనక్కు పిలిపించుకుంటారు. ఇది పక్కా కోకిల గుణం. ఇతరులను, ఇతరుల శ్రమను దోచుకు తినే గుణం. అందుకే కాకిలా నిత్యం మన వెంటే ఉన్నారా లేదా అని, వసంత కోకిలలా ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చి అవి చేస్తాం, ఇవి చేస్తాం అని ఆప్తవాక్యాలు పలికే వాళ్ళను ఓ కంట కనిపెట్టి ప్రజలు తమ భవిష్యత్తును తామే బాగుపరచుకోవాలి. ఒకరిద్దరున్నా ఎప్పుడూ ప్రజల వైపే మాట్లాడేవారిని బలపరచి వాళ్ళ సంఖ్యను పెంచుకోవడం కూడా ప్రజల కర్తవ్యమే.

కాకి, కోకిలల గురించి మాట్లాడి నన్నొదిలేశారని చిలుక అనవచ్చు. కోకిల కళ్ళు ఎర్రగుంటే నా ముక్కు ఎర్రగుంటుంది. అవి పాట పాడొచ్చు నేను ఏకంగా మాట్లాడతాను. చిలుక పలుకులంటారు ఎవరైనా ముద్దుముద్దుగా మాట్లాడితే. భాషతో సంబంధం లేకుండా ఏ భాషైనా నా భాషే. చిట్టీచిలకమ్మా అమ్మా కొట్టిందా అని నా పేరు వాడుకొని పిల్లలకు పాటలూ నేర్పుతారు. ఆ చిట్టీ చిలకమ్మా పాటని ముఖ్యమంత్రులెలా చెబుతారో మిమిక్రీ వాళ్ళు కూడా వాడుకుంటారు. పెద్దోళ్ళంతా ముదురు మాటలు మాట్లాడితే పిల్లల బ్యాచ్ చిలకపలుకులు పలుకుతారు అని చిలుకలు అలగొచ్చు. ఇంతలో గోరింక వచ్చి నా గురించి కూడా ఓ పది లైన్లు రాయొచ్చు కదా అనొచ్చు. ఇది మామూలు పక్షుల గురించి కాదమ్మా రాజకీయ పక్షుల గురించి రాస్తున్నది, ఎక్కువ రాసి ఎడిటర్ గారిని, ఎడిట్ పేజి చూసే వారిని ఇబ్బంది పెట్టకూడదని అన్ని పక్షులకీ మనవి చేస్తూ ఈ ఎన్నికల వేళ ఎలక్షన్ పక్షుల గురించి జాగ్రత్తగా ఉండమని మనవి చేసుకుంటూ......



వసంత రుతువులో కోయిలలు కూస్తాయి. ఎండి రాలిపోయిన ఆకుల స్థానంలో కొత్త ఆకులు చిగురిస్తాయి. మనిషిలోనూ అంతే. ప్రకతిని చూసి కదా మనిషి నేర్చుకునేది. ఐతే ఈ వసంత కోకిల ఎప్పుడొస్తుందో ఎంత తొందరగ పోతుందో, అన్నిరోజులు తనతో ఉన్నవాళ్ళను గుర్తు కూడా పెట్టుకోదని సినిమా కూడా వచ్చింది. తనంతట తాను వస్తుంది, తన పనైపోగానే పోతుంది. సింపుల్‌గా వసంతకోకిల పరిచయం ఇది. ఇప్పుడున్న రాజకీయ వాతావరణం చూస్తే ఈ వసంత కోకిలే గుర్తుకొస్తుంది. అలా వచ్చి ఇలా పోయే వారి గురించి తీయగా కృష్ణశాస్త్రిలా మనం రాయలేం, శ్రీశ్రీలా పదునుగా రాయాల్సిందే వారిపై.

దేశాన్ని అమ్మేందుకు బీజేపీ కుట్ర

విభజించు - పాలించు పాలసీతో దేశ సమగ్రతకు ముప్పు

- రైతులు, కూలీలు, కార్మికులకు వ్యతిరేకంగా మోడీ విధానాలు
- అందుకే బీజేపీని ఓడించాలి : ఎస్వీకే వెబినార్‌లో అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు డా. అశోక్ ధావలే

హైదరాబాద్ : దేశాన్ని కార్పొరేట్లకు అమ్మేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు డా. అశోక్ ధావలే అన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా బడా వ్యాపారుల పరం చేస్తుందని చెప్పారు. బ్రిటీష్ వారు అమలు చేసిన విభజించు - పాలించు పాలసీని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్నదనీ, దీనివల్ల దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లుతుందన్నారు. "బీజేపీని ఓడించాలని కిసాన్ మోర్చా ఎందుకు పిలుపునిచ్చింది" అనే అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం శనివారం నిర్వహించిన వెబినార్‌లో అశోక్ ధావలే మాట్లాడారు. దేశంలో రైతులు, రైతు కూలీలు, కార్మికులు, మహిళలు, దళితులు, ఆదివాసీలు, బీసీలు, విద్యార్థులకు వ్యతిరేకంగా బీజేపీ విధానాలున్నాయనీ, అందుకే త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల ఎన్నికలతో పాటు సాధారణ ఎన్నికల్లో కూడా బీజేపీని ఓడించాలని సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత కిసాన్ సభ పిలుపునిచ్చిందని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబట్టేందుకు మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను దేశ రైతాంగం సమిష్టిగా ఏకతాటిపైకి వచ్చి తిప్పికొట్టిందన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో రోడ్లపై 380 రోజులు రైతులు ఆందోళన చేయడంతో మోడీ ఆ చట్టాలను వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు. ఆ ఉద్యమంలో 750 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. అమరులకు నివాళు లర్పించారు.

మోడీ అధికారం చేపట్టిన తర్వాత దేశంలో లక్షకు పైగా రైతులు, రైతు కూలీలు ఆత్మహత్య చేసుకున్నారని నేషనల్ క్రై రికార్డ్సు బ్యూరో ప్రకటించిందనీ, ప్రపంచ ఆకలి సూచి-2023లో బారత దేశం 111వ స్థానంలో ఉందని ఆయన పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యలకు మోడీ ప్రభుత్వ విధానాలే కారణమని చెప్పారు. రైతులు పండించే ప్రతి పంటకు ఎమ్మెస్పీ ఇవ్వాలన్న స్వామినాథన్ కమిషన్ సిపార్సులను మోడీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, డీజిల్ రేట్లు విపరీతంగా పెంచడంతో రైతుకు సాగు భారంగా మారిందన్నారు. ప్రతి పంటకు ఎమ్మెస్పి ప్రకటించాలనీ, రైతులు, రైతు కూలీలకు ప్రతి నెలా పెన్షన్ ఇవ్వాలని, రైతు రుణాలు మాఫీ చేయాలని అశోక్ ధావలే డిమాండ్ చేశారు. వరికి కేంద్రం ప్రకటించిన మద్దతుధర కంటే అధికంగా కేరళలో రైతులకు ఆరాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక,కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 26,27,28 తేదీల్లో దేశ వ్యాప్తంగా మహా ధర్నాకు ఎస్‌కెఎంతో పాటు అన్ని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని అశోక్ ధావలే చెప్పారు.

మహాదేవ్ యాప్ పేరిట కాంగ్రెస్ అవకతవకలు

- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాదేవ్ యాప్ పేరిట కాంగ్రెస్ పార్టీ ఆర్థిక అవకతవకలకు పాల్పడు తున్నదని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ప్రతి ఒక్కరి నెంబర్ వస్తుందనీ, అప్పుడు వాళ్లు కూడా జైలుకు వెళ్లాల్సిందేనని ఎమ్మెల్సీ కవితనుద్దేశించి అన్నారు. తెలంగాణ సర్కారు గొప్పలు చెప్పిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందనీ, ఆ ప్రాజెక్టు బిగ్గెస్ట్ ఇంజినీరింగ్ బ్లండర్ అని విమర్శించారు. బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శని వారం హైదరాబాద్‌కు వచ్చారు. రాజా సింగ్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం హోటల్ కత్రియాలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా తాను బ్యాట్ మెన్‌గా వచ్చాననీ, బీజేపీ గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎంతో దోచుకున్నాయని ఆరోపించారు.

రాజస్థాన్ సచివాలయ ంలో కోట్లు, కిలోల కొద్దీ బంగారం దొరకడమే దానికి నిదర్శనమన్నారు. విదేశాల నుంచి కూడా ఆ పార్టీకి డబ్బులు వస్తున్నాయనీ, మహాదేవ్ యాప్ పేరిట రూ.508 కోట్లు ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భాగేల్ కు అందాయని ఆరోపించారు. కాంగ్రెస్ గ్యారెంటీలు వర్కవుట్ కావట్లేదన్నారు. తెలంగాణ ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ ఆలస్యంతో ఎంతోమంది మరణించారని తెలిపారు. సీఎం కేసీఆర్ మంచి చేస్తారనుకుంటే నిరు ద్యోగులను మోసం చేశారని ఆరోపిం చారు.

కేసీఆర్ జాతీయ రాజకీయాలు చేద్దామనుకుంటే ఆయన బిడ్డ కవిత ఢిల్లీ లిక్కర్ కేసులో జాతీయ స్థాయి వార్తల్లో నిలిచిందని విమర్శించారు. లిక్కర్ కేసులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి జైల్లో ఉన్నారనీ, తప్పు చేసిన వారె వ్వరూ తప్పించుకోలేరని చెప్పారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరివార్ సర్వీస్ కమీషన్‌గా మారిందని ఆరోపించారు. గత ఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన హామీలపై చర్చకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. హామీలన్నీ విస్మరిం చారని విమర్శించారు.

మేడిగడ్డ బ్యారేజ్‌పై సీబీఐ విచారణ జరపాలి

- నిజానిజాలను ప్రజలకు తెలపాలి : కిషన్ రెడ్డి

నవతెలంగాణ-భూపాలపల్లి/ మహాదేవపూర్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కుంగుబాటుపై సీఎం కేసీఆర్ వెంటనే సీబీఐ విచారణకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అన్నారు. లేదంటే ప్రభుత్వమే సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను తెలంగాణ సమాజానికి తెలపాలని కోరారు. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్‌లో కుంగిపోయిన పిల్లర్లు, ప్రాజెక్టును శనివారం కిషన్ రెడ్డి నేతృత్వంలో కిసాన్ మోర్చా అధ్యక్షుడు కె.లక్ష్మణ్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, భూపాలపల్లి మంథని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులు చందుపట్ల కీర్తి రెడ్డి, చందుపట్ల సునీల్ రెడ్డి పరిశీలించారు. హెలికాప్టర్ ద్వారా మేడిగడ్డ ప్రాజెక్టును విహంగ వీక్షణం చేశారు. అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బ్యారేజ్‌లో 20వ పిల్లర్లు కుంగిపోవడం, పగుళ్లు ఏర్పడటంతో మేడిగడ్డ ప్రాజెక్టు పూర్తిగా ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కోట్ల రూపాయల ప్రజా సొమ్మును కేసీఆర్ దుర్వినియోగం చేశారన్నారు. అతనే ఇంజినీరింగ్, కాంట్రాక్టర్ ఇతర అవతారాలెత్తి అవినీతికి పాల్పడ్డారని, ప్రజలెరికీ మేలు జరుగకపోగా సీఎం కుటుంబ సభ్యులే లబ్ది పొందారని ఆరోపించారు. ప్రాజెక్టులో జరిగిన ఘటన తెలియగానే విచారణ కోసం కేంద్ర జల మంత్రిత్వ శాఖకు లేఖ రాశానని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారులు కాళేశ్వరాన్ని పరిశీలించి కేంద్రానికి కీలక అంశాలు నివేదించినట్టు తెలిపారు. ఆ నివేదికను కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి పంపించిందన్నారు.

ఫాక్స్‌కాన్‌పై కేటీఆర్ తప్పుడు ప్రచారం

- టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌కు రావాల్సిన కర్నాటక రాష్ట్రానికి తరలించాలంటూ డీకే శివకుమార్ ఫోక్స్‌కాన్ కంపెనీకి లేఖ రాసినట్టు మంత్రి కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం సమస్యను పక్కదారి పట్టించేందుకు కేటీఆర్ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ మీద బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వార్ రూమ్ నుంచి డీకేతో మాట్లాడామనీ, ఆయన లేటర్‌హెడ్ ట్యాపర్ చేసినట్టు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపారన్నారు. గ్రామ, బూతు స్థాయి నాయకుడిలా కేటీఆర్ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ను బదనాం చేసేలా ఆయన ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఫేక్ న్యూస్, మార్ఫింగ్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఓయాలో బస్సు పెట్టి కర్నాటకకు రమ్మంటే కేటీఆర్ రాలేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దళారీ ప్రభుత్వం వస్తుందని కేసీఆర్ చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు.

15 రోజులు... 54 నియోజకవర్గాలు

సీఎం కేసీఆర్ ప్రచారం షెడ్యూల్ ఖరారు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ఎన్నికల ప్రచార షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 13 నుంచి 28వ తేదీ వరకు 15 రోజుల్లో 54 నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం చేసేలా ప్రణాళిక రూపొందించారు.

ఇప్పటి వరకు 30 నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభల పేరుతో సుడిగాలి పర్యటనలు చేస్తూ, పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ఆయన ఈ స్పీడ్‌ను మరింత పెంచారు. రోజూ కనీసం మూడు నుంచి నాలుగు నియోజవర్గాల్లో జరిగే బహిరంగ సభల్లో ఆయన పాల్గొంటారు. ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే సభల షెడ్యూల్ గతంలోనే ఖరారైన విషయం తెలిసిందే. ఈ నెల 9న సీఎం కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాల్లో నామినేషన్లు దాఖలు చేస్తారు.

25న హైదరాబాద్‌లో జరిగే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొంటారు. 28వ తేదీ వరంగల్ ఈస్ట్, వెస్ట్ నియోజవర్గాలతో పాటు తాను పోటీచేస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో జరిగే సభతో ఎన్నికల ప్రచారాన్ని ముగిస్తారు.

దేశానికి దిక్సూచి తెలంగాణ మోడల్

- షోలాపూర్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశానికి తెలంగాణ మోడల్ దారిచూపుతుందనీ, సీఎం కేసీఆర్ పాలనలో అన్నిరంగాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మహారాష్ట్రలో చేనేత కార్మికుల బాధలు, కష్టాలు తీరాలంటే తెలంగాణ నమూనానే ఏకైక పరిష్కారమని అభిప్రాయపడ్డారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా షోలాపూర్ వెళ్లిన ఆమె అక్కడి వస్త్ర పరిశ్రమలను సందర్శించి, వాటి నిర్వాహకులు, కార్మికులతో మాట్లాడారు. దానికి సంబంధించిన వీడియోను ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మహారాష్ట్రలోని పరిశ్రమలకు నీరు, విద్యుత్ కొరత తీవ్రంగా ఉన్నాయనీ, కరెంటు చార్జీలు కూడా చాలా ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. మౌలిక సదుపాయాలు కూడా సరిగ్గా లేవన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలవుతున్న పథకాలను ఆమె వివరించారు.

బీజేపీకి వ్యతిరేకంగా విద్యార్థులు ఐక్యం

- ఎన్ఈపీ, ఫీజుల పెంపుపై ఆగ్రహం
- 16 విద్యార్థి సంఘాలతో కూటమి
- కేంద్రం తీరును తప్పుబడుతూ భారీ ఎత్తున ప్రచారానికి ప్రణాళికలు



న్యూఢిల్లీ : కేంద్రంలోని అధికార బీజేపీకి వ్యతిరేకంగా విద్యార్థులు ఏకమయ్యారు. బీజేపీని, నూతన విద్యా విధానం (ఎన్ఈపీ), క్యాంపస్‌లలో మతతత్వం, ఫీజుల పెరుగుదలను వ్యతిరేకిస్తూ దాదాపు 16 విద్యార్థి సంఘాలు చేతులు కలిపాయి. ఇందులో వామపక్ష, ప్రతిపక్షాలకు చెందిన విద్యార్థి సంఘాలు ఉన్నాయి. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, సీఆర్జేడీ, డీఎంకే విద్యార్థి విభాగం, ఎన్ఎస్‌యూఐ, సమాజ్‌వాదీ ఛాత్ర సభ వంటి పేరు పొందిన విద్యార్థి సంఘాలు ఇందులో ఉన్నాయి. ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే తీసుకొచ్చిన ఎన్ఈపీని విద్యార్థి సంఘాలు తప్పుబట్టాయి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచి ముఖ్యమైన భాగాలను తొలగించి విద్యారంగానికి మతం రంగు పూస్తున్నారని ఆరోపించాయి. ఈ మేరకు ఈ విద్యార్థి సంఘాలు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. " విద్యారంగం విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి గతంలో ఎన్నడూ లేని విధంగా మరింత స్పష్టంగా ఉన్నది. ప్రభుత్వ విద్యా వ్యవస్థలను నిర్వీర్యం చేసి రాజ్యాంగ దృష్టికి ప్రాథమికంగా విరుద్ధంగా ఉండే మత విధ్వంసక పథకంతో భర్తీ చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నది. దేశం పేరు ఇండియాను పుస్తకాల నుంచి తొలగించే ప్రయత్నాన్ని బీజేపీ ఇప్పటికే మొదలు పెట్టింది" అని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. వచ్చే ఏడాది దేశంలో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నాయనీ, అలాగే, బీజేపీ ప్రభుత్వాన్ని నియంత్రించే ప్రపంచంలోనే అతిపెద్ద ఫాసిస్టు సంస్థ ఏర్పడి 2025 నాటికి వందేండ్లు పూర్తి చేసుకుంటున్నదని ఆరెస్సెస్‌ను పరోక్షంగా ఉటంకిస్తూ వెల్లడించాయి.

'విద్యార్థులకు తెలిసేలా ప్రచారం'

ఎన్ఈపీ ప్రేరిత ఫీజుల పెంపుపై తాము దేశవ్యాప్తంగా త్వరలోనే ప్రచారాన్ని నిర్వహించి విద్యార్థులకు తెలియబరుస్తామని ఎస్ఎఫ్ఐ జనరల్ సెక్రెటరీ మయూఖ్ బిశ్వాస్ అన్నారు. క్యాంపస్‌లలో కాషాయీకరణను సహించబోమని స్పష్టం చేశారు. ఎన్ఈపీ దేశ సమగ్రత, సహకార సమాఖ్య విధానాన్ని వ్యతిరేకమని డీఎంకే విద్యార్థి విభాగం హెడ్ సివిఎంపి ఎఝిలరసన్ ఆరోపించారు. బీజేపీ పాలనలో ప్రయివేటీకరణ దారుణంగా పెరిగిపోతున్నదని సీఆర్జేడీ జనరల్ సెక్రెటరీ ప్రియాంక భారతి ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ పాలనలో యూనివర్సిటీలలో ఫీజులు పెరిగాయనీ, జేఎన్‌యూ వంటి క్యాంపస్‌లలో పోరాటాలు జరిగాయన్నారు.విద్య కేంద్రీకరణ, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు భారీ ప్రచారానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయని భారతి ఆరోపించాం

నేనెందుకు కబ్జాలు చేస్తా?

- నాకే ఏడెనిమిది వందల ఎకరాల భూముంది
- కేసీఆర్ అంటే విశ్వాసం...బీఆర్ఎస్ అంటే భరోసా
- అధికారంలోకి మళ్లీ మా ప్రభుత్వమే
- కాళేశ్వరంపై కమిటీ రిపోర్టు..ఎలక్షన్స్ స్టంట్ : ప్రెస్‌క్లబ్ మీట్ ది ప్రెస్‌లో మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'నేనెందుకు కబ్జాలు చేస్తా? నాకే ఏడెనిమిది వందల ఎకరాల భూముంది. కష్టపడి సంపాదించున్న. తెలంగాణలో జరిగిన అభివృద్ధితో నా ఆస్తుల విలువ అమాంతం పెరిగింది. కబ్జా చేసినట్టు నిరూపించండి. అది నిజమైతే నేనే దగ్గరుండి రిజిస్ట్రేషన్ చేయిస్తా. ఎవరిష్టమొచ్చినట్టు వారు మాట్లాతారు. దారిన పోయే దానయ్య చేసే ఆరోపణలు పట్టించుకోను' అని మంత్రి మల్లారెడ్డి అన్నారు. 'కిషన్‌రెడ్డి లేఖ రాశారంట..డ్యామ్ సేఫ్టీ వాళ్లు వచ్చి కాళేశ్వరం అడుగుకుపోయిరంట...డ్యామ్ పనికిరాదని నివేదిక ఇచ్చిరంట..ఒక్కరోజులో ఇదంతా సాధ్యమా? బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి కాళేశ్వరంపై కమిటీ రిపోర్టు ఇచ్చింది. ఇదంతా ఎన్నికల స్టంట్' అని విమర్శించారు. కేసీఆర్ అంటే విశ్వాసమనీ, బీఆర్ఎస్ అంటే భరోసా అని చెప్పారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని నొక్కి చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతున్నదనీ, అన్నింటిలోనూ నెంబర్ వన్ స్థానంలో ఉందని చెప్పారు. 56 ఏండ్లు పాలించిన కాంగ్రెసోళ్లు కరెంటు ఇచ్చే అవకాశమున్నా ఇవ్వలేకపోయారనీ, సరిపోను నీళ్లున్నా ప్రజలకు అందించలేకపోయారని విమర్శించారు. వాళ్లకు పరిపాలించ చేత కాలేదన్నారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవి కొనుక్కుని సీట్లు అమ్ముకుంటున్నాడని కాంగ్రెస్ నేతలే ఆరోపిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. ఆలూలేదు సూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్టుగా కాంగ్రెసోళ్లు అప్పుడే తాము గెలిచి ఎమ్మెల్యేలు అయినట్టు భ్రమించి మంత్రి పదవుల కోసం కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. కర్నాటకలో కాంగ్రెస్ గెలిచిందని జబ్బలు సరుసుకుంటే సరిపోదన్నారు. దేశమంతటా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తూ వస్తోందన్నారు. ప్రాంతీయ పార్టీలున్న చోట్ల బీజేపీ పప్పులు ఉండకట్లేదన్నారు. పాలనలో ప్రజలపై భారాలు మోపే విషయంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని విమర్శించారు. మోడీ పాలన మస్తు ఫీరమైపోయిందనీ, ధరలు పెంచుకుంటూ పోతే పేదలు ఎట్లా బతుకుతారని ప్రశ్నించారు. రాష్ట్ర సంపద పెంచుడు...పేదలకు పంచుడు ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాకనే మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతున్నదన్నారు. తాను విద్యాసంస్థలు, యూనివర్సిటీ పెట్టి దేశంలోనే ఎక్కడా లేని విధంగా 220 కోర్సుల్లో విద్య అందిస్తున్న ఘనత తనదన్నారు. 40వేలకు పైగా విద్యార్థులు తమ కళాశాల్లో ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్నారని చెప్పారు. తనకే డబ్బులు ఫుల్‌గా ఉన్నాయనీ, వేరేవాళ్ల ఆస్తులను కబ్జా చేయాల్సిన అవసరం తనకు లేదని కొట్టిపడేశారు. జవహర్‌నగర్‌లో 40 వేల మంది పేదలకు ఇండ్ల స్థలాల సమస్యను క్లియర్ చేసిన ఘనత తనదన్నారు. డంపింగ్ యార్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తట్టుకోలేక కేటీఆర్ వెంట పడి అక్కడ చెత్త ద్వారా విద్యుత్ తయారు చేసే ప్లాంట్ పెట్టించామన్నారు. 300 మంది కాదు..ఎంత మంది అయినా సరే తనపై పోటీ చేసే హక్కుందనీ, ప్రజలు తననే ఆశీర్వదిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాలనాయుడు, రవికాంత్‌రెడ్డి, గోపరాజు, తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ నివేదికలో తొందరపాటు అంశాలున్నాయి

- ఎన్‌డీఎస్‌ఎ కు రజత్ కుమార్ లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి -హైదరాబాద్

మేడిగడ్డ ఆనకట్టకు సంబంధించి జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేవనెత్తిన అంశాలు, ఆరోపణలపై తగిన వివరాలతో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. నివేదికకు సంబంధించి వివరణ ఇస్తూ నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మెన్‌కు లేఖ రాశారు. "నివేదికలో చాలా వరకు సంబంధం లేని అంశాలున్నాయి. వాస్తవాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదు. రాష్ట్ర అథారిటీ ఇచ్చిన వివరాలను పూర్తిగా పరిశీలించలేదు. నివేదికలో తొందరపాటు అంశాలున్నాయి. విచారణ పూర్తికాకుండా కుంగుబాటుకు సరైన కారణాలు నిర్ధారించలేం. ప్రస్తుత స్థితిలో కేంద్ర అథారిటీతో అంగీకరించలేం. క్వాలిటీ కంట్రోల్ సరిగా లేదన్న అభిప్రాయంతో ఏకీభవించలేం" అని రజత్ కుమార్ లేఖలో పేర్కొన్నారు.


కుంగిన ఆనకట్టను పరిశీలించిన అనంతరం జాతీయ అథారిటీ ఇచ్చిన నివేదికపై నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈఎన్సీలు, ఇంజినీర్లతో సమావేశమైన ఆయన నివేదికలోని అంశాలపై చర్చించారు. అనంతరం అథారిటీ చైర్మన్కు లేఖ ద్వారా వివరణ ఇచ్చారు.

మేం సిద్ధం: ఎల్ అండ్ టీ

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డిజైన్లు, నాణ్యతా ప్రమాణాలకు లోబడే మేడిగడ్డ ఆనకట్టను నిర్మించామని, ఏడో బ్లాక్ దెబ్బతిన్న కొంత భాగాన్ని పునరుద్ధరించేందుకు కట్టుబడి ఉన్నామని లార్సెన్ అండ్ టుబ్రో సంస్థ ప్రకటించింది. ఆనకట్ట పునరుద్ధరణ పనులకు సంబంధించి ఆ సంస్థ శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డిజైన్లు, నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఆనకట్ట నిర్మించి 2019లో అప్పగించినట్టు పేర్కొంది. మేడిగడ్డ ఆనకట్ట ఐదు సార్లు వరద సీజన్లను ఎదుర్కొందని తెలిపింది. మేడిగడ్డ అంశం ప్రస్తుతం సంబంధిత అధికార వర్గాల పరిశీలన, విచారణ, చర్చల్లో ఉందని ఎల్అండ్ వివరించింది. తదుపరి కార్యాచరణపై అధికారులు నిర్ణయానికి వచ్చిన వెంటనే దెబ్బతిన్న భాగాన్ని పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపింది.

ఈనెల 7న 'హనుమంతుడు అందరివాడే' బుక్ రిలీజ్

- కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ వెల్లడి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నా 50 ఏండ్ల రాజకీయ అనుభవాన్ని కూర్చి 'హనుమంతుడు అందరివాడే' పేరుతో నా జీవిత చరిత్ర పుస్తకాన్ని రాస్తున్నట్టు మాజీ ఎంపీ వి హనుమంతరావు వెల్లడించారు. విద్యార్థి, యూత్ కాంగ్రెస్, పీసీసీ అధ్యక్షులుగా, కేంద్ర, రాష్ట్ర మంత్రిగా నా అనుభావాలను పొందుపరిచినట్టు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వచ్చే తరం వారికి తెలియాలంటూ బుక్ రాస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చౌహన్, కర్నాటక మంత్రి బొసురాజు, దీపాదాస్ మున్షి హాజరు కానున్నారు.

వైఖరి మార్చుకోకుంటేబీజేపీని భూస్థాపితం చేస్తాం

- తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీలను వర్గీకరించే అంశంపై బీజేపీ వైఖరి మార్చుకోకుంటే ఆ పార్టీని రాష్ట్రంలో భూస్థాపితం చేస్తామని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ హెచ్చరించింది. శనివారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో జేఏసీ చైర్మెన్ చెరుకు రాంచందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆ సమావేశాన్ని ఉద్దేశించి రాంచందర్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇల్లును, బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామనీ, ప్రధాని మోడీని అడ్డుకుంటామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయడానికి వీలుకాదని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కిషన్ రెడ్డి, మోడీలు మాలల, రాజ్యాంగ వ్యతిరేకులని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాలల పంతం - బీజేపీ అంతం అనే నినాదంతో ఆ పార్టీని ఓడిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్ నల్లాల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

అమెజాన్ ఉద్యోగుల భారీ సమ్మె

- ఒక్క పౌండ్ వేతనం పెంపుపై ఆందోళన



లండన్ : దిగ్గజ రిటైల్ కంపెనీ అమెజాన్‌కు ఉద్యోగ, కార్మికులు సెగ చూపిస్తున్నారు. బ్లాక్ ఫ్రైడే పేరుతో సమ్మె చేపడుతున్నట్టు హెచ్చరించారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతమైన కంపెనీ తమ ఉద్యోగులకు కేవలం ఒక్క పౌండ్ మాత్రమే వేతనం పెంచడంతో యాజమాన్యంపై ఆ వర్గాల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలోనే బ్రిటన్‌లో వచ్చే మంగళవారం నుంచి శుక్రవారం వరకు సమ్మె చేయనున్నట్లు అమెజాన్ ఉద్యోగులు తెలిపారు. నవంబర్ 24న బ్లాక్ ఫ్రైడే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగు రోజుల పాటు వాక్ అవుట్ నిరసన చేపట్టారు. ఒక్క పౌండ్ వేతనం పెంపును నిరసిస్తూ కొవెర్టి వేర్‌హౌజ్ వద్ద 1000 మంది పైగా కార్మికులు ఆందోళన చేయడానికి సిద్ధం అవుతున్నారు.

ప్రస్తుతం పది గంటల పని విధానంతో గంటకు 11.80 పౌండ్లు మాత్రమే చెల్లిస్తుందని.. ఇది తమ జీవన వ్యయాలకు సరిపోవడం లేదని జీఎంబి ఆర్గనైజర్ రాచెల్ ఫాగన్ పేర్కొన్నారు. ఒక్క పెద్ద కార్పొరేషన్‌లో కార్మికులకు అతి తక్కువ చెల్లింపులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొవెంట్రిలోని తమ సమ్మె బ్రిటన్‌లోని మొత్తం లాజిస్టిక్‌ను ప్రభావితం చేయనుందని ఆమె తెలిపారు. అమెజాన్ తన వేతన పెంపు ప్రాధాన్యతల్లో మార్పులు చేయాలని రాచెల్ డిమాండ్ చేశారు.

అంచనాలు మించిన ఎస్‌బీఐ..



- క్యూ2లో రూ.14,330 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మార్కెట్ నిపుణుల అంచనాలు మించి ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఎస్‌బిఐ నికర లాభాలు 8 శాతం వృద్ధితో రూ.14,330 కోట్లుగా నమోదయ్యాయి. రూ.14,220 కోట్ల మేర లాభాలు ఆర్జించే అవకాశాలున్నాయని మార్కెట్ నిపుణులు తొలుత అంచనా వేశారు. కాగా.. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.13,265 కోట్ల లాభాలు సాధించింది. క్రితం క్యూ2లో ఎస్‌బిఐ నికర వడ్డీపై ఆదాయం (ఎన్ఐఐ) 12.3 శాతం పెరిగి రూ.39,500 కోట్లుగా చోటు చేసుకుంది. రుణాల జారీలో 12.39 శాతం వృద్ధి నమోదయ్యింది. విదేశీ కార్యాలయాల రుణాలు రూ.5 లక్షల కోట్ల మార్క్‌ను చేరాయి. మొత్తం బ్యాంక్ డిపాజిట్లలో 11.91 శాతం వృద్ధి చోటు చేసుకుందని ఆ బ్యాంక్ తెలిపింది.

గడిచిన సెప్టెంబర్ త్రైమాసికం ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.55 శాతానికి తగ్గాయి. 2022 ఇదే సెప్టెంబర్ నాటికి 3.52 జిఎన్‌పిఎలు ఉన్నాయి. క్రితం క్యూ2 ముగింపు నాటికి ఎస్‌బీఐ నికర ఎన్‌పిఎలు ఏకంగా 0.64 శాతానికి పరిమితమయ్యాయి. గతేడాది ఇదే కాలానికి 0.80 శాతంగా ఉన్నాయి. 2023 సెప్టెంబర్ నాటికి బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 11.91 శాతం పెరిగి రూ.46.89 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

బిఒబి లాభాల్లో 28శాతం వృద్ధి

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) 2023-24 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 28.4 శాతం వృద్ధితో రూ.4,253 కోట్ల నికర లాభాలు సాధించింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ)6.5 శాతం పెరిగి రూ.10,831 కోట్లుగా చోటు చేసుకున్నట్లు పేర్కొంది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో రూ.1,826 కోట్లుగా ఉన్న వడ్డీయేతర ఆదాయం.. గడిచిన క్యూ2లో ఏకంగా రూ.4,171 కోట్లుగా నమోదయ్యింది.

క్రోమ్‌లో దీపావళి ఆఫర్లు

హైదరాబాద్ : దీపావళి పండుగ సందర్భంగా ప్రత్యేక డిస్కౌంట్లను అందిస్తున్నట్లు టాటా గ్రూపునకు చెందిన క్రోమ్ తెలిపింది. 'ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్' క్యాంపెయిన్‌లో తమ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు, గృహోపకరణాలు, స్మార్ట్‌ఫోన్లు, ఇతర విభాగాల ఉత్పత్తులపై పలు ఆకర్షణీయ ఆఫర్లను అందిస్తున్నామని పేర్కొంది. తగ్గింపు ధరలు నవంబర్ 15 వరకు అందుబాటులో ఉంటాయని తెలిపింది.

బోస్టన్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌తో అపోలో జట్టు

చెన్నయ్ : అడ్వాన్స్ పెడియాట్రిక్ కేర్‌లో విజ్ఞానాన్ని పంచుకోవడానికి అమెరికా కేంద్రంగా పని చేస్తున్న బోస్టన్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌తో జట్టు కట్టినట్లు అపోలో హాస్పిటల్స్ వెల్లడించింది. ఇందుకోసం పెడిసింక్ 2023 కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొంది. రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశంలో పెడియాట్రీషన్లకు సబ్ స్పెషాలిటీస్‌పై మరింత అవగాహన పెంచినట్లు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ సనీతా రెడ్డి పేర్కొన్నారు.

నగరంలో లెక్కో కుచీనా షోరూం ఏర్పాటు

హైదరాబాద్ : ఇటాలియన్ ప్రేరేపిత మాడ్యులర్ కిచెన్‌లు, వార్డ్‌రోబ్‌లకు చెందిన లెక్కో కుచీనా హైదరాబాద్‌లోని నాగోల్‌లో కొత్త షోరూంను తెరిచింది. దాదాపు 2000 చదరపు అడుగుల్లో దీన్ని ఏర్పాటు చేసింది. నాణ్యత విషయంలో రాజీ పడకుండా, అత్యంత సున్నితమైన డిజైన్‌లను అందరికీ అందుబాటులో ఉంచాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నామని లెక్కో కుచీనా బిజినెస్ హెడ్ త్రిశూల్ డెవంగ, స్టోర్ పార్టనర్ రామ్ మోహన్ రావు పేర్కొన్నారు. తమ ఉత్పత్తులకు జర్మన్ ఇంజనీరింగ్ నాణ్యత హామీ ఇస్తున్నామన్నారు 2025 నాటికి దేశ వ్యాప్తంగా విస్తరించాలని నిర్దేశించుకున్నామన్నారు.

రెకిట్ నుంచి ఎసిడిటి తగ్గించే సిరప్

హైదరాబాద్ : ఎసిడిటి, గుండెల్లో మంటను తగ్గించడంలో సహాయపడే గావిస్కాన్ డబుల్ యాక్షన్ సిరప్‌ను ఆవిష్కరించినట్లు రెకిట్ తెలిపింది. ఆరోగ్యం, పోషకాహారం ఉత్పత్తుల కంపెనీ రెకిట్ ఈ కొత్త సిరప్‌ను తెలంగాణ మార్కెట్లోకి విడుదల చేసినట్లు శనివారం వెల్లడించింది. కడుపులో మంట వంటి లక్షణాలను గుర్తించడం చాలా కీలకం, ఛాతీలో అసౌకర్యాన్ని తగ్గించడానికి గావిస్కాన్ ఉపయోగపడుతుందని ఆ సంస్థ తెలిపింది.

బీఆర్ఎస్‌లో చేరిన రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో


బీజేపీ నుంచి వరంగల్ ఈస్ట్ టిక్కెట్ ఆశించి భంగపడి, ఆపార్టీకి రాజీనామా చేసిన రాకేష్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన్ని మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వాదానికి రూపురేఖను ఇచ్చిన వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. గొప్ప విజన్‌తో ఐటీ రంగాన్ని మంత్రి కేటీఆర్ ముందుకు తీసుకెళ్తున్నారనీ, భవిష్యత్ తెలంగాణ నిర్మాత ఆయనేనని చెప్పారు. మూడోసారి బీఆర్ఎస్ విజయం సాధించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన సయ్యద్ ఇబ్రహీం

- గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనారిటీ నేత సయ్యద్ ఇబ్రహీం శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆపార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మంత్రి కే తారకరామారావు గులాబీ కండువా కప్పి ఆయన్ని పార్టీలోకి ఆహ్వానించారు. తిరిగి సొంతగూటికి చేరినట్టు ఈ సందర్భంగా ఇబ్రహీం అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విజయం కోసం తాను పనిచేస్తానని చెప్పారు.





ప్రపంచకప్‌లో నేడు
భారత్ x దక్షిణాఫ్రికా
వేదిక : కోల్‌కత
సమయం : మ॥ 2.00
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

హార్దిక్ అవుట్, ప్రసిద్ ఇన్

ముంబయి : భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ప్రపంచకప్‌కు దూరమయ్యాడు. చీలమండ గాయానికి గురైన హార్దిక్ పాండ్య ఆశించిన సమయానికి కోలుకోలేదు. దీంతో హార్దిక్ పాండ్య స్థానంలో పేసర్ ప్రసిద్ కృష్ణను జట్టులోకి తీసుకున్నారు. ఈ మేరకు బీసీసీఐ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. 17 వన్డేల్లో 29 వికెట్లు పడగొట్టిన ప్రసిద్ కృష్ణ.. ప్రపంచకప్ ముంగిట ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు.



భారత్, దక్షిణాఫ్రికా.. ఐసీసీ 2023 ప్రపంచకప్‌ను శాసిస్తున్న జట్లు. ఓ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి భారీ స్కోర్లతో ప్రత్యర్థులను చిత్తు చేస్తుండగా.. మరో జట్టు ఛేదనలో చెలరేగుతూ ప్రత్యర్థులకు దడ పుట్టిస్తోంది. సెమీఫైనల్ బెర్త్‌లు ఖాయం చేసుకున్న ఈ రెండు జట్లు నేడు ఈడెన్‌గార్డెన్స్ వేదికగా అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యాయి. ఆతిథ్య భారత్ ఎనిమిదో విజయంపై కన్నేయగా.. జైత్రయాత్ర కొనసాగించాలని సఫారీ ఎదురుచూస్తోంది. భారత్, దక్షిణాఫ్రికా ప్రపంచకప్ గ్రూప్ దశ మ్యాచ్ నేడు.

అగ్రజట్ల అమీతుమీ

- భారత్, దక్షిణాఫ్రికా ఢీ నేడు
- ఆతిథ్య జట్టుకు సఫారీ కఠిన సవాల్
- మెగా పోరుకు సిద్ధమైన ఈడెన్‌గార్డెన్స్

మ॥ 2 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో





నవతెలంగాణ-కోల్‌కత

ప్రపంచకప్‌కు మరింత ఊపొచ్చే మ్యాచ్ వచ్చింది. గ్రూప్ దశలో ఎదురులేని విజయాలతో సాగుతున్న ఆతిథ్య భారత్, దక్షిణాఫ్రికాలు నేడు సమరానికి సై అంటున్నాయి. వరుసగా ఏడు మ్యాచుల్లో గెలుపొందిన టీమ్ ఇండియా అజేయ రికార్డు కొనసాగించేందుకు చూస్తుంది. ప్రపంచకప్‌లో సరికొత్తగా కదం తొక్కుతున్న సఫారీలు సెమీఫైనల్స్‌కు ముంగిట అగ్రజట్టును ఓడించి ఆత్మవిశ్వాసం రెట్టింపు చేసుకోవాలని అనుకుంటోంది. భారత్, దక్షిణాఫ్రికా కండ్లుచెదిరే ఆటతో అదరగొడుతున్నా.. ఈ రెండు జట్ల ఆట తీరు, వ్యూహం పూర్తి భిన్నం. దీంతో నేడు భారత్, దక్షిణాఫ్రికా మ్యాచ్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత ఎక్కువైంది.

జోరుమీదున్న భారత్

ప్రపంచకప్ గ్రూప్ దశలో సమవుజ్జీని ఎదుర్కొవటం భారత్‌కు ఇది రెండోసారి. తొలుత ధర్మశాలలో అప్పటి అజేయ జట్టు న్యూజిలాండ్‌ను ఓడించిన రోహిత్‌సేన.. ఆ జట్టు సెమీఫైనల్ రేసును అతలాకుతలం చేసింది. ఇప్పుడు ఈడెన్‌గార్డెన్స్‌లో సఫారీ సవాల్‌కు సిద్ధమైన టీమ్ ఇండియా.. ఆ జట్టు ఆత్మవిశ్వాసం దెబ్బతీస్తుందా? చూడాలి. బ్యాటింగ్, బౌలింగ్ పరంగా భారత్ జోరుమీదుంది. టాప్-5 బ్యాటర్లు మంచి ఫామ్‌లో ఉన్నారు. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ సైతం వాంఖడెలో 92 పరుగుల ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్ పరుగుల వేటలో దూసుకెళ్తున్నారు. శ్రేయస్ అయ్యర్ సైతం ఓ మంచి ఇన్నింగ్స్‌తో ఫామ్ అందుకున్నాడు. నాణ్యమైన పేస్ బౌలర్లు కలిగిన దక్షిణాఫ్రికాను భారత బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరంగా మారింది. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మాయతో మెప్పిస్తున్నాడు. అతడిని ఆడేందుకు అన్ని జట్లు ఇబ్బందులు పడ్డాయి. పేసర్లు బుమ్రా, షమి, సిరాజ్ త్రయం మాటలకు అందని ఫామ్‌లో ఉంది. స్వింగ్‌తో చెలరేగుతున్న షమి.. ప్రత్యర్థుల గుండెల్లో నిద్ర పోతున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసినా, లక్ష్యాన్ని ఛేదించినా రోహిత్‌సేన విజయంపై విశ్వాసంగా కనిపిస్తోంది.

సఫారీ జోరు సాగేనా?

ఏడు మ్యాచుల్లో ఆరింట గెలుపొందిన దక్షిణాఫ్రికా నేడు ఆతిథ్య జట్టును ఢీకొట్టనుంది. కెప్టెన్ తెంబ బవుమా ఫామ్ మినహాయిస్తే సఫారీ శిబిరం సూపర్‌గా కనిపిస్తోంది. ఆరంభంలో పేసర్లపై దండెత్తగల క్వింటన్ డికాక్, వాన్‌డర్ డుసెన్.. మిడిల్ ఆర్డర్‌లో స్పిన్‌పై చెలరేగే క్లాసెన్, మార్క్‌రామ్, డెవిడ్ మిల్లర్ దక్షిణాఫ్రికా సొంతం. ప్రపంచకప్‌లో అత్యంత ప్రమాదకర మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్ లైనప్ దక్షిణాఫ్రికాదే. డెత్ ఓవర్లలో సఫారీ బ్యాటర్ల విధ్వంసం అసమానం. తొలుత బ్యాటింగ్ ఎంచుకుని భారీ స్కోర్లు చేయటం సఫారీ సక్సెస్ మంత్ర. నేడు భారత్‌తో మ్యాచ్‌లోనూ అదే ప్రణాళిక అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. కానీ భీకర భారత పేసర్లను ఎదుర్కొని దక్షిణాఫ్రికా బ్యాటర్లు పరుగుల వేటలో విజయవంతం అవుతారా? ఆసక్తికరం. మార్కో జెన్సన్ సఫారీ సరికొత్త పేస్ ఆయుధం. పవర్‌ప్లేలో ప్రతి 16 బంతులకు ఓ వికెట్ పడగొడుతున్న జెన్సన్ నేడు భారత టాప్ ఆర్డర్‌కు సవాల్ విసురుతున్నాడు. కగిసో రబాడ, లుంగిసాని ఎంగిడి సహా స్పిన్నర్లు కేశవ్ మహరాజ్, షంషిలు భారత్‌పై సత్తా చాటేందుకు ఎదురు చూస్తున్నారు.

పిచ్, వాతావరణం

ప్రపంచకప్ మ్యాచుల్లో ఈడెన్‌గార్డెన్స్‌లో భారీ స్కోర్లు నమోదు కాలేదు. ఇక్కడి పిచ్‌లు ప్రత్యేకించి పేసర్లు, స్పిన్నర్లకూ అనుకూలించలేదు. పేసర్లు మెరుగైన స్ట్రయిక్‌రేట్‌తో వికెట్లు కూల్చగా, స్పిన్నర్లు మెరుగైన ఎనాకమీ సాధించారు. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండనుండగా.. సాయంత్రానికి వాతావరణం చల్లబడనుంది. రెండో ఇన్నింగ్స్‌లో మంచు కురిసే అవకాశం కనిపిస్తోంది. టాస్ నెగ్గిన జట్టు సొంత బలం ఆధారంగా నిర్ణయం తీసుకుంటుందా? ప్రత్యర్థి ఇష్టపడని నిర్ణయాలు తీసుకుంటుందా? అనేది చూడాలి.

తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, రవీంద్ర జడేజా, మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్, జశ్‌ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్.

దక్షిణాఫ్రికా : క్వింటన్ డికాక్ (వికెట్ కీపర్), తెంబ బవుమా (కెప్టెన్), వాన్‌డర్ డుసెన్, డెవిడ్ మిల్లర్, హెన్రిచ్ క్లాసెన్, ఎడెన్ మార్క్‌రామ్, మార్కో జాన్సెన్, జెరాల్డ్, కేశవ్ మహరాజ్, కగిసో రబాడ, లుంగిసాని ఎంగిడి.

ఎక్స్ ఫ్యాక్టర్

హార్దిక్‌కు గాయంతో తుది జట్టులోకి వచ్చిన మహ్మద్ షమి మూడు మ్యాచుల్లో 6.71 సగటుతో ఏకంగా 14 వికెట్లు పడగొట్టాడు. కివీస్‌పై 5/54, ఇంగ్లాండ్‌పై 4/22, శ్రీలంకపై 5/18తో నిప్పులు చెరిగాడు. వరల్డ్ క్లాస్ స్వింగ్‌తో టాప్, మిడిల్ ఆర్డర్ బ్యాటర్లను బోల్తా కొట్టిస్తున్న షమి.. నేడు సఫారీ బ్యాటర్లకు ముకుతాడు వేయటంలో కీలకం కానున్నాడు. అటు పవర్‌ప్లేలో, ఇటు డెత్ ఓవర్లలో షమి ఓవర్లు ప్రభావం చూపనున్నాయి.

క్వింటన్ డికాక్ వరల్డ్‌కప్‌లో శతక జోరు చూపిస్తున్నాడు. ఇప్పటికే నాలుగు సెంచరీలు బాదిన డికాక్.. కోల్‌కతలో మరో వందపై కన్నేశాడు. 112.6 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు రాబడుతున్న డికాక్‌కు భారత్‌పై మంచి రికార్డుంది. టాప్ ఆర్డర్‌లో డికాక్ నిలిచి, మెరిస్తేనే లోయర్ ఆర్డర్ డెత్ ఓవర్లలో ప్రణాళికలు అమలు చేయగలదు. సఫారీ సక్సెస్ ఫార్ములా డికాక్ ప్రదర్శనపై ఆధారపడి ఉంది.





పాక్ ఆశలు సజీవం

- డక్‌వర్త్ పద్ధతిలో కివీస్‌పై గెలుపు
- వర్షం ప్రభావిత మ్యాచ్‌లో కేన్‌సేన ఓటమి

బెంగళూర్ : కెప్టెన్ కేన్ విలియమ్సన్ (95, 79 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సులు), రచిన్ రవీంద్ర (108, 94 బంతుల్లో 15 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్‌తో ప్రపంచకప్‌లో అత్యధిక స్కోరు సాధించిన న్యూజిలాండ్‌కు వరుణుడు అడ్డుతగిలాడు. పాకిస్థాన్‌పై తొలుత 401/6 పరుగుల భారీ స్కోరు సాధించిన న్యూజిలాండ్ గెలుపుపై ధీమాగా కనిపించింది. రికార్డు లక్ష్య ఛేదనలో ఓపెనర్ ఫకర్ జమాన్ (126 నాటౌట్, 81 బంతుల్లో 8 ఫోర్లు, 11 సిక్సులు), బాబర్ ఆజమ్ (66 నాటౌట్, 63 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు) ధనాధన్ మెరుపులతో కదం తొక్కగా 25.3 ఓవర్లలో పాకిస్థాన్ 200/1 పరుగులు చేసింది. 21.3 ఓవర్లలో పాక్ 160/1తో ఉండగా వరుణుడు ఆటంకం కలిగించగా.. గంటకు పైగా విరామం అనంతరం ఆట పున ప్రారంభమైంది. కానీ కొద్దిసేపటికే మళ్లీ ఎడతెగని వర్షం కురువటంతో మ్యాచ్ ముందుకు సాగలేదు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించారు. డక్‌వర్త్ ప్రకారం 21 పరుగుల ముందంజలో నిలిచిన పాకిస్థాన్ విజయం సాధించింది. 401 పరుగులు చేసినా.. న్యూజిలాండ్‌కు ఊహించని ఓటమి తప్పలేదు. గ్రూప్ దశలో నాల్గో విజయంతో పాకిస్థాన్ సెమీఫైనల్ ఆశలు సజీవంగా నిలిచాయి. చివరి మ్యాచ్‌లో శ్రీలంకపై కివీస్ నెగ్గితే ఆ జట్టు నేరుగా టాప్-4లో నిలువనుంది. ఇంగ్లాండ్‌పై పాక్ నెగ్గి.. శ్రీలంకపై కివీస్ ఓడితే నెట్ రన్‌రేట్ ఆధారంగా ఓ జట్టు ముందంజ వేయనుంది.

ఆసీస్ అలవోకగా

ఇంగ్లండ్‌పై విజయకేతనం



అహ్మదాబాద్: వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా వరుసగా ఐదో విజయం ఖాతాలో వేసుకుంది. శనివారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆసీస్ 33 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను మట్టికరిపించింది. ఈ విజయంతో కంగారూలు సెమీస్ బెర్త్‌కు మరింత చేరువ కాగా.. ఇంగ్లండ్ ఏడింట ఆరో ఓటమితో అధికారికంగా సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. లబుషేన్ (71) హాఫ్ సెంచరీతో రాణించగా.. స్మిత్ (44), గ్రీన్ (47), స్టోయినిస్ (35), జాంపా (29) కీలక పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో వోక్స్ 4 వికెట్లు పడగొట్టాడు. చేజింగ్‌లో ఇంగ్లండ్ 48.1 ఓవర్లలో 253 పరుగులకు ఆలౌటైంది. స్టోక్స్ (64), మలాన్ (50), మోయిన్ అలీ (42) పోరాడినా ఫలితం లేకపోయింది. ఆసీస్ బౌలర్లలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' జాంపా 3 వికెట్లు తీశాడు.



మృణాల్ ఠాకూర్, నాని

అమ్మాడి.. అద్భుత ప్రేమకు ప్రతిబింబం

నాని, శౌర్యువ్ కాంబోలో రాబోతున్న పాన్ ఇండియా చిత్రం 'హాయ్ నాన్నా'లో డిఫరెంట్ జోనర్ సాంగ్స్ ఆల్బమ్‌తో అలరిస్తోంది. ఇప్పటికే ఈ సినిమాలోని మొదటి రెండు పాటలకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా నుంచి మూడో సింగిల్ 'అమ్మాడి' పాట తాజాగా విడుదలైంది.

మృణాల్ ఠాకూర్ తన థర్డ్ యానివర్సరీని రివీల్ చేస్తూ తన పెర్‌ఫార్మెన్స్‌తో పాట ప్రారంభమవుతుంది. 'ఇది నా భర్తకు అంకితం చేస్తున్న చాలా ప్రత్యేకమైన పాట. అతను ఎప్పటిలాగే ఆలస్యంగా వస్తున్నారు. పాట నా మాతృభాష తెలుగులో ఉంది' అంటూ మృణాల్ వాయిస్‌తో పాట మొదలవుతుంది. ఈ పాట నాని, మృణాల్‌ల స్వీట్, బ్యూటీఫుల్ ప్రేమకథను చూపిస్తూ పెద్ద వేడుకను సెలబ్రేట్ చేస్తోంది. ఈ సోల్ ఫుల్ మెలోడీ.. వారి పెళ్లి రోజు నుండి, వివాహ ప్రారంభ రోజులలో వారు కలిసి ఉన్న అద్భుతమైన రోజుల వరకు, ప్రేమ తాలూకా కొత్త అధ్యాయాన్ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది.

ఈ పాటలో నాని, మృణాల్ డిలైట్ ఫుల్ కెమిస్ట్రీ మెస్మరైజ్ చేస్తోంది. హేషామ్ అబ్దుల్ వహాబ్ ఇన్స్టెంట్‌గా కనెక్ట్ అయ్యే మరొక ప్లజెంట్ నంబర్‌ను అందించారు. మొదటి రెండు పాటల్లాగే ఇది కూడా ఆల్బమ్‌లో మరో బ్లాక్‌బస్టర్ సాంగ్ అవుతుంది. కృష్ణకాంత్ ఆకట్టుకునే, మీనింగ్ ఫుల్ లిరిక్స్ అందించారు.

కాల భైరవ, శక్తిశ్రీ గోపాలన్ వోకల్స్ చాలా ఎక్స్‌ప్రెసివ్‌గా ఉన్నాయి. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల భారీ స్థాయిలో నిర్మించిన ఈ పాన్ ఇండియా మూవీలో బేబీ కియారా ఖన్నా ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. డిసెంబర్ 7న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ విడుదల కానుంది అని చిత్ర బృందం తెలిపింది.



వినని.. చూడని సరికొత్త కథ

'ప్రతీ ఆత్మకు ఒక కథ ఉంటుంది. అలాగే చండికకి కూడా ఓ కథ ఉంది. కానీ తన కథ మాత్రం ఎప్పుడు ఎక్కడా వినని, ఎవ్వరూ చూడని సరికొత్త కథ. ఆ కథ ఏంటి? తన తాపత్రయం ఏంటి? ఎందుకు మనల్ని భయపెట్టాలని అనుకుంటోంది అనే అంశాన్ని 'చండిక' చిత్రంలో చూపించబోతున్నాం' అని దర్శకుడు తోట కృష్ణ అన్నారు.

వీర్, శ్రీహర్ష, నిషా, ఖుషి ప్రధాన పాత్రలలో కోటిపల్లి ప్రొడక్షన్స్ పతాకంపై కె.వి.పాపారావు నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ఫిలిం ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఈ సినిమాకి సంబంధించి నాలుగు ట్రైలర్లను ఆవిష్కరించారు. అతిథులుగా పాల్గొన్న తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షుడు, ఫిలిం ఛాంబర్ సెక్రటరీ కె.ఎల్.దామోదర్ ప్రసాద్, మాజీ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు కె.బసిరెడ్డి, నిర్మాతలు సాయివెంకట్, మోహన్ గౌడ్, గురురాజ్ ఒక్కొక్కరు ఒక్కో ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.

'అభిరుచి కలిగిన నిర్మాత, పరిశ్రమలో నలభై సంవత్సరాల అనుభవం కలిగిన దర్శకుడు తోట కృష్ణ కలయికలో రూపొందిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ట్రైలర్స్ నేటి హర్రర్ ట్రెండ్‌కు తగ్గట్టుగా విభిన్నంగా ఉన్నాయి' అని విచ్చేసిన ముఖ్య అతిథులందరూ ప్రశంసించారు.

దర్శకుడు తోట కృష్ణ మాట్లాడుతూ, 'హర్రర్, సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ఇందులో ఆత్మ ప్రతీకారం తీర్చుకునే అంశం చాలా కొత్తగా ఉంటుంది. పాత్రధారులంతా తమ పాత్రలకు చక్కటి న్యాయం చేకూర్చారు. పలు చిత్రాలను తీసిన నిర్మాత గురురాజ్ ఇందులో ఓ కీలక పాత్రను పోషించారు' అని అన్నారు. 'ఈ చిత్రానికి నేనే కథ అందించాను. కార్యక్రమాలు పూర్తయిన ఈ చిత్రాన్ని ఇదే నెలలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చిత్ర నిర్మాత కె.వి.పాపారావు తెలిపారు. ఈ చిత్రానికి రచన: దాసరి వెంకటేష్, మాటలు:: తోటపల్లి సాయినాథ్, సినిమాటోగ్రఫీ: నగేష్, సంగీతం: చేతన్ విన్, ఎడిటింగ్: మన శ్రీను, నిర్మాత కె.వి.పాపారావు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: తోట కృష్ణ.

నవచిత్రం

స్వయంభూ కోసం సవ్యసాచిగా..



నిఖిల్

హీరో నిఖిల్ నటిస్తున్న తన 20వ చిత్రం 'స్వయంభూ. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్‌కు చెందిన భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ ఎపిక్ ఒడిస్సీలో లెజెండరీ యోధుని పాత్రను పోషించడానికి ఆయుధాలు, మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో నిఖిల్ శిక్షణ తీసుకున్నారు నిఖిల్. నమ్మశక్యం కాని యుద్ధ సన్నివేశాలతో ఉండే ఈ చిత్రంలో నిఖిల్ కొన్ని అద్భుతమైన స్టంట్స్ చేయనున్నారు. దీని కోసమై వియత్నాంలో దాదాపు ఒక నెల రోజులు కఠోర శిక్షణ తీసుకున్నారు. ట్రైనింగ్ సెషన్ పూర్తయిన వెంటనే నిఖిల్ కత్తి యుద్ధం మొదలైనవాటిలో ప్రోగా మారడానికి ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు.

కఠినమైన ప్రాక్టీస్ సెషన్ నిఖిల్‌ను సవ్యసాచిగా చేసింది. ఇప్పుడు రెండు చేతులతో కత్తియుద్ధం చేయగలుగుతున్నారు. నిఖిల్ షేర్ చేసిన వీడియో, కత్తి యుద్ధంలో అతని నైపుణ్యాన్ని చూపుతుంది. బ్యాక్ టు బ్యాక్ బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకెళ్తున్న సంయుక్త ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తోంది.



వైభవ్

ఆద్యంతం వినోదాత్మకం

దర్శకుడు కోదండ రామిరెడ్డి తనయుడు వైభవ్ నటించిన తాజా సినిమా 'ఆలంబన'. పార్వతి నాయర్ కథానాయికగా నటించగా, మురళీ శర్మ ప్రధాన పాత్ర పోషించారు. పారి కె విజయ్ దర్శకుడు. కోటపాడి రాజేష్ సమర్పణలో కేజేఆర్ స్టూడియోస్, కౌస్తుభ్ ఎంటర్టైన్మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి.

గంగ ఎంటర్టైన్మెంట్స్ సంస్థ ఈ సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తోంది. డిసెంబర్ 15న తెలుగు, తమిళ భాషల్లో సినిమాను విడుదల చేయనున్నారు. 'హీరో అపర కుబేరుల ఇంట్లో జన్మిస్తాడు. కానీ, దురదృష్టవశాత్తు వాళ్ళ కుటుంబం ఆస్తి మొత్తాన్ని కోల్పోతుంది. అటువంటి పరిస్థితులో ఓ శుభ ముహూర్తంలో హీరో జీవితంలోకి జీని అడుగు పెడతాడు. ఆ తర్వాత ఏమైంది? అనేది వెండితెరపై చూడాలి. 'ప్రేక్షకులకు వినోదం అందించే చిత్రమిది. హీరోకి, వాళ్ళ కుటుంబానికి ఎదురయ్యే పరిస్థితులు కడుపుబ్బా నవ్విస్తాయి' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



అలాంటి సర్‌ప్రైజ్ జపాన్‌లోనూ ఉంది

హీరో కార్తీ నటిస్తున్న తన 25వ చిత్రం 'జపాన్'. 'జోకర్' ఫేమ్ రాజు మురుగన్ దర్శకుడు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ ఆర్ ప్రభు నిర్మించారు. అను ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ దీపావళి కానుకగా ఈనెల 10న తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా థియేటర్స్‌లో రిలీజ్ చేయనుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కి హీరో నాని ముఖ్య అతిథిగా, దర్శకుడు వంశీ పైడిపల్లి, సుప్రియ యార్లగడ్డ అతిథులుగా పాల్గొన్నారు.

నాని మాట్లాడుతూ, 'కార్తి ప్రతి సినిమాకి కొత్తదనం చూపిస్తూ వరుస విజయాలు అందుకున్నారు. ఇప్పుడు ఈ సినిమాతో మరింత షాకింగ్ గెటప్‌తో మన ముందుకు వస్తున్నారు. ఇలాంటి సినిమాలు చేయడం, చేసి ఒప్పించడం అంత తేలిక కాదు. ట్రైలర్ చూస్తుంటే చాలా ఎనర్జీ కనిపిస్తుంది. ఈ సినిమా చాలా పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు.

'సినిమాని ఒక పండగలా చూస్తారు తెలుగు ఆడియన్స్. జపాన్ డిఫరెంట్ మూవీ. కార్తి పాత్ర అద్భుతంగా ఉంటుంది. సునీల్‌తో పని చేయడం మంచి అనుభూతి' అని దర్శకుడు రాజు మురుగన్ తెలిపారు. 'డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌కి నేషనల్ అవార్డ్ తెచ్చిపెట్టిన దర్శకుడు రాజు మురగన్‌తో ఈ చిత్రం చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రం ఆయన స్టాంప్‌లో ఉంటుంది. గత ఏడాది దీపావళికి కార్తి 'సర్దార్'ని అన్నపూర్ణ స్టూడియోస్ విడుదల చేసింది. మళ్ళీ ఈ ఏడాది దీపావళికి 'జపాన్' విడుదల చేయడం విశేషం. సుప్రియకి థ్యాంక్స్' అని నిర్మాత ఎస్ ఆర్ ప్రభు చెప్పారు.

'సర్దార్' తర్వాత అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. మన కల్చర్‌లో ఉండిపోయే బలమైన కథతో ఈ సినిమా చేశాం. దీనిని ఇంటర్నేషనల్ లెవల్‌లో ప్రజెంట్ చేయడానికి పెద్ద టెక్నీషియన్స్‌ని తీసుకొచ్చాం. ఈ చిత్రం నా మనసుకు దగ్గరైన చిత్రం. రాజు మురగన్ సమాజం పట్ల ప్రేమ ఉన్న దర్శకుడు. జపాన్ పాత్రలో స్వార్థం ఉంటుంది. ఈ సమాజం తనకి ఏది ఇచ్చిందో అదే తిరిగి ఇచ్చే పాత్ర తనది. వినోదంతో పాటు ఆలోచింపజేసే ప్రశ్నలు సంధించే చిత్రమిది. ఖైదీ చూసినప్పుడు ఎలా సర్‌ప్రైజ్ అయ్యారో ఈ సినిమా చూసి కూడా అలానే సర్‌ప్రైజ్ అవుతారు.

- హీరో కార్తి

ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే సినిమా



హన్సిక

హన్సిక కథానాయికగా నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి'. శ్రీనివాస్ ఓంకార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వైష్ణవి ఆర్ట్స్ పతాకంపై బురుగు రమ్య ప్రభాకర్ నిర్మిస్తున్నారు. ఈనెల 17న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా శనివారం ప్రసాద్ ల్యాబ్స్‌లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా శ్రీనివాస్ గౌడ్, డైరెక్ట్ చేసిన అశోక్ విచ్చేసి, చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

హన్సిక మాట్లాడుతూ, 'ఇదొక గ్రేట్ సబ్జెక్ట్ థ్రిల్లర్. నా మనసుకు ఎంతో దగ్గరైనా కథ. డైరెక్టర్ శ్రీనివాస్ ఓంకార్ చాలా హార్డ్ వర్క్ చేశారు. వైష్ణవి ఆర్ట్స్ సంస్థ ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా నిర్మించారు. ప్రభాకర్ ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్. తెలుగు ప్రేక్షకులు ఈ సినిమాతో మరోసారి నన్ను ఆదరిస్తారని కోరుకుంటున్నా' అని చెప్పారు. 'హన్సిక ఈ కథను బలంగా నమ్మారు. అలాగే స్క్రిప్ట్‌తో పాటు నన్ను అర్థం చేసుకున్న టెక్నీషియన్స్ దొరకడం నా అదృష్టం. ఇందులోని సాంగ్స్‌కి మంచి రెస్పాన్స్ వస్తోంది. రాబిన్ అద్భుతమైన బ్యాగ్రౌండ్ స్కోర్ అందించారు. ప్రొడ్యూసర్ చేసిన సపోర్టును మర్చిపోలేను' అని దర్శకుడు శ్రీనివాస్ ఓంకార్ తెలిపారు.

నిర్మాత ప్రభాకర్ మాట్లాడుతూ, 'సినిమాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన హన్సికకి థ్యాంక్స్' అని తెలిపారు.



మానసిక సమస్యలకు బన్యన్ భరోసా

మారుతున్న జీవన విధానంలో మానసిక సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. అందుకే మానసిక ఆరోగ్యానికి బన్యన్ వినూత్న విధానాన్ని ఎంచుకుంది. మానసిక బాధలు ఉన్న వ్యక్తులను తమతో కలుపుకొని పోయే ప్రదేశంగా అది 30 ఏండ్ల చరిత్రను పూర్తి చేసుకుంది. స్వయంప్రతిపత్తిని కల్పిస్తూ వారు తిరిగి మళ్ళీ మామూలు మనుషులు అయ్యేందుకు చేయూతనిస్తున్న ఆ సంస్థ గురించిన విశేషాలు మానవి పాఠకుల కోసం...

మూడు దశాబ్దాల కిందట మానసిక ఆరోగ్యాన్ని అభ్యసించిన 20 ఏండ్ల వందనా గోపీకుమార్, మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్ అయిన వైష్ణవి జయకుమార్ చెన్నై వీధుల్లో మానసిక అనారోగ్యంతో నిరాశ్రయులైన మహిళను చూశారు. బాధలో ఉన్న ఆ స్త్రీల దయనీయ స్థితి వారి యువ మనసులను ఏదో ఒకటి చేయాలని ప్రేరేపించింది. వారికి ఓ ఆశ్రయం కల్పించేందుకు వీరంతా కలిసి అన్నానగర్‌లోని అపార్ట్ మెంట్‌లో ఒక ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్నారు. 13 మంది రోగులతో ప్రారంభించి, నేడు భారతదేశం అంతటా 13 ఎమర్జెన్సీ కేర్ అండ్ రికవరీ సెంటర్స్ ద్వారా 3,481 మంది జీవితాలను బన్యన్ బాగుచేసింది.

తిరిగి ప్రజలతో కలిసిపోయేలా...

తమిళనాడు, కేరళ, మహారాష్ట్రల్లోని పది లక్షల మంది వరకు పేదలు, నిరాశ్రయుల జీవితాలను మెరుగుపరచడంలో బన్యన్ విశేష కృషి చేస్తున్నది. వారిలో సుమారు 75శాతం మంది వారి మానసిక ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధి ప్రోగ్రామ్‌తో వారి కుటుంబాలతో లేదా సంఘంలో స్వతంత్రంగా జీవించడానికి తిరిగి వచ్చారు. వారిలో 40శాతం మంది ఉద్యోగాలు సంపాదించారు. "వారి కోసం మద్దతును సేకరించడం, వారు తిరిగి ప్రజలతో కలిసి పోయి జీవించేలా తీర్చిదిద్దడం మా లక్ష్యం. ఆరోగ్య సంరక్షణ, సామాజిక సంరక్షణ కల్పించేందుకు స్వయం-సహాయ సమూహాలు, యువజన క్లబ్‌లలో శిక్షణ ఇస్తాం. తద్వారా వారు సాధారణ వ్యక్తులతో కలిసి పోయేందుకు వీలు కలుగుతుంది" అని వందన చెప్పారు.

నమ్మకాన్ని నిర్మించడం

2017 మెంటల్ హెల్త్‌కేర్ యాక్ట్ వచ్చింది. దీని ద్వారా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న రోగుల హక్కుల కోసం పని మొదలయింది. ఈ యాక్ట్‌ను దృష్టిలో పెట్టుకొని బన్యన్ వారి సంరక్షణ, చికిత్స, పునరావాసం కోసం ఎంతో కృషి చేస్తున్నది. దీని బృందాలు మానసిక రోగులతో కలిసి వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయి. మన దేశంలో 100,000 మంది వ్యక్తులకు 0.75 మంది మానసిక ఆరోగ్య నిపుణులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఈ లోటును బన్యన్ భర్తీ చేస్తుంది. అడ్వకేట్, క్లినికల్ సోషల్ వర్కర్లు, నర్సులు, శిక్షణ పొందిన హెల్త్‌కేర్ వర్కర్లు, సైకియాట్రిస్ట్‌లు, జనరల్ ప్రాక్టీషనర్లు, సైకాలజిస్ట్‌లు అవసరమైతే ఆక్యుపేషనల్ థెరపిస్ట్, ఒక సాధారణ ఆరోగ్య సంరక్షణ బృందంతో పాటు, ఆసుపత్రి వీరికి మద్దతునిస్తుంది. రోగికి తమపై నమ్మకం కలిగేలా వారితో సంబంధాన్ని పెంపొందించడంపై దృష్టి పెడుతుంది. "క్లయింట్ నుండి వచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఏ విధమైన మందులు వారికి పని చేస్తాయో, వారు ఎలాంటి చికిత్సా కార్యక్రమాలపై ఆసక్తి చూపే అవకాశం ఉందో, మనం ఎలాంటి సామాజిక సంరక్షణ మార్గాలను అన్వేషించవచ్చో అనే అంశాలపై మేము దృష్టి పెడతాము" అని వందన చెప్పారు.





డిశ్చార్జ్ చేయడానికి ముందు

"వీరి వ్యక్తి గత సమాచారాన్ని చాలా గోప్యంగా వుంచాల్సి వస్తుంది. ఇది చాలా అవసరం కూడా. అలా ఉంచినపుడు మాత్రమే వారు మాతో అన్ని విషయాలు పంచుకోగలుగుతారు. డిశ్చార్జ్ చేయడానికి ముందు రోగులను వారి భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతాము. వారు స్వతంత్రంగా బతకడానికి సిద్ధంగా ఉన్నారా, వారు ఎంచుకున్న వాతావరణంలో తమని తాము రక్షించుకోగలుగుతారో లేదో అని పరిశీలిస్తాం. చికిత్స సమయంలో మాత్రలు వెయ్యడం, వారి రోగాన్ని తగ్గించడం మాత్రమే కాదు వారు గతంలో ఎదుర్కొన్న సమస్యలను మళ్ళీ ఎదుర్కో వలసి వస్తే ధైర్యంగా ఎదుర్కొనేలా వారికి శిక్షణ ఇస్తాం" అని జయకుమార్ చెప్పారు.

డిశ్చార్జ్ తర్వాత కూడా

ఆ వ్యక్తి వారి కుటుంబంతో తిరిగి కలిసిపోయినా, సమాజంలో నివసిస్తున్నా వారికి భద్రత అందుబాటులో ఉందా లేదా అని ది బన్యన్ పరిశీలిస్తూనే ఉంటుంది. వారు ప్రాథమిక ఆదాయాన్ని పొందేందుకు, మహిళలు స్వయంప్రతిపత్తిని పెంపొందించుకునేలా వారిని శక్తివంతం చేసేందుకు ఎన్‌జీఓ పని చేస్తుంది. అయితే కొంతమంది రోగులు తమ ఇళ్ల నుండి బయటికి వెళ్లిపోయారు, మళ్లీ నిరాశ్రయులయ్యారు, మరికొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే 2015-16 ప్రకారం జీవితకాల మానసిక అనారోగ్య ప్రాబల్యం 13.7శాతం ఉంది.

దాతల భాగస్వామ్యంతో...

బన్యన్ మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న వారికి మాత్రమే కాదు ఆర్థిక కష్టాల్లో ఉన్నవారికి కూడా సహాయం చేయడానికి ఉద్యోగ నియామకాలు, సామాజిక సంరక్షణ ప్యాకేజీలను కూడా అందిస్తుంది. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, WHO, గివ్ ఇండియాతో పాటు ఇతర దాతల భాగస్వాములతో కలిసి బన్యన్ ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేస్తుంది. ఇందులో ఒకటి హెూమ్ ఎగైన్ ప్రోగ్రామ్. ఇది మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళలకు ప్రత్యామ్నాయాలు, జీవించే ఎంపికలను అందిస్తుంది. వారి సమస్య స్థాయిని బట్టి నిరంతర రక్షణ కల్పి స్తుంది. నేడు మన చుట్టూ కమ్యూనిటీలు మానసిక ఆరోగ్యానికి అనుకూలమైనవి కానప్పటికీ బన్యన్ మాత్రం అలాంటి వారిని కలుపుకుపోవడంపై ఎక్కువ దృష్టి పెడుతుంది.

- సలీమ

తప్పక తీసుకోవల్సినవి...

శీతాకాలంలో రోగనిరోధక శక్తి తగ్గిపోవడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. సాధారణంగా ఈ సీజన్‌లో సూర్యరశ్మి తక్కువగా ఉంటుంది. ఎండ ప్రభావం తక్కువగా ఉండటం వల్ల చాలామంది శరీరంలో విటమిన్-డి లోపిస్తుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థ బలహీనతకు కారణమవుతుంది. దీంతో పాటు చలి గాలుల వల్ల శరీరంలోని రక్తనాళాలు కుంచించుకుపోయే అవకాశం ఉంది. శ్వాసకోశ సమస్యలు వస్తాయి. ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల కూడా రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుంది. అందువల్ల ఈ కాలంలో రోగనిరోధక శక్తిని పెంచుకునేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. ఈ సీజన్‌లో లభించే కొన్ని రకాల పండ్లను క్రమం తప్పక తీసుకుంటే సమస్య దరి చేరదు. అందుకు ఎలాంటి పండ్లు తీసుకోవాలంటే...



నారింజ : శీతాకాలంలో లభించే నారింజ పండ్లు రుచితో పాటు, అపారమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. సిట్రస్ కుటుంబానికి చెందిన ఈ జాతి పండ్లు విటమిన్ సి కి మంచి వనరులుగా ఉంటాయి. వీటిలో విటమిన్ డి కూడా సమృద్ధిగా లభిస్తుంది. వీటిని రోజూ తినడం వల్ల... సి, డి విటమిన్లు శరీరానికి అందుతాయి.

యాపిల్స్ : యాపిల్ పండును సూపర్ ఫుడ్ అంటారు. వీటిల్లో ఫైబర్, విటమిన్ సి, విటమిన్ బి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని, జీర్ణక్రియను, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

దానిమ్మ : క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిని రాకుండా నియంత్రించే శక్తి దానిమ్మకు ఉంటుంది. దీంట్లో ఉండే ఔషధ గుణాలు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. దానిమ్మ శీతా కాలంలో ఎదురయ్యే చర్మ సమస్యలను నివారించి, చర్మ ఆరో గ్యాన్ని కాపాడుతుంది. దానిమ్మ గింజలను నేరుగా తినవచ్చు. లేదా జ్యూస్ చేసుకొని తాగవచ్చు.

బత్తాయి : దీన్ని మొసంబి అని కూడా పిలుస్తారు. ఇది సిట్రస్ జాతికి చెందిన పండు. దీని ద్వారా విటమిన్ సి, ఫైబర్ అధిక మొత్తంలో శరీరానికి అందుతాయి. రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి, ఈ కాలంలో ఎదురయ్యే సీజనల్ వ్యాధులను నివారించడానికి బత్తాయి సహాయపడుతుంది.

కివీ పండ్లు : కివీ పండులో అనేక రకాల పోషకాలు ఉంటాయి. విటమిన్ సి, పొటాషియంతో పాటు విటమిన్ ఇ, విటమిన్ కె, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, ఫోలేట్ వంటివి కివీ పండు నుంచి అందుతాయి. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఈ పోషకాలు శరీరానికి అంది, రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణక్రియ రేటును మెరుగు పరిచేందుకు కూడా కివీ పండు దోహదం చేస్తుంది.

గాంధీ భజన గాడ్సే ఆచరణ

(మొదటిపేజీ తరువాయి)

తాము పొందే సొమ్మును తప్పనిసరిగా వెల్లడించేలా ఓ చట్టాన్ని రూపొందించాలని సంతానం కమిటీ సిఫార్సు చేసింది. 'రాజకీయ పార్టీలు ఈ సూచనకు అభ్యంతరం తెలుపుతారని మేము నేపథ్యంలో సంతానం కమిటీ చేసిన సూచనకు ఎంతో ప్రాధాన్యత ఉంది. రాజకీయ పార్టీలు తాము పొందే సొమ్మును తప్పనిసరిగా వెల్లడించేలా ఓ చట్టాన్ని రూపొందించాలని సంతానం కమిటీ సిఫార్సు చేసింది. 'రాజకీయ పార్టీలు ఈ సూచనకు అభ్యంతరం తెలుపుతారని మేము అనుకోవడం లేదు. స్వచ్ఛంద ఒప్పందాల ద్వారా రాజకీయ పార్టీలు ఈ పని చేయడం సులభం కాదు. అందుకే ఓ చట్టం చేయాలి. జమాఖర్చుల ఖాతాల నిర్వహణ, ప్రచురణను తప్పనిసరి చేయాలి' అని కమిటీ తెలిపింది. అప్పుడు సంతానం కమిటీ చేసిన సిఫార్సులకు ఇప్పుడు మోడీ ప్రభుత్వం పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. పార్టీలకు అందే విరాళాల గురించి ప్రజలకు తెలియాల్సిన అవసరమే లేదని చెబుతోంది. తెలుసుకునే హక్కు ప్రజలకు లేదని అంటోంది.

కార్పొరేట్ సంస్థల విరాళాలు వద్దు

రాజకీయ పార్టీలకు నిధులు ఇవ్వకుండా కార్పొరేట్ సంస్థలను నిషేధించాలని సంతానం కమిటీ కీలక సూచన చేసింది. 'భారతదేశంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, తమ విరాళాల ద్వారా రాజకీయాల్లో పాల్గొనేందుకు కంపెనీలను అనుమతించరాదని మేము భావిస్తున్నాం. 1960వ సంవత్సరపు కంపెనీల చట్టాన్ని కూలంకషంగా పరిశీలించి, చర్చించాం. కంపెనీల విరాళాలన్నింటి పైన పూర్తి నిషేధం విధించాల్సిందే' అని స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలు ప్రజల నుండి విరాళాలు పొందడమే మంచిదని సూచించింది. అప్పుడే ఎన్నికల వ్యయానికి సంబంధించిన అవినీతిని రూపుమాపవచ్చునని అభిప్రాయపడింది. 'మూడు కుటుంబాలలో కనీసం ఒక కుటుంబం అయినా రాజకీయ పార్టీకి సంవత్సరానికి ఒక రూపాయి అందజేస్తే అది ఆ పార్టీ చట్టబద్ధమైన అవసరాలకు సరిపోతుంది' అని వ్యాఖ్యానించింది. ఎన్నికల బాండ్ల పథకం ద్వారా బీజేపీ పెద్ద మొత్తంలో విరాళాలు పొందుతున్న తరుణంలో సంతానం కమిటీ సూచనలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. విరాళాల రూపంలో అందే నిధులు చివరికి అవినీతికి దారితీస్తాయని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. గాంధీజీ వ్యాఖ్యలను, సంతానం కమిటీ సిఫార్సులను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల బాండ్ల చట్టబద్ధతను, చెల్లుబాటును పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఈడీ, సీబీఐ దాడులు

- కాంగ్రెస్ కార్యకర్తలను నిరుత్సాహపర్చలేవు : ఖర్గే

బాలాఘాట్ (మధ్యప్రదేశ్) : ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ కార్యకర్తలను నిరుత్సాహపర్చలేవని ఆ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలోని కటంగి పట్టణంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఖర్గే పాల్గొన్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌ల్లోనూ కాంగ్రెస్‌దే విజయమని ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. 'ఛత్తీస్‌గఢ్‌లో ఇడి, సిబిఐ, ఐటి దాడుల ద్వారా కాంగ్రెస్ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసి వారిని ఇళ్లలో కూర్చోబెట్టాలని మోడీ, అమిత్‌షా భావిస్తున్నారు. ఈ దాడులతో కాంగ్రెస్ కార్యకర్తలు నిరుత్సాహానికి గురవుతారని వారు ఆలోచిస్తున్నారు. కానీ అది జరగదు' అని ఖర్గే చెప్పారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మోడీ ఒకప్పుడు తీవ్రంగా విమర్శించారని, అయితే కోవిడ్ మహమ్మారి సమయంలో ఉపాధి కల్పించడానికి అదే కార్యక్రమం ప్రభుత్వానికి సహాయ పడిందని ఖర్గే తెలిపారు. గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల దృక్పథాల కారణంగానే ప్రస్తుత ప్రభుత్వం లక్షలాది మందికి ఉచిత రేషన్ అందించగలుగుతోందని చెప్పారు.

7న బీసీల ఆత్మగౌరవ సభ: డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీల ఆత్మగౌరవ సభను ఈ నెల 7న హైదరాబాద్ లో నిర్వహిస్తున్నామనీ, ఈ సభలో పీఎం మోడీ ముఖ్యఅతిథిగా పాల్గొంటారనీ బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. శనివారం హైదరాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అదే విధంగా 11న నిర్వహించనున్న బహిరంగసభలోనూ పీఎం పాల్గొంటారని తెలిపారు. బీసీని ముఖ్యమంత్రి చేస్తామనే చారిత్రక నిర్ణయాన్ని బీజేపీ ప్రకటించిందనీ, రాష్ట్ర ప్రజలకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు.

ఢిల్లీ గులాములా? తెలంగాణ బిడ్డలా?

(మొదటిపేజీ తరువాయి)

కూడా రాని ఆ పార్టీ ముఖ్యమంత్రిని ఎలా చేస్తుందని ప్రశ్నించారు. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందని చెప్పారు.. ఒకప్పుడు కరెంట్ కోసం కాపలా కాసిన రైతులకు నేడు 24 గంటల ఉచిత కరెంట్ అందిస్తున్నామని చెప్పారు. 2014లో 68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, నేడు 3.5 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతోందన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ సమయంలో 56 వేల కోట్లున్న ఐటీ ఎగుమతులు, నేడు 2.41 లక్షల కోట్లకు చేరుకున్నాయని, ఐటీ ఉద్యోగుల సంఖ్య 3లక్షల నుంచి 10 లక్షలకు చేరుకుందని గుర్తు చేశారు. తెలంగాణ తలసరి ఆదాయం తొమ్మిదిన్నరేండ్లలో రూ. 1.14 లక్షల నుంచి, రూ.3.17 లక్షలకు చేరుకుందని అన్నారు. రైతుబంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి,ఆసరా పెన్షన్లు, మిషన్ భగీరథ తదితర సంక్షేమ పథకాలు చరిత్రలో నిలుస్తాయని అన్నారు. ఒకవైపు ఐటీ, మరో వైపు వ్యవసాయం... రెండు రంగాలను సమానంగా ప్రగతి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు. 2014లో తెలంగాణ ఎలా ఉండేది...ఇప్పుడెలా ఉందనేది విజ్ఞులు ఆలోచించి, బీఆర్‌ఎస్‌కు మరోసారి ఆవకాశం ఇవ్వాలని కోరారు.

డీకే శివకుమార్ పై కేటీఆర్ ఫైర్

కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లక్షమందికి ఉద్యోగాలు కల్పించనున్న ఫాక్స్‌కాన్ కంపెనీని బెంగళూరుకు మార్చాలని గత నెలలో ఆ కంపెనీ సీఈవోకు డీకే లేఖ రాశారని మంత్రి మండిపడ్డారు. త్వరలో తెలంగాణలో ఫ్రెండ్లీ ప్రభుత్వం వస్తుంది, అక్కడ ఉన్న ప్రముఖ కంపెనీలన్నింటిని ఇక్కడికి తరలిస్తామని అనడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాకపోతే ఇక్కడి కంపెనీలను బెంగుళూరుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణపై విషం కక్కుతున్న డీకే వైఖరిని మంత్రి తప్పు పట్టారు.

న్యాయవాదులపై వరాల జల్లు

న్యాయవాదులపై మంత్రి కేటీఆర్ వరాల జల్లు కురిపించారు.న్యాయవాదుల ట్రస్టుకు ఇప్పుడున్న రూ.100 కోట్లకు అదనంగా మరో రూ.400 కోట్లు కేటాయించనున్నట్టు తెలిపారు.

యువ న్యాయవాదులకు ఇస్తున్న స్టయిఫండ్ రూ. 5వేల నుంచి రూ.10 వేలకు పెంచడంతో పాటు ఉచిత ప్రమాద భీమాను రెండింతలు చేయనున్నట్టు చెప్పారు.తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. రాష్ట్రంలో మరో సారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాగానే న్యాయవాదుల పెండింగ్ డిమాండ్లన్నీ పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపికి చెందిన పలువురు అడ్వకేట్లు ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబి కండువా కప్పుకున్నారు.

కల్వకుంట్ల దోపిడీకి కాళేశ్వరం బలి

(మొదటిపేజీ తరువాయి)

కనిపిస్తోందన్నారు. సీఎం డిక్షనరీ నుంచి పుట్టిన 'రీడిజైన్'....వారి దోపిడీకి పరాకాష్ట అన్నారు. నీటిపారుదల శాఖ 2014 నుంచి 2018 వరకు హరీశ్‌రావు దగ్గర ఉంటే, 2019 నుంచి ఇప్పటి వరకు కేసీఆరే ఆ శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నారని చెప్పారు. దీనికి బాధ్యులైన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులను వెంటనే పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తద్వారా సంపూర్ణ విచారణ జరుగుతుందన్నారు. కాళేశ్వరం అవినీతిపై మాట్లాడుతున్న బీజేపీ నేతలు విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌కు బీజేపీ ప్రొటెక్షన్ మనీ ఇస్తోందని ఆరోపించారు. బ్యారేజీ కుంగుబాటుపై వివిధ రాష్ట్రాలకు చెందిన నిపుణులతో ఓ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం ప్రాజెక్టు నిర్మాణంపై సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు అజయ్‌కుమార్, మహేష్‌కుమార్, కోదండరెడ్డి, అరెకెల నర్సారెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి రేవంత్ విలేకర్లతో మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజి డొల్లతనాన్ని కేంద్ర కమిటీ బయటపెట్టిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కర్త, కర్మ, క్రియ అన్ని తానేనంటూ అందుకు తన రక్తం ధారపోసి కట్టానంటూ సీఎం చెప్పారని గుర్తు చేశారు. బ్యారేజీ కుంగుబాటుకు తనదే బాధ్యత అని చెప్పకుండా దాన్ని పక్కదోవపట్టిస్తున్నారని విమర్శించారు. తన మేధస్సుతో కాళేశ్వరం నిర్మాణం జరిగిందన్న కేసీఆర్... ఇప్పుడు దీన్ని చిన్నదిగా చూపి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరిగినా సీఎం కేసీఆర్ కాళేశ్వరంపై నోరు మెదపలేదన్నారు. నిర్మాణంలో లోపాలు, అవినీతి జరిగిందన్న ఉద్దేశంతోనే ప్రాజెక్టు వివరాలను సర్కారు దాచిపెట్టిందన్నారు.

సీతారామ ప్రాజెక్టు ఒప్పంద సమయంలో నిర్మాణ వ్యయం రూ. 270 కోట్లు ఉండగా, తర్వాత దాన్ని రివైజ్డ్ కింద రూ. 500 కోట్లకు పెంచారని గుర్తు చేశారు.ఆ ప్రాజెక్టు కాంట్రాక్టును కేసీఆర్ బంధువుకు చెందిన ప్రతిమ కంపెనీకి ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా కాళేశ్వరంలో కూడా రూ. 80 వేల కోట్లు అగ్రిమెంట్‌లో చూపించి, దాన్ని రూ 1.50వేల కోట్లకు పెంచారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టును నిర్మించిన ఎల్ అండ్ టీ కంపెనీపై చర్యలు తీసుకునేందుకు సీఎం కేసీఆర్ ఎందుకు వెనకాడుతున్నారని ప్రశ్నించారు. కాళేశ్వరంపై జరిగిన అవినీతిని కేంద్రం ఎందుకు విచారించడం లేదని ప్రశ్నించారు. ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్నారు. పదేండ్ల క్రితం రిటైర్ అయిన అధికారి మురళీధర్‌రావుకు బాధ్యతలు ఇచ్చి తప్పు చేశారని ఆరోపించారు. బాధ్యులపై తక్షణమే క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీల ప్లానింగ్ వేరు, నిర్మాణం వేరు కాబట్టే మునిగిపోతున్నాయని



వ్యాఖ్యానించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అడిగే ప్రశ్నలకు కేసీఆర్ సమాచారం ఇవ్వడం లేదని విమర్శించారు. సీఎం కేసీఆర్‌ను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. దీనిపై ఎవరూ చర్యలు తీసుకోకపోయినా, డిసెంబర్ 9 తర్వాత కాళేశ్వరం బాధ్యుల తాటా తీస్తామని హెచ్చరించారు. ప్రాజెక్టు అంచనాలు, వ్యయంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్రం ఇచ్చిన నివేదికపై చర్యలు తీసుకోవాలని కోరితే బండి సంజయ్ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం ఏంటని రేవంత్ ప్రశ్నించారు. బండి సంజయ్‌కుమార్‌ను పదవి నుంచి తప్పించిన తర్వాత బుర్ర పని చేస్తున్నట్టు లేదని వ్యాఖ్యానించారు. కేంద్ర జలశక్తి మంత్రి పరిధిలో ఉండే కమిటీనే.. తప్పు జరిగిందంటూ నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. దీన్ని బట్టి బీజేపీ అధికారంలోకి రాదు.. విచారణ జరపమంటూ చెప్పదలుచుకున్నారా? అని ప్రశ్నించారు. తప్పు సరిదిద్దుకోవడం మానేసి.. రాహుల్ గాంధీని నన్ను బీఆర్‌ఎస్ నేతలు తిడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల పర్యటన కాదు.. మేడిగడ్డ పర్యటన చేసి అప్పుడే ఓట్లు అడగాలని ప్రధాని మోడీని రేవంత్ డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యతిరేకులంతా ఏకమవుతున్నారనే ఆరోపణలపై రేవంత్ సీరియస్ అయ్యారు. కోదండరాం కూడా తెలంగాణ వ్యతిరేకేనా? ఆయన్ని తెలంగాణ వ్యతిరేకి అంటే బీఆర్‌ఎస్ నేతలను జనం చెప్పుతో కొడతారని హెచ్చరించారు. రాష్ట్రంలో కేఏ.పాల్ కూడా పోటీ చేయడం లేదనీ, ఆయన బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్టా? అని ప్రశ్నించారు. మాట్లాడటానికి బుద్ధి ఉండాలంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.


ఆమె ఓటే శాసనం!

(మొదటిపేజీ తరువాయి)

మెజార్టీ జిల్లాలో మహిళల ఓట్లు అధికంగా ఉన్నాయి. ఉదాహరణకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటర్ల సంఖ్యను పరిశీలిస్తే... మొత్తం ఓటర్లు 22,16,690 ఉండగా పురుషులు 10,91,034 మంది ఉన్నారు. మహిళలు 11,25,656మంది నమోదయ్యారు. ఆదిలాబాద్, బోథ్, చెన్నూర్, మంచిర్యాల, నిర్మల్, ముధోల్, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో పురుషుల ఓట్ల కంటే మహిళలే అధికంగా ఉన్నాయి. సిర్పూర్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో పురుష ఓటర్లు స్వల్ప ఆధిక్యంలో ఉన్నారు. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు వారి మ్యానిఫెస్టోలో మహిళల ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చాయి. అధికారంలోకి వస్తే అమలు చేస్తామని అనేక వాగ్దానాలు చేస్తున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ సౌభాగ్యలక్ష్మీ పేరిట పేద మహిళలకు నెలకు రూ.3వేల చొప్పున అందజేస్తామని, రూ.400కే గ్యాస్ సిలిండర్ వంటి సౌకర్యాలు అందిస్తామని పొందుపర్చగా.. కాంగ్రెస్ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో పాటు మహాలక్ష్మీ పేరిట నెలకు రూ.2500చొప్పున అందజేస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని ప్రకటించింది. ఇలాంటి ప్రయత్నాల ద్వారా మహిళల ఓట్లను అధికంగా పొందవచ్చనే ఆలోచనలో రాజకీయ పార్టీలు ఉన్నాయి. గెలుపోటములను శాసించే స్థాయిలో మహిళల ఓట్ల సంఖ్య ఉండటంతో ఆయా పార్టీలు సైతం వీరి ఓట్లపై గురిపెట్టాయి. ప్రచారంలోనూ మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యం అంతాఇంతా కాదు. పార్టీలు నిర్వహిస్తున్న సభలకు సైతం మహిళా ఓటర్లను అధిక సంఖ్యలో రప్పించేలా నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు.

నేపాల్‌లో భారీ భూకంపం

(మొదటిపేజీ తరువాయి)



సరఫరాను, కమ్యూనికేషన్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ఐదు రోజుల పాటు ఉచితంగా టెలికం సేవలు అందజేస్తారు. గాయపడిన వారిని రాజధాని ఖాట్మండులోని టీపీ టీచింగ్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఇందుకోసం భద్రతా సిబ్బందిని నియమించారు. సంక్షోభ సమయంలో నేపాల్‌కు సాయం అందించేందుకు భారత్ ముందుకు వచ్చింది. నేపాల్‌లో నివసిస్తున్న భారతీయుల కోసం అత్యవసర కాంటాక్ట్ నెంబరును ప్రకటించింది. నేపాల్ ప్రధాని పుష్ప కుమార్ దాహల్ జజార్‌కట్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఆయన వెంట 16 మంది సభ్యులతో కూడిన వైద్య బృందం కూడా వెళ్లింది. అవసరమైన వారికి వైద్య సాయం అందించేందుకు నేపాల్‌గంజ్ విమానాశ్రయం హెలిపాడ్ వద్ద అంబులెన్సులను సిద్ధం చేశారు. బాధితులకు ఆహారం, తాగునీరు, బట్టలు, టెంట్లు అందజేసేందుకు వీలుగా అన్ని రాజకీయ పార్టీలు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు విరాళాలు అందించాలని ప్రధాని కార్యాలయం విజ్ఞప్తి చేసింది. అనేక చోట్ల రోడ్లపై కొండచరియలు విరిగిపడడంతో సహాయ కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడుతోంది. నేపాల్‌లో జరిగిన ప్రాణనష్టం, ఆస్తినష్టంపై ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం వ్యక్తం చేశారు. అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. భూకంప ప్రభావం ఉత్తర భారతదేశంపై కూడా పడింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోని కొన్ని జిల్లాల్లో భూమి కంపించింది. అయితే నేపాల్‌లో కన్పించినంత తీవ్రత మన దేశంలో లేదు.

రెడిమిక్స్ ప్లాంట్‌లో ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

దర్యాప్తు చేస్తున్నారు.

బంధువుల ఆందోళన

ఇద్దరు కార్మికులు మృతిచెందారనే విషయం తెలియగానే బాధిత కుటుంబ సభ్యులు కంపెనీ వద్దకు వెళ్లారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు. కార్యాలయంలో ఫర్నీచర్స్, అద్దాలు ధ్వంసం చేశారు. సంస్థ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఘటన జరిగిందని ఆరోపించారు. ఎలాంటి సేఫ్టీ పరికరాలు లేకపోవడంతో ప్రమాదం జరిగిందన్నారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



బి - ఫారమ్ అంటే తెలుసా?

దేశంలో ఎన్నికలలో పోటీ చేయడానికి అనేక రకాల ఫారమ్‌లను పూరించాలి. కానీ, మనం తరచూ వినేది మాత్రం బి - ఫారమ్ గురించే. ఈ ఫారమ్‌కు ఎందుకు అంత ప్రాముఖ్యత ఉంది? ఎన్నికల సంఘం గుర్తించిన పార్టీ టిక్కెట్‌పై ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న వారిను తప్పనిసరిగా బి-ఫారమ్ సమర్పించాలి.

ఆ రాజకీయ పార్టీ తరపున అభ్యర్థి పేరును సూచిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు లేదా ఆ పార్టీ నిర్ణయించిన వ్యక్తి సంతకం చేస్తారు. ఆమోదించబడిన అభ్యర్థి నామినేషన్ తిరస్కరించబడిన సందర్భంలో ప్రత్యామ్నాయం పేరు పెట్టడానికి కూడా ఫారమ్‌లో నిబంధన ఉంది.

ఈ ఫారమ్ నిర్దిష్ట అభ్యర్థిని ఒక రాజకీయ పార్టీ ద్వారా ఉంచబడిందని రుజువు చేస్తుంది. బి-ఫారమ్ రిజర్వ్ చేయబడిన గుర్తుతో వచ్చే అన్ని ఇతర ప్రయోజనాలతో పాటు రాజకీయ పార్టీ యొక్క రిజర్వ్ చేయబడిన గుర్తును కేటాయించినట్టు నిర్ధారిస్తుంది. బి-ఫారం లేని అభ్యర్థిని స్వతంత్రుడిగా పరిగణిస్తారు.



ఎ ఫారమ్

ఈ ఫారమ్ రాజకీయ పార్టీలు పెట్టిన అభ్యర్థుల పేర్లను కలిగి ఉన్న ఫారం-బి పై సంతకం చేయడానికి అధికారం పొందిన వ్యక్తుల జాబితాను సూచిస్తుంది. ఈ ఫారమ్‌పై పార్టీ ముద్రతో పాటు రాజకీయ పార్టీ అధ్యక్షుడు లేదా కార్యదర్శి సంతకం చేయాలి. ఈ ఫారమ్‌లో అధీకృత వ్యక్తుల నమూనా సంతకాలు కూడా ఉండాలి.



దోశ.. ఓట్ల ఆశ

నవతెలంగాణ-పరిగి : వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల మహేష్ రెడ్డి శనివారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. బీసీ కాలనీలోని ఓ ఇంట్లో బట్టలను ఇస్త్రీ చేశారు. అనంతరం పరిగి మెయిన్ రోడ్డులోని టిఫిన్ సెంటర్‌లో దోశలు వేశారు.

ఉమ్మడి కరీంనగర్ బరిలో దిగ్గజాలు

వరుస విజయాలు.. సుదీర్ఘ రాజకీయ అనుభవం

అందరి దృష్టి ఈ జిల్లాపైనే!



'రాష్ట్రంలో హ్యాట్రిక్ ప్రభుత్వం మాదేనంటూ బీఆర్ఎస్ రంగంలోకి దిగగా.. ఈసారి తామే అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ ధీమాతో ఉంది. మధ్యలో ఏ చిన్న అవకాశమైనా దొరక్కపోదా? అన్న ఆశలో బీజేపీ ఎదురుచూస్తోంది. ఈ మూడు ప్రధానపార్టీల్లో సీనియర్లుగా, సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న వారిలో కొందరు కీలక నేతలు, అందులోనూ ఒకరిద్దరు సీఎం స్థాయి వారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బరిలోకి దిగారు. మూడు నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచిన ఈ దిగ్గజాల పొలిటికల్ జర్నీ.. వారు పోటీ చేస్తున్న ప్రస్తుత స్థానాలను పరిశీలిద్దాం.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

- జగిత్యాల నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డికి 1983 నుంచి సుదీర్ఘ రాజకీయ అనుభవముంది. 1983, 1989, 1996 (ఉప ఎన్నిక), 1999, 2004, 2014లో ఆరుసార్లు విజయం సాధించిన ఈయన మధ్యలో 1985, 1994, 2009, 2018 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. మొదట్నుంచీ కాంగ్రెస్ అభ్యర్థిగానే రంగంలోకి దిగుతున్న జీవన్‌రెడ్డికి ప్రత్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పోటీ పడుతున్నారు. ఈయన తన ఐదేండ్ల పాలనపైనా, బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసంపైనే నమ్మకంతో ఉన్నారు.
- మంథని నియోజకవర్గం నుంచి దుద్దిళ్ల శ్రీపాదరావు వారసత్వాన్ని పునికిపుచ్చుకుని నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీధర్‌బాబు ఈసారీ అదే స్థానం నుంచి పోటీకి దిగారు. 1983 నుంచి 89వరకు మూడు సార్లు తన తండ్రి ఎమ్మెల్యేగా ఉండగా.. 1999 నుంచి 2018వరకు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన శ్రీధర్‌బాబు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఫ్యామిలీగా పేరొందారు. ప్రస్తుతం ఈయనకు ప్రత్యర్థిగా 2014లో తనపై గెలిచిన పుట్టమధు బీఆర్ఎస్ నుంచి మళ్లీ పోటీపడుతున్నారు.
- 2009లో ఎంపీగా పని చేసిన పొన్నం ప్రభాకర్ ఆ తరువాత వచ్చిన ఏ ఎన్నికల్లోనూ గెలవలేకపోయారు. అయితే అన్నిసార్లూ పోటీ చేసిన కరీంనగర్ స్థానాన్ని వదిలిన పొన్నం ఈసారి బీసీ సామాజిక తరగతి ఓట్లు ఎక్కువగా ఉన్న హుస్నాబాద్ నుంచి పోటీకి దిగారు. వరుస విజయాలతో ఎమ్మెల్యేగా కొనసాగుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఒడితెల సతీష్‌బాబు ప్రత్యర్థిగా ఉన్నారు.

బీజేపీలో ముగ్గురు సీనియర్లు..

టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా 2004, 2008, 2009, 2010, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించిన ఈటల రాజేందర్ 2021(ఉప ఎన్నిక)లో బీజేపీలో చేరి ఏడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం ఈయనకు ప్రత్యర్థులుగా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఒడితెల రాజేశ్వర్‌రావు ఫ్యామిలీ నుంచి ప్రణవ్‌బాబు పోటీ పడుతున్నారు. బీజేపీలో బీసీ ముఖ్యమంత్రి ప్రకటనతో తెరమీదకు వచ్చిన ఈటల రాజేందర్.. గెలుపు ఇక్కడ అంత సులువు కాదనే చెప్పొచ్చు.

- మరోవైపు 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన బండి సంజయ్ ఈసారి కరీంనగర్ అసెంబ్లీ స్థానం నుంచి బరిలో దిగారు. అయితే, ప్రత్యర్థిగా ఉన్న గంగులను ఢీకొట్టే స్థాయిలో సంజయ్ ప్రచారం, వ్యూహమూ లేదనే చెప్పొచ్చు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఈసారి కోరుట్ల అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి దిగారు. ఇక్కడ బీఆర్ఎస్ నుంచి 2009 మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కె.విద్యాసాగర్‌రావు ఈసారి తనయుడు డాక్టర్ సంజయ్‌ని బరిలోకి దింపారు. డాక్టర్‌గా, సౌమ్యుడిగా పేరున్న సంజయ్ కోరుట్లలో లుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్ఎస్ నుంచి ముగ్గురు దిగ్గజాలు..

- 2009లో సిరిసిల్ల నుంచి పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన మంత్రి కేటీఆర్ వరుసగా నాలుగుసార్లు (2009, 2010, 2014, 2018) ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుస్తూ వస్తున్నారు. ఈయనకు ప్రత్యర్థులుగా బలమైన నేతలెవరూ పోటీలో లేకపోవడం ప్రతిసారీ కలిసొస్తుండగా.. ఈసారి కూడా అదే సీన్ రిపీట్ అయింది. బీజేపీ నుంచి అక్కడి ప్రజలకు పరిచయం లేని వరంగల్‌కు చెందిన రాణి రుద్రమారెడ్డి బరిలోకి దిగగా.. కాంగ్రెస్ పార్టీ ఇంకా అభ్యర్థినే ప్రకటించలేదు. సీఎం కేసీఆర్ తరువాత కేటీఆర్‌యే సీఎంగా ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఆయన గెలుపు నల్లేరు మీద నడకేనని చెప్పొచ్చు.
- కరీంనగర్‌లో కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన గంగుల కమలాకర్ 2009, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా హ్యాట్రిక్ విజయాలు సాధించి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం మంత్రిగానూ పని చేస్తున్నారు. అయితే, ఈయనకు ప్రధాన ప్రత్యర్థిగా బీజేపీ నుంచి ప్రతిసారీ తలపడుతున్న బండి సంజయ్ వరుసగా ఓటమి చవి చూస్తున్నారు. ఈసారి కూడా సంజయ్ పోటీకి దిగినా.. గంగుల స్పీడ్‌కు తగ్గ ప్రచారమేమీ ప్రారంభించలేదు. మరోవైపు ఇక్కడా ఇంకా కాంగ్రెస్ అభ్యర్థి ఫైనల్ కాకపోవడం గమనార్హం.
- 2004 నుంచి వరుసగా 2008, 2009, 2010, 2014, 2018 ఎన్నికల్లో ఆరు సార్లు ధర్మపురి స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుస్తూ ఓటమెరుగని నేతగా కొప్పుల ఈశ్వర్ ఎది గారు. ప్రస్తుతం ఆయన మంత్రిగానూ ఉన్నారు. అయితే, గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై కేవలం 441 ఓట్ల స్వల్ప తేడాతోనే గెలిచిన కొప్పులకు ఈసారి కూడా ప్రత్యర్థిగా లక్ష్మణ్ దిగారు. 'కొప్పుల' గెలుపు కష్టమేనన్న సంకేతాలు బీఆర్ఎస్‌లో ఆందోళన కలిగిస్తోంది.

ఉక్కు మనిషి బీఎన్

స్టన్ గన్ పట్టి పోరాడిన ధీరుడు

ప్రజాప్రతినిధిగా ఎంతో అభివృద్ధి

అణిముత్యాలు..

నవతెలంగాణ-మఠంపల్లి


వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి నేటి తరానికి ఆదర్శవంతుడు. భీమిరెడ్డిని అందరూ బీఎన్ అని అభిమానంగా పిలుస్తారు. బీఎన్ అంటే ఒక ధైర్యం, ఒక తెగింపు. ఉక్కు మనిషిగా పిలుచుకుంటారు. ఆయన పోరాట పటిమ అలాంటిది. దున్నేవాడికే భూమి కావాలని.. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం 1941 నుంచి 1951 వరకు సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో బీఎన్ పాత్ర కీలకం.

నేటి సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి కరివిరాల కొత్తగూడెంలో సామాన్య భూస్వామ్య కుటుంబంలో జన్మించారు బీఎన్. పేదలకు జరుగుతున్న అన్యాయం, కుల వివక్షపై పోరాటం సాగించేందుకు ఆనాడు తనతోపాటే చెల్లెల్ని, తమ్ముడిని పోరాటాల్లోకి తీసుకొచ్చారు. 1942లో చిలుకూరులో జరిగిన ఆంధ్ర మహాసభకు బీఎన్ తన చెల్లెలు స్వరాజ్యం, తమ్ముడు కుశలవరెడ్డిని వెంటబెట్టుకుని వెళ్లారు. నిజాం సైన్యాలను, జమీందారులను, భూస్వాములను గడగడలాడించిన యోధుడు. చాకలి ఐలమ్మకు చెందిన పంట భూములను కాపాడి కడవెండి దొర గడీని, అతని అనునాయాయులను తరిమికొట్టిన ధీరుడు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగుతున్న రోజుల్లోనే 1948లో హైదరాబాద్‌ను నిజాం సర్కార్ భారతదేశంలో విలీనం చేశారు. దీంతో గ్రామాల్లో నిజాం సైన్యాలతో పాటు కేంద్ర బలగాలు మోహరించి సాయుధ దళాలను అణచివేయాలని దాడులు చేశారు. ఈ క్రమంలో 1949లో ఎల్లంపల్లి కొండల్లో జాతీయ నాయకులు కామ్రేడ్ సత్యపాల్ డాంగ్, దేవులపల్లి వెంకటేశ్వరరావుతో కలిసి దళం సమావేశమైంది. ఈ విషయాన్ని గుర్తించిన నిజాం సైన్యాలు కొండను చుట్టుముట్టంతో అప్రమత్తమైన బీఎన్ ఒక చేత్తో చంటి పిల్లాడిని సంకలో వేసుకొని, మరో చేతితో స్టన్ గన్‌తో నిజాం మూకలపై కాల్పులు జరిపారు. ఆ విధంగా దళ నాయకుల్ని, దళాన్ని కాపాడారు. బీఎన్ దళ నాయకుడిగా పాత సూర్యాపేట, దేవరుప్పల్, ఆలేరు, కరీంనగర్, ఖమ్మం తదితర ప్రాంతాల్లో పని చేశారు.

ప్రజాప్రతినిధిగా చట్టసభల్లో..

పోరాట విరమణ అనంతరం ప్రజాప్రతినిధిగా 1957 నుంచి 62 వరకు సూర్యాపేట ఎమ్మెల్యేగా, 1967 నుంచి 1971 వరకు నాగారం ఎమ్మెల్యేగా పనిచేశారు. పార్టీ చీలిక అనంతరం సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశారు. పార్టీ విస్తరణలో విశేష కృషి సల్పారు. మిర్యాలగూడ ఎంపీగా 1971, 1984, 1991లలో గెలిచి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఖమ్మం రైల్వే స్టేషన్ కోసం కృషి చేశారు. పార్లమెంట్‌లో బీయన్ మైక్ కట్ చేసినా రెండ్రోజులు అలాగే ప్రసంగం సాగించి రైల్వే స్టేషన్ సాధించారు. ఏ ప్రాంతంలో కార్యకర్తకు ఆపద వచ్చినా నేనున్నానంటూ.. వెంటనే అక్కడ వాలిపోయేవారు. ప్రజల హృదయాల్లో, తెలంగాణ రేణువుల్లో, దేశంలో జరిగిన భూసంస్కరణలో బీఎన్ కనిపిస్తారు. నేడు దేశంలో జరుగుతున్న అనేక భూపోరాటాలకు నాంది నాటి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. ఆ పోరాటంలో పాల్గొన్న ప్రతి వ్యక్తి, నాయకుడూ గొప్ప చరిత్ర ఉన్నవారే.



బండెనక బండికట్టి..

బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి.. ఏ బండ్లో వస్తవ్ కొడుకో.. నా కొడక ప్రతాపరెడ్డి.. అనే పాట పాడిన యాదగిరి బీఎన్ దళ సభ్యుడే. పోరాటంలో ఒక్కొక్కరుగా ఒరిగిపోతూ నాలుగు వేలమంది అమరులైనా మొక్కవోని ధైర్యంతో మూడు వేల గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలు స్థాపించి, పదిలక్షల ఎకరాల భూములు పంచిన దాంట్లో బీఎన్ పాత్ర మరువలేనిది.

కుటుంబ నేపథ్యం

తండ్రి రాంరెడ్డి, తల్లి చొక్కమ్మ. బీఎన్‌కు ఇద్దరు చెల్లెళ్ల శశిరేఖ, స్వరాజ్యం, తమ్ముడు కుశలవ రెడ్డి. బీఎన్‌కు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.



ప్రచారంలో తేనెటీగల దాడిలో గాయపడిన కార్యకర్తలను పరామర్శిస్తున్న ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి

\- నవతెలంగాణ ఆలేరు టౌన్

చేవెళ్ల చెల్లెమ్మ హవా సాగేనా..!

ఓటమి ఎరుగని సబితమ్మ

- వరుస విజయాలతో ప్రత్యేక గుర్తింపు
- మరోసారి మహేశ్వరం నుంచి బరిలోకి..
- ఆంధ్రప్రదేశ్ తొలి మహిళా హోంమంత్రిగా రికార్డు
- అప్పుడు.. ఇప్పుడు కీలక శాఖలకు బాధ్యతలు
- సబితమ్మను ఢీకొట్టేందుకు కేఎల్ఆర్, అందెల పోటీ



నవతెలంగాణ - రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ఓటమి ఎరుగని నేతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు సబితాఇంద్రారెడ్డి. అనూహ్య పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వచ్చి అనతికాలంలోనే తనదైన ముద్ర వేశారు. ఆంధ్రప్రదేశ్ తొలి మహిళా హోంమంత్రిగా రికార్డుకెక్కారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ క్యాబినెట్‌లో కీలక శాఖల మంత్రిగా పనిచేస్తూ ప్రత్యేక మార్క్‌ను చాటుకున్నారు. మరోసారి మహేశ్వరం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా సబితాఇంద్రారెడ్డి బరిలో నిలిచారు. ఆమెను ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీలు ప్రత్యేక వ్యూహాలు రచిస్తున్నాయి. సబితమ్మ కూడా ప్రతివ్యూహాలు రచిస్తున్నారు.

భర్త ఇంద్రారెడ్డి మరణంతో సబిత రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. రాజకీయ అనుభవం లేని ఆమె 2000లో చేవెళ్ల ఉప ఎన్నికల్లో నిలిచి ఘన విజయం సాధించారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా చేవెళ్ల నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చేవెళ్ల చెల్లెమ్మగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో గనుల శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. 2009లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది ఉమ్మడి రాష్ట్రంలోనే తొలి హోంశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2014లో తనయుడికి ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలన్న కారణంలో ఆమె దూరంగా ఉన్నారు. ప్రజలకు మాత్రం అందుబాటులో ఉంటూ ప్రజాసేవలో భాగస్వాముల య్యారు. 2018లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల దృష్ట్యా ఆమె బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ క్యాబినెట్‌లో తొలి మహిళామంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

ఓటమి ఎరుగని సబితమ్మ

ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా మహేశ్వరం నియోజకవర్గం నుంచే పోటీ చేస్తున్నారు. ఓటమి తెలియని సబితమ్మకు ఓటమి భయం చూపిస్తామని కాంగ్రెస్, బీజేపీ కంకణం కట్టుకున్నాయి. తన రాజకీయ చరిష్మాతో ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తుచేయడంలో దిట్ట అనే పేరు ఆమెకుంది. ఆమెను ఢీకొట్టేందుకు బలమైన నాయకుడైన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని కాంగ్రెస్ బరిలోకి దింపింది. కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి గత ఎన్నికల్లో ఇంద్రారెడ్డి, సబితారెడ్డితో తలపడి ఓడిన వ్యక్తి. అయినా మరోసారి సబితమ్మతో తలపడేందుకు కాంగ్రెస్ పార్టీ కేఎల్ఆర్‌ను రంగంలోకి దింపింది. అయితే సబితారెడ్డికి పోటీగా కేఎల్ఆర్‌ను బరిలో నిలపడంతో తమ గెలుపు సునాయాసమైందని బీఆర్ఎస్ శ్రేణులు ధీమాతో ఉన్నాయి. హస్తం నేతలు మాత్రం మంత్రిని ఢీకొట్టేది కేఎల్ఆంరే అని ధీమాతో ఉన్నారు.

సబితమ్మకే విజయావకాశాలు?

మంత్రిగా ఐదేండ్ల కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమం కోసం చేసిన సేవనే సబితాఇంద్రారెడ్డి విజయానికి మెరుగైన అవకాశాలని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నారు. విద్యాశాఖ మంత్రిగా విద్యారంగాన్ని మెరుగు పర్చడం, సాంకేతిక విద్యారంగాన్ని మెరుగుపర్చడంలో సబితాఇంద్రారెడ్డి కృషి ఫలితాలను ఇస్తోందని ఆ పార్టీ శ్రేణులు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలతో ఆమెకు ఉన్న వ్యక్తిగత పరిచయాలు, అనుబంధం ఆమెకు కలిసొచ్చే అంశంగా చెబుతున్నారు. ఆమెకు ప్రత్యార్థులుగా కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్ఆర్, బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు ఉన్నారు. అయితే ఇక్కడ కాంగ్రెస్ పార్టీ గట్టిగానే ఉంది. క్యాడర్ బలంగా ఉంది. కేఎల్ఆర్ నాన్ లోకల్ అనే ముద్రతో ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్నారు. మహేశ్వరంతో ఇప్పటి వరకు ఎలాంటి సంబంధాలూ లేవని విమర్శిస్తున్నారు. అభ్యర్థి ఎలా ఉన్నా ఇక్కడ క్యాడరే కాంగ్రెస్ బలమని తెలుస్తోంది. బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు స్థానికుడు అయినప్పటికీ మతతత్వ ఎజెండాతో ముందుకు పోవడంతో క్షేత్రస్థాయిలో ఆదరణ లేదు. ఈ క్రమంలో మంత్రి సబితాఇంద్రారెడ్డి, కేఎల్ఆర్ మధ్య ద్విముఖ పోరు ఉండనుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

పంచ్ తంత్రం!



ఇంటికో నౌకరంటిగిలిస్త డొక్కడు
ఆలోచనేలేని హామీ తోడ
ఊరూరికీ రైలు ఉరికిస్తనంటడు
పట్టాల సంగతే పట్టనోడు
పుణ్యతీర్థాలకూ పుకడు రైలంటడు
హేతుబద్ధత లేని కేతిగాడు
ఇంటింటికీ టీవి ఇద్దాము ఉచితంగా
ఆనందమే సర్వమంటడొకడు

ఓట్లు గుద్దించుకొనుటకే ఒడుపుగాని
హామీ గుర్తుంచుకొనువాడు భూమి లేడు
గెలుపుకోసము విడిచితే విలువలన్ని
గద్దెనెక్కిన వాడేమి ఉద్ధరించు

\- ఏనుగు నరసింహారెడ్డి

రెండో రోజు 140 నామినేషన్లు దాఖలు

నవతెలంగాణ -విలేకరులు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండో రోజూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. శనివారం మొత్తం 140 నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మంథని నియోజకవర్గం అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఖమ్మం జిల్లా మధిరలో బీఆర్ఎస్ పార్టీ రెబెల్ అభ్యర్థిగా ఉద్యమకారుడు బొమ్మెర రామ్మూర్తి నామినేషన్ వేశారు. ఖమ్మం నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా తుమ్మల నాగేశ్వరరావు తరపున ప్రపోజర్ కె.గోపాల్‌రావు 2వ సెట్ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ అభ్యర్థిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2 సెట్ల నామినేషన్ పత్రాలను అతని సోదరుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి దాఖలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో కాంగ్రెస్ తరపున జెడ్పీ చైర్మెన్ కోరం కనకయ్య నామినేషన్ వేశారు.

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో 14 నామినేషన్లు దాఖలు అయ్యాయి. బాన్సువాడ పట్టణంలో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనవాస్‌రెడ్డి నామినేషన్ వేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రెండో రోజు 13 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి



బుయ్యని మనోహర్‌రెడ్డి నామినేషన్ వేశారు. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా కాలే యాదయ్య, ఎల్‌బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి, రాజేందర్‌నగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్లు వేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. నల్లగొండ జిల్లాలో 23మంది, సూర్యాపేటలో నాలుగు, యాదాద్రిభువనగిరి జిల్లాలో నాలుగు నామినేషన్లు దాఖలు చేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.